తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్ : fb.com/vaartha Digital
Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-10-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 245 పేజీలు: 10+4 వెల: 6.50

## శ్రద్ధాంజలి



## కీ.శే. శ్రీమతి పురిటిపాటి విజయలక్ష్మి
(1951 – 05/10/2025)

ప్రేమకు ప్రతిరూపంగా.. ధైర్యానికి నిలువుటద్దంగా..
మా వెన్ను తట్టి నడిపించిన మీరు భౌతికంగా దూరమైనా..
మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచే వుంటారు.

భర్త
**పి. వీరా రెడ్డి**

సోదరుడు
**పి.పి. రెడ్డి - పి. రమ**

కుమారులు
**పి.వి. కృష్ణా రెడ్డి – పి. సుధారాణి**
**పి.వి. సుబ్బా రెడ్డి – పి. సుమలత**

కుమార్తె
**పి. ప్రసన్న కుమారి – పి. నాగి రెడ్డి**

### పెద్దకర్మ
2025 అక్టోబరు 15వ తేదీ
బుధవారం

**స్థలం:**
**హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, హైదరాబాద్.**

meil family



ఎస్టీ కేటగిరీ కింద రిజర్వేషన్లు కోరుతూ థానేలో ఆదివారం నిరసన ప్రదర్శన జరిపిన బంజారా కమ్యూనిటీ సభ్యులు

## సమరోత్సాహం

>> చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక స్థానాల్లో పార్టీ విజయం సాధించడానికి టీమ్ బిజెపిలా సమిష్టి కృషి చేయడం. సమావేశం దృష్టిలో ఉంచుకుని, పార్టీ అన్ని వర్గాల ప్రజలకు చేరువగా, సంకల్పంతో పనిచేయాలని స్పష్టమైన నిర్ణయాలు తీసుకుందన్నారు. అదేవిధంగా ఈ సమావేశంలో మాజీ పార్లమెంట్, అసెంబ్లీ, శాసన మండలి సభ్యులు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర పదాధికారులు, మాజీ పదాధికారులు ప్రతి ఒక్కరిని జెడ్పిటీసి ఇంచార్జెస్, జిల్లా ఇంచార్జెస్‌గా నియమించాలని నిర్ణయించడం జరిగింది. రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారం సాధించేలా సంస్థాగతంగా సైతం దృష్టి పెట్టారు. ఎక్కువ శాతం జెడ్పిటిసిలు బిజెపి కైవసం చేసుకోవడానికి ప్రత్యేక వ్యూహాలు రూపొందించుకుని ముందుకు వెళ్లలనున్నారు. అక్టోబర్ 8వ తేదీన మరో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి, ఇంచార్జెస్, మాజీ పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలతో చర్చించి, ఎన్నికలకు పూర్తి స్థాయిలో సమాయత్తమవ్వడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎంపిలు కూడా నియోజకవర్గ స్థాయిలో అభ్యర్థుల ఎంపిక, కమిటీలు ఏర్పాట్లపై సూచనలు తీసుకున్నారు. జిల్లా ఇంచార్జెస్ కూడా కమిటీలు ఏర్పాటు చేసి అభ్యర్థుల ఎంపిక, ప్రచారం మొదలైన కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించడం జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కమిటీలను ప్రకటించనున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటు నిమోజకవర్గంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల దృష్ట్యా ప్రత్యేక ఎజెండా రూపకల్పన చేసి, నగర ప్రాంతాల్లో నాయకులు కూడా పూర్తిగా పాల్గొనాలని నిర్ణయించడం జరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అభ్యర్థి ఎంపిక, అభిప్రాయ సేకరణ, ప్రకటన జరుగుతుందని తెలిపారు.

## నీరుగారుతున్న 'నరేగా'

>> పని కల్పించాలని చట్టం చెబుతోంది. అయితే వాస్తవ పరిస్థితులు చూస్తే సగటున ఏడాదికి 40 నుంచి 45 రోజులకు మించి పని కల్పించడం లేదు. కొన్ని సార్లు పనులు ఉన్నప్పటికి 25 శాతం మంది కూలీలకు పని కల్పించడం లేదు. దీనికి ప్రధాన కారనం పాలనాపరమైన నిర్లక్ష్యమని లిమిటెక్ తన సర్వేలో పేర్కొంది. దీంతో లక్షలాది మంది కూలీలు, మహిళాలు జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. ఈ ఉపాధి హామీ పనుల్లో మితిమీరిన కేంద్రం జోక్యంతో ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపింది, నిధులు విడుదల, జాబ్ కార్డులు తనిఖీలపై కేంద్రం పెత్తనం పెరగడంతో స్థానికపాలనా యంత్రాంగం చేతులు ముడుచకుని కూర్చోవల్సి వచ్చిందని తన నివేదికలో పేర్కొంది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎస్)ద్వారా ఆధారిత చెల్లింపులు వ్యవస్థ (ఏబిపిఎస్) డిజిటలైజేషన్ హాజరు కారణంగా డిజిటల్ వ్యవస్థపై అవగాహన లోపంతో లక్షలాది మంది వ్యవసాయ కూలీలలకు ఉపాధి దక్కడం లేదు. సాంకేతిక సమస్యలు, స్మార్ట్‌ఫోన్ లేక పోవడం, బయోమెట్రిక్ తేడాల కారనంగా కూడా అర్హులైన లక్షలాది మంది కూలీలు పాధిని కోల్పోతున్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ పథకంపై వ్యతిరేకతను వ్యక్తం చేస్తోందని తెలిపింది. అంతే కాకుండా ఈ పథకాన్ని గత కాంగ్రెస్ ప్రభుత్వ విఫల ప్రయోగంగా అభివర్ణించిందని, దీన్ని బలోపేతంగా చేసే దిశగా కేంద్రం ప్రభుత్వం ఏనాడు ప్రయత్నించలేదనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. కొవిడ్ అనంతరం కాలం కూడా దీన్ని బలోపేతం చేసేదిశగా కేంద్రం చర్యలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. అంతే కాకుండా అధికార యంత్రాంగం కూడా నుంచి కూడా ఎటువంటి మద్దతు లేక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయాన్ని లిమ్‌టెక్ వ్యక్తం చేసింది.

## కోటాపై నేడే విచారణ

>>తెలంగాణ ప్రభుత్వం పక్షాన బలమైన వాదనలు వినిపించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధమైంది. అందుకోసం సోమవారం సాయంత్రం డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఢిల్లీ వెళ్లారు. సీనియర్ న్యాయవాదులను కలిసి న్యాయపరమైన అంశాల్లో సలహాలు సూచనలు స్వీకరించి బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేలా ప్రభుత్వం పక్షాన బలమైన వాదనలు వినిపించనున్నారు. కాగా, ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న బీసీలకు 42 రిజర్వేషన్లు అడ్డుకునే ప్రయత్నం జరుగుతుందదని పిటిషనర్లకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.
బీసీ రిజర్వేషన్ల పెంపు రాజ్యాంగబద్ధంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ ల రిజర్వేషన్లకు నష్టం కలిగించేది కాదన్నారు. బలహీన వర్గాలకు చేయూతగా ఉండే విధంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాహుల్ గాంధీ ఆలోచన ప్రక్రియలో రిజర్వేషన్లు ముందుకు తీసుకుపోతున్నామని తెలిపారు. కొంతమంది వ్యక్తిగతంగా రెడ్డి జాగృతి పేరుతో కోర్టుల్లో పిటీషన్లు దాఖలు చేస్తున్నప్పటికీ అందరికీ సంబంధం అనే మాట కాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కల్మషం కలిగే పరిస్థితుల్లో బలహీన వర్గాలకు పెద్దలంతా సపోర్ట్‌గా ఉండాలని కోరారు. రాజ్యాంగంలో ఎస్సీ ఎస్టీలకు ఉన్న హక్కు మాదిరి బీసీ లకు కూడా హక్కు ఉండాలని చేస్తున్న ప్రయత్నం. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తో ఏకాభిప్రాయంతో ఈ బిల్లు ముందుకు పోయిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు న్యాయ స్థానాల్లో రాజకీయ పార్టీల మద్దతే ప్రజల మద్దతు అని చెప్పాలని కోరారు.

## అసెంబ్లీ ఆవరణలో జి.వెంకటస్వామి చిత్ర పటానికి చైర్మన్, స్పీకర్ నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు5:** దివంగత మహానేత జి.వెంకటస్వామి(కాకా) జయంతి సందర్భంగా అసెంబ్లీ మెంబర్స్ లాంజ్‌లో వెంకటస్వామి చిత్ర పటానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.వినోద్, అసెంబ్లీ సెక్రటరీ డా.వి.నరసింహాచార్యులు, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, అసెంబ్లీ, మండలి, చైర్మన్, స్పీకర్ పేషీల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే తొలి రోదసీ బట్వాడా వాహనం

### రన్‌వే లేకుండానే లాండింగ్

**హైపర్ సోనిక్ పరిశోధనలకు వేదిక**

**లాస్‌ఏంజెల్స్, అక్టోబర్ 5:** ప్రపంచంలోనే మొట్టమొదటి అంతరిక్ష డెలివరీ వాహనం సిద్ధమైంది. ఇది భూమిపై ఏ ప్రాంతానికైనా గంటలో సామగ్రిని తీసుకు రాగలదు. తన ఆర్క్ వాహనం క్లిష్టమైన సరుకును మోసుకు వెళ్లగలదని, రన్‌వేలు లేకుండా ల్యాండ్ చేయగలదని, యూఎస్ మిలిటరీకి హైపర్ సోనిక్ పరిశోధన వేదికగా పని చేయగలదని లాస్‌ఏంజెల్స్‌లో ఉన్న యువ అంతరిక్ష, రక్షణ సంస్థ ఇన్వర్షన్ వెల్లడించింది. తన మొదటి ప్రధాన అంతరిక్ష డెలివరీ నౌక ఆర్క్‌ను ఆవిష్కరించింది. ఈ రీ ఎంట్రీ వాహనం 500 పౌండ్ల మిషన్‌క్రిటికల్ కార్గోను కక్ష్య నుంచి భూమిపై ఉన్న ఏ ప్రాంతానికైనా గంట కన్నా తక్కువ సమయంలో చేరవేసేలా రూపొందించినట్టు కంపెనీ తన ఫ్యాక్టరీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఈ నౌక గురించి వెల్లడించింది. 2021లో కంపెనీని ప్రారంభించిన సహ వ్యవస్థాపకులు ఫియాచెట్టి, ఆస్టిన్ బ్రిగ్స్ ఆర్క్‌ను కొత్త రకమైన లాజిస్టిక్స్ ప్లాట్‌ఫామ్‌గా ప్రదర్శించారు. అంతరిక్ష నౌక ఆర్క్ 8 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పుతో సుమారు పెద్ద టేబుల్ టాప్ అంత ఉంటుంది. మెడికల్ కిట్ల నుంచి డ్రోన్ల వరకు దేనినైనా బట్వాడా చేసేలా దీనిని రూపొందించారు. ఇది 621 మైళ్ల క్రాస్ రేంజ్ కలిగి ఉంటుంది. దిగే ముందు విశాలమైన ప్రాంతాల్లో తిరగడానికి వీలు కల్పిస్తుంది. రన్‌వే అవసరం లేకుండా ఇది ప్యారాచూట్ కింద ల్యాండ్ అవుతుంది. ల్యాండింగ్ తర్వాత రక్షణ గేర్ లేకుండా సైనికులు దీనిని సురక్షితంగా నిర్వహించవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

## రేపు నారావారిపల్లికి ఎపి సిఎం చంద్రబాబు

**తిరుపతి,అక్టోబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మంగళవారం ఉదయం తిరుపతిజిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గం స్వగ్రామమైన నారావారిపల్లికి వస్తున్నారు. ఆయన సోదరుడు దివంగత రామ్మూర్తినాయుడు సంవత్సరీకంలో పాల్గొని పలు కార్యక్రమల్లో పాల్గోననున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి నారావారిపల్లికి రానుండటంతో జిల్లా యంత్రాంగం భారీ భద్రత ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పరిశీలించారు.

## వారం - వర్జ్యం

06-10-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
చతుర్దశి మ.12.24
పూర్వాభాద్ర ఉ.6.16, ఉత్తరాభాద్ర రా.4.01
వర్జ్యం : రా.3.42-6.36
దు.మ.12.20-1.08,
2) మ.2.43-3.31
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక చిక్కుల నుండి తప్పుకోవడానికి గాను ఆర్థిక వనరులను అన్వేషిస్తారు.

**వృషభం:** స్త్రీల వలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి. ఫలితాలు మాత్రం వెనువెంటనే రావు.

**మిథునం:**రాజకీయ పరపతి పెరుగుతుంది. కీళ్ళ బాధలు ఇబ్బంది పెడతాయి.

**కర్కాటకం:**శత్రు వర్గంలోని అనైక్యతను గుర్తించి వారితో ముఖాముఖి పోరాడి లాభపడతారు.

**సింహం:**స్పెక్యులేషన్ నామ మాత్ర లాభాలను ఇస్తుంది. ధన లాభం.

**కన్య :** ఎవ్వరిని నమ్మకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగిన సూచన.

**తుల :** ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. వస్తు కోనుగోలు.

**వృశ్చికం:**కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఆభరణాల కొనుగోలు.

**ధనుస్సు:** సంఘములోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మకరం:** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం తెలుసుకుంటారు.

**కుంభం:** షేర్లు, భూముల క్రయవిక్రయాలలో సొంత నిర్ణయాలు శ్రేయస్కరం.

**మీనం :** దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. సోదరీసోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# చలాన్ చెల్లింపు 45 రోజుల్లో తప్పనిసరి

## ట్రాఫిక్ ఉల్లంఘనపై కేంద్రం కఠిన నిర్ణయం

## 5 చలాన్లకంటే ఎక్కువ ఉంటే లైసెన్స్ సస్పెన్షన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు5:** రహదారులపై వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను విరుద్ధంగా పాటిస్తుంటే, ఇకపై కేంద్రం సీరియస్ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఇకపై తగిన మూల్యం చెల్లించక తప్పదు. ముఖ్యంగా చలాన్ల చెల్లింపులో నిర్లక్ష్యం చూపితే, చలాన్ పడితే పోలీసులు ఆపినప్పుడు చూద్దాంలే అనుకుంటే కుదరదిక. ఇక నుంచి 45 రోజుల్లోగా కట్టేయాలి. లేదా మీ తప్పేమీ లేకుంటే అప్పీల్ చేసుకోవాల్సి ఉంటుంది. అంతకుమించి ఆలస్యం చేస్తే మీ వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవచ్చు. డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్ కాకపోవచ్చు. వెహికల్‌పై ఐదుకు మించి చలాన్లు ఉంటే ఏకంగా లైసెన్సే రద్దవ్వచ్చు. సెంట్రల్ మోటారు వెహికిల్స్ రూల్స్ 1989లో కేంద్ర రవాణా శాఖ ఇటీవల కీలక సవరణలను ప్రతిపాదించింది. గతంలో చలాన్లపై చర్యల అంశం సవివరంగా లేకపోవడం వల్ల కొత్తగా పలు కఠిన నిబంధనల్ని కేంద్ర రవాణా శాఖ తీసుకొచ్చింది. ఈ మేరకు ఇందుకు సంబంధించిన డ్రాఫ్ట్ రూల్స్ నోటిఫికేషన్‌ను తాజాగా విడుదల చేసింది. చలాన్ల జారీ, చెల్లింపు, అప్పీల్ చేయడం తదితర అంశాలను డిజిటల్ మానిటరింగ్, ఆటోమేషన్ ఆధారంగా వేగవంతం చేయాలని తెలిపింది. రూల్స్‌ను ఉల్లంఘిస్తే వాహనదారుకు సంబంధిత అధికారులు మూడు రోజుల్లోగా ఎలక్ట్రానిక్ రూపంలో నోటీసు జారీ చేయాలని, ఫిజికల్ రూపంలో 15 రోజుల్లోగా నోటీసు పంపాలని స్పష్టం చేసింది. కేంద్ర రవాణా శాఖ ప్రతిపాదించిన ముసాయిదా నిబంధనలపై అభ్యంతరాలు, సూచనలు ఉంటే దిల్లీలో రహదారి రవాణా మంత్రిత్వశాఖలోని అదనపు కార్యదర్శికి పంపవచ్చని కేంద్రం తెలిపింది. ఈమెయిల్ కూడా చేయొచ్చని స్పష్టం చేసింది. ప్రస్తుతం చలాన్లు వాహన యజమాని పేరుతో మాత్రమే జారీ అవుతాయి. కొత్త రూల్స్ ప్రకారం, వాహనం నడిపిన వ్యక్తి అసలు యజమాని కాకపోతే, డ్రైవింగ్ చేసిన వ్యక్తి బాధ్యుడిగా లెక్కిస్తారు. ఈ సవరణల ప్రధాన లక్ష్యం వాహనదారులలో ట్రాఫిక్ రూల్స్ పట్ల మరింత జాగ్రత్త, బాధ్యత పెంచడం.
చలాన్ చెల్లింపు కోసం కొత్త నియమాలు.
**చెల్లింపు గడువు:** ఇప్పటి వరకు 90 రోజుల్లో చలాన్లు చెల్లించాలి. కొత్త నిబంధనల ప్రకారం, ప్రతి చలాన్‌కు 45 రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది.
**లైసెన్స్ రద్దు:** ఒక వాహనంపై ఐదు చలాన్లకు మించి ఉంటే, సంబంధిత అథారిటీ డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయవచ్చు.
**వాహన స్వాధీనం:** చలాన్ చెల్లించకపోతే, పోలీసులకు ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకునే అధికారం ఉంటుంది
**లావాదేవీల నిలిపివేత:** చలాన్ల చెల్లింపు సకాలంలో జరగకపోతే, ఆ వాహనంపై అన్ని రవాణా లావాదేవీలు నిలిపివేయబడతాయి, అంటే వాహనం అమ్మకం, కొనుగోలు, లైసెన్స్‌లో చిరునామా, పేరు మార్పు, రెన్యూవల్ ఇలా ఏమీ జరగదు.

## గడువుకు ముందే బీహార్ ఎన్నికలు

>>శుభ్రం చేయడంలో బీఎల్‌ఓలు కీలక పాత్ర పోషించారన్నారు. తమ పని ద్వారా 90,217 మంది బీఎల్‌ఓలు ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించే విషయంలో యావత్ దేశానికి ఒక ఉదాహరణగా నిలిచారని జ్ఞానేష్ కుమార్ కొనియాడారు. ప్రజాస్వామ్యం దిశగా బాట ఎలా ఉంటుందో ఈ ప్రపంచానికి చూపించిన ఘనత బిహార్‌లోని వైశాలి జిల్లాకు దక్కిందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసినందుకు ఓటర్లు అందరికీ సీఈసీ అభినందనలు తెలిపారు. ప్రతీ ఎన్నికకు ముందుగానే ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని ప్రజా ప్రాతినిధ్య చట్టం చెబుతోంది. మేం చట్టపరంగానే ముందుకు పోయాం. రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను నిర్వహించాం" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌ను విజయవంతం చేసిన స్ఫూర్తినే త్వరలో రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ కనబర్చాలని బీహార్ ప్రజలకు జ్ఞానేశ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యపు పండుగలుగా పేరొందిన పోలింగ్ తేదీలను ఛట్ పూజా మహోత్సవాల్లా ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు తప్పకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయని, వీటిలో ఎస్టీలకు 2, ఎస్సీలకు 38 రిజర్వ్ అయ్యాయని ఆయన చెప్పారు. ఎన్నికల సంఘం మొత్తం టీమ్ గత రెండు రోజులుగా రాష్ట్రంలోనే ఉందన్నారు. ఎన్నికల ఏర్పాట్ల అంశంపై బిహార్ పోలీసులు, దర్యాప్తు సంస్థలు, నోడల్ అధికారులతో ఈసీ అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో పారదర్శకత కోసం మాక్ పోల్స్‌ను నిర్వహించడం తప్పనిసరి. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులంతా వారి పరిధిలోని పోలింగ్ బూత్‌లకు పోలింగ్ ఏజెంట్లను నామినేట్ చేయాలి. ఓటింగ్ ప్రారంభం కావడానికి ముందే పోలింగ్ బూత్‌లకు పోలింగ్ ఏజెంట్లు చేరుకోవాలి. మాక్ పోల్స్‌ను ఆ ఏజెంట్లు స్వయంగా చూడాలి. పోలింగ్ బూత్‌లో ఓటింగ్ ప్రక్రియ ముగిశాక అక్కడున్న ప్రిసైడింగ్ అధికారి నుంచి ఫామ్ 17సీని పొందాలని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సూచించారు. "సొంత ఇళ్లు లేని వారు లేదా స్థానిక సంస్థ నుంచి ఇంకా ఇంటి నంబరును పొందని వారు తమ సమీపంలోని ఏదైనా ఒక ఇంటి నంబరును ఇవ్వొచ్చు. లేదంటే ఇంటి నంబరు స్థానంలో జీరో రాయొచ్చు. దీని గురించి ఓటర్లు బెంగపడాల్సిన అవసరం లేదు. అర్హులైన వారు ఓటుహక్కును కోల్పోయారనే ఆందోళన ఉన్నా, అనర్హులైన వారికి ఓటుహక్కును ఇచ్చారనే అభ్యంతరం ఉన్నా లేవనెత్తే, క్లెయిమ్ చేసే అవకాశం అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు ఉంది. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల దాఖలు చివరితేదీకి 10 రోజుల ముందు వరకు ఈ అంశంపై వారు స్థానిక ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల (ఈఆర్‌ఓ)కు సమాచారాన్ని ఇవ్వొచ్చు. వీటికి ఈఆర్‌ఓలు సత్వరం పరిష్కారాన్ని చూపిస్తారు. ఇంకా టైం మిగిలే ఉంది. దీన్ని రాజకీయ పార్టీలు సక్రమంగా వాడుకోవచ్చు. బీహార్‌లో 1.60 లక్షల మందికిపైగా బూత్ లెవల్ ఏజెంట్లను రాజకీయ పార్టీలే నామినేట్ చేశాయి. ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసినప్పటి నుంచి పోలింగ్ ముగిసే వరకు ఓటర్ల జాబితా ఫ్రీజ్ అవుతుందని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. వ్యయ పరిశీలకులే అందరు అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల ఖాతాలను పర్యవేక్షిస్తారు. ఒకవేళ ఎవరైనా అభ్యర్థికి క్రిమినల్ రికార్డు ఉంటే వార్తాపత్రికల ద్వారా ఆ సమాచారాన్ని ప్రజలకు తెలియపర్చాలని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ చెప్పారు.

## కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్‌పై నిషేధం

>> కోల్డ్‌రిఫ్ అనే దగ్గు సిరప్‌ను పిల్లలకు తాపించడం వల్ల 11 మంది చిన్నారులు మరణించిన సంఘటనపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం కావడంతో.. తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కీలక హెచ్చరికలు జారీ చేసింది. తమిళనాడులోని కాంచీపురం జిల్లాకు చెందిన శ్రీసన్ ఫార్మా ఈ ఏడాది మే నెలలో ఉత్పత్తి చేసిన కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్‌ను వినియోగించవద్దని తెలంగాణ డీసీఏ ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. ఈ సిరప్‌లోని ఎస్ఆర్ 13 బ్యాచ్ నంబర్‌కు చెందిన ఉత్పత్తిలో కిడ్నీల వైఫల్యానికి కారణమయ్యే డైథిలిన్ గ్లైకాల్ (డిఈజీ) అనే విషపూరిత కలుషితాలు ఉండవచ్చని కేంద్రం దర్యాప్తు చేస్తోంది. జలుబు, జ్వరం, దగ్గు నివారణకు వాడే ఈ సిరప్‌లో పారాసెటమాల్, ఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్, క్లోర్‌ఫెనిరమైన్ మలేట్ వంటి రసాయనాలతో పాటు, ఈ కలుషితమైన డీఈజీ కలిసిందని అనుమానిస్తున్నారు. కేంద్రం చేసిన సూచనల మేరకు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు ఈ ప్రత్యేక బ్యాచ్‌కు చెందిన సిరప్‌లను గుర్తించి, తక్షణమే వాటిని సీజ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మందుల దుకాణాలు, హోల్‌సేల్ వ్యాపారులు, ఆసుపత్రులలో ఈ సిరప్‌ల సరఫరాను తక్షణమే నిలిపివేయాలని అప్రమత్తం చేశారు. ఒకవేళ ఎవరైనా ఈ ఎస్ఆర్ 13 బ్యాచ్ సిరప్‌లను కలిగి ఉంటే.. వెంటనే డీసీఏ అధికారులకు లేదా టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని డీసీఏ ఒక ప్రకటనలో కోరింది.



పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో భారీ వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న నదులతో దెబ్బతిన్న వంతెన

## జూబ్లీ 'హిల్స్' ఎక్కేదెవరో?

>> నిర్ణయంపైనే నిలిచింది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఖరారు చేసిన తుది జాబితాలో నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్ ఉన్నారు. ఈ నలుగురిలో ఒకరిని ఏఐసీసీ ఎంపిక చేసి అధికారికంగా ప్రకటించనుంది. స్థానికంగా బలమైన, గెలుపు అవకాశాలు అధికంగా అని భావించిన వారికే టికెట్ దక్కే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో, రాష్ట్రానికి చెందిన కీలక నేతలు ఢిల్లీకి పయనం కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాదులతో చర్చించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలుస్తోంది. కాగా, జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక కీలక దశలో ఉన్నప్పుడు నేతలు ఢిల్లీ వెళుతుండటంతో, అధిష్ఠానంతో ఈ అంశంపై కూడా చర్చించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలోనే ఉపఎన్నిక షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండటంతో, వీలైనంత త్వరగా అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలోకి దూసుకెళ్లాలని కాంగ్రెస్ యోచిస్తోంది. దీంతో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ ఎవరిని వరిస్తుందనేది సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

**నేను ఎలాంటి రాజీనామా చేయడం లేదని స్పష్టం చేసిన దానం నాగేందర్**

తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ తీవ్రంగా స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అదంతా కేవలం దుష్ప్రచారం మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడి పూర్తి స్పష్టతనిచ్చారు. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదని, ఈ పుకార్లను ఎవరూ నమ్మవద్దని దానం నాగేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "నాపై గిట్టనివాళ్లే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నేను రాజీనామా చేస్తున్నాననే వార్త పూర్తిగా అవాస్తవం" అని ఆయన తేల్చిచెప్పారు. తనపై రాజకీయంగా కుట్ర జరుగుతోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పార్టీకి, ప్రజలకు తాను ఎప్పుడూ అంకితభావంతో పనిచేస్తానని, పదవులు వదులుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్‌లో కీలక నేతగా ఉన్న దానం నాగేందర్, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రిగా కూడా పనిచేశారు. ఇటీవలే తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, ఖైరతాబాద్ నియోజకవర్గంలో బలమైన నేతగా కొనసాగుతున్నారు. ఇలాంటి తరుణంలో ఆయన రాజీనామాపై వస్తున్న వదంతులు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కష్టకాలంలో తనకు మద్దతుగా నిలుస్తున్న ప్రజలకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## పిజి మెడికల్‌లో స్థానిక రిజర్వేషన్‌లు ఇవ్వండి

>>ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం స్థానికులకే కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. అదే విధానాన్ని తెలంగాణలో అమలు చేస్తే, 450 సీట్లలో కేవలం 68 సీట్లు మాత్రమే ఇతర రాష్ట్రాలకు వెళతాయని, మిగిలిన 382 సీట్లు తెలంగాణ విద్యార్థులకే లభిస్తాయని వివరించారు. ప్రస్తుత విధానం వల్ల మన విద్యార్థులు ఈ విలువైన అవకాశాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో, తెలంగాణవిద్యార్థులకు వైద్య విద్యలో అవకాశాలు పెంచడానికి జిల్లాల వారీగా మెడికల్ కాలేజీలను ప్రారంభించారని హరీష్‌రావు తెలిపారు. స్థానిక విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు అడ్మిషన్ రూల్స్‌లో సవరణలు చేసి, 2014 జూన్ 2 తర్వాత ఏర్పాటైన కాలేజీల్లోని 100 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ చేశారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల 520 ఎంబిబిఎస్ సీట్లు అదనంగా తెలంగాణ విద్యార్థులకు దక్కాయని అన్నారు. బి కేటగిరీ సీట్లలో 85 శాతం స్థానిక రిజర్వేషన్ వల్ల 1300 సీట్లు ప్రతి సంవత్సరం అదనంగా లభించాయని, మొత్తంగా 1,820 అదనపు ఎంబిబిఎస్ సీట్లు ప్రతి ఏటా తెలంగాణ విద్యార్థులకు లభించాయని వివరించారు.

## పీవోకేను వెనక్కి తీసుకోవాల్సిందే!

### ఎంపి సాత్నాసభలో ఆర్ఎస్ఎస్ చీఫ్

**సాత్నా,(ఎంపి), అక్టోబరు 5:** భారత్‌లాంటి ఇంటిలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ అనేది ఒక గది వంటిదని, మనలో అంతర్భాగంగా ఉన్న ఈ గదిలోకి ఆగంతకులు చొరబడ్డారని, తిరిగి మనం మన గదిని స్వాధీనంచేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లోని సాత్నాలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఆర్ఎస్ఎస్‌చీఫ్ పివోకేలో ఇటీవల పాక్‌సైన్యం అరాచకాలకు తెగబడిందని హెచ్చరించారు. అనేకమంది సింధీ సోదరులు అవిభాజ్య భారత్‌లోనే ఉండేందుకు ఇష్టపడ్డారని చెప్పిన భగవత్ యావత్‌భారత్ ఒక సొంత ఇల్లులాంటిదని, ఈ ఇంట్లోనే ఉన్న ఒక గదిని లాక్కున్నారని, ఆక్రమించుకున్నారని, రానున్న రోజుల్లో నేను ఆగదిని వెనక్కి తీసుకోవాలని పివోకేనుద్దేశించి చేసిన వ్యాఖ్యలకు సభలోనుంచి చప్పట్లు మారుమోగాయి. వేలాదిగా పివోకే ప్రజలు ఆవామి కార్యాచరణ కమిటీ కింద ఏర్పడి భారీ ర్యాలీ తీసిన సంగతి తెలిసిందే. ఆర్థికప్రయోజనాలు, రాజకీయ సంస్కరణలుచేపట్టాలని వారు డిమాండ్‌చేసారు. గడచిన మూడురోజులుగా పివోకేలో పాక్ సైన్యం చేసిన దాడులకుగాను పదిమంది చనిపోగా 100 మందికిపైగా తీవ్రగాయాలపాలయ్యారు. భాగ్‌జిల్లాలోని ధిర్‌కోట్‌లోనే నలుగురిని కాల్చి చంపారు. మీర్‌పూర్, చామ్యాతి, కోహలా, ముజఫరాబాద్‌లలో చెలరేగిన నిరసనలపై పాక్ కాల్పులు జరపడాన్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ తీవ్రంగా పరిగణించారు. ఇదే అంశం ప్రస్తావించిన ఆర్ఎస్ఎస్ చీఫ్ సరిహద్దుల్లో మన సెక్యూరిటీసామర్థ్యం మరింత పెంచుకోవాల్సి ఉందన్నారు. భారత్‌ప్రపంచ మైత్రిని ఆపరేషన్ సింధూర్‌తర్వాత ప్రపంచ దేశాల స్పందన రుజువు చేసిందని మోహన్ భగవత్ అన్నారు. చర్చలకంటే పాకిస్తాన్ అణిచివేత ధోరణితోనే పివోకేలో కొనసాగుతోందని అందువల్ల మన సొంతింట్లోని గదిని మనమే పరిరక్షించుకోవాలని మోహన్‌భగవత్ చెప్పారు.

## విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ

**విజయవాడ,అక్టోబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ నెలకొంది. దసరా సెలవులు ముగియడంతో హైదరాబాద్‌కు తిరిగివెళ్లే వాహనాలతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు బారులు తీరాయి. కీసర, గట్టుభీమవరం, చిట్యాల, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీగా రద్దీ నెలకొంది. వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతుండటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. విజయవాడ నగరంలోను పండుగ శెలవులకు వచ్చి వివిధ ప్రదేశాలకు తిరిగి వెళ్తున్న వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంది. బస్‌స్టేషన్ నుంచి ఫ్లైవోవరు చేరుకునే దారిలోను ట్రాఫిక్ అధికంగా ఉంది.



విజయవాడ–హైదరాబాద్ రహదారిపై ట్రాఫిక్ దృశ్యం

సాహితీ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-10-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 245 పేజీలు: 10+4 వెల: 6.50

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై విజయ్ వ్యాన్ డ్రైవర్ అరెస్టు
దేశంలో ఆగని మత్తు దందాలు
5



# జూబ్లీ 'హిల్స్' ఎక్కేదెవరో?

## నలుగురు అభ్యర్థులతో కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనకు జాబితా

### నవీన్ యాదవ్, సిఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్, అంజన్ కుమార్‌లలో అదృష్టం ఎవరిదో!

### త్వరలో ఉప ఎన్నిక షెడ్యూలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు5:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అభ్యర్థి ఎంపికపై రాష్ట్ర నాయకత్వం తన కసరత్తును పూర్తి చేసి, నలుగురు ఆశావహుల పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాను పార్టీ అధిష్ఠానానికి పంపనుండటంతో, ఇప్పుడు అందరి దృష్టి ఢిల్లీ పెద్దల >>2

# కోటాపై నేడే విచారణ




## సుప్రీంలో వాదనలకు రాష్ట్ర సర్కార్ సిద్ధం

## సిఎం రేవంత్‌తో మంత్రులు కీలక సమావేశం

### ఢిల్లీ వెళ్లిన డి.సిఎం భట్టి, మంత్రి పొన్నం, పిసిసి చీఫ్ మహేష్

### ఇప్పటికే హైకోర్టు విచారణలో ఓ పిటిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు5:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో ఏం జరగబోతున్నదనే ఉత్కంఠ నెలకొంది. ఈ పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టులో విచారణకు రాబోతున్న వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంత్రులు భేటీ కావడం ఆసక్తిగా మారింది. ఆదివారం జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్ భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ పై చర్చించారు. తాజా పరిణామాల నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లపై ఎలా ముందుకు వెళ్లాలనే విషయాన్ని చర్చించారు. సీఎంతో భేటీ తర్వాత ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ భట్టి విక్రమార్క, మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి భేటీ అయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, తాజా పరిస్థితులను మీనాక్షికి వివరించారు. బీసీ రిజర్వేషన్లను చాలెంజ్ చేస్తూ ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో ఓ పిటిషన్ విచారణలో ఉంది. తాజాగా సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలు కావడం హాట్ టాపిక్‌గా మారింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలును కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఈ విషయంలో లీగల్‌గా ఎలా ఫైట్ చేయాలి? కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది? వాటిని ఎలా అధిగమించాలి, ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా ఎలాంటి వాదనలు వినిపించాలి అనే విషయాలను అంశాలను ఆదివారం సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు చర్చించినట్లు తెలుస్తోంది. ఒక వేళ రిజర్వేషన్ల అమలుకు కోర్టు నుంచి అనుమతి లభించకపోతే పార్టీ తరపున రిజర్వేషన్లు ఇచ్చేందుకు హస్తం పార్టీ రెడీగా ఉన్న నేపథ్యంలో సోమవారం సుప్రీంకోర్టు ఏం నిర్ణయం తీసుకోబోతున్నది అనేది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ జారీ చేసిన జీవో పై సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలు కావడంతో.. రిజర్వేషన్ల అంశంపై కోర్టులో వ్యవహరించాల్సిన అంశాలపై న్యాయ కోవిదులతో సలహాలు సూచనలు స్వీకరించి బలమైన వాదనలు వినిపించేలా ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసుకుంది..స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కృతనిశ్చయంతో ఇప్పటికే జరగాల్సిన ఎన్నికలు ఆలస్యం అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మొత్తం కేబినెట్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ అంత కలిసికట్టుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ఇప్పటికే జీవో 9 జారీ చేసింది. ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల షెడ్యూల్ కూడా ప్రకటించింది. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలుపై సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలైందున >>2

# 'సానికం'పై సమరోత్సాహం

## ఎక్కువ జడ్పీటీసీ సీట్లు సాధించేందుకు బిజెపి వ్యూహం

### పదాధికారుల సమావేశంలో పార్టీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

### పాత, కొత్త నేతలందరు సమైక్యంగా శ్రమించాలని పిలుపు




ఆదివారం పదాధికారుల సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాత వార్త:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక స్థానాల్లో పార్టీ విజయం సాధించడానికి బిజెపి నేతలంతా ఒక టీంలా సమిష్టి కృషి చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు నేతలకు పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన రాష్ట్ర పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర పదాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ, శాసనసభాపక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్ష నాయకులు ఏ.వి.ఎన్. రెడ్డి, బిజెపి కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల సహ ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలు చర్చించారు. రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల (జెడ్పిటీసి, ఎంపిటిసి, సర్పంచ్) ఎన్నికలకు సమాయత్తం కావాలని, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేలా కృషిచేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రత్యేకంగా గత బిఆర్ఎస్ సర్కారు హయాంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిన అంశాలను, అదేవిధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను, మోసాలను ప్రజలకు తెలియజెప్పేలా ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో గత 22 నెలలుగా కాంగ్రెస్ సర్కారు చేసిన కుట్రలు, నాటకాలను స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా గ్రామీణ పాలనను నిర్వీర్యం చేసిన విషయాలను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఆఫీస్ బేరర్స్ సూచనలు సేకరించాలని, పాత, కొత్త నాయకులు అనే భేదం లేకుండా పార్టీ కోసం శ్రమించి పనిచేసిన వారందరికీ >>2




ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న సిఇసి జ్ఞానేష్‌కుమార్. ఇతర కమిషనర్లు

# గడువుకు ముందే బీహార్ ఎన్నికలు

## సమగ్ర ఓటర్ల జాబితా సవరణ 'సర్' పూర్తి

### బూత్‌స్థాయి అధికారులకూ తొలిసారి శిక్షణ: సిఇసి జ్ఞానేష్ కుమార్

**పాట్నా, అక్టోబరు 5:** బీహార్ అసెంబ్లీ గడువు నవంబరు 22న ముగుస్తుందని, అంతకంటే ముందే రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రకటించారు. బీహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను ఈ ఏడాది జూన్ 24న ప్రారంభించి, నిర్ణీత గడువుతేదీలోగా పూర్తి చేశామని వెల్లడించారు. ఆదివారం పాట్నాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జ్ఞానేశ్ కుమార్ మాట్లాడారు. తొలిసారిగా బూత్ లెవల్ అధికారులకు కూడా తాము ట్రైనింగ్ ఇప్పించామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో విరామం ఎరుగకుండా పనిచేసిన బీఎల్ఓలకు మానసిక మోటివేషన్ కోసం గౌరవ భత్యాన్ని చెల్లించామని ఆయన వెల్లడించారు. ఓటరు జాబితాలను >>2



## కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్‌పై

# నిషేధం

**హైదరాబాద్,అక్టోబర్ 5, ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో 'కోల్డ్‌రిఫ్' దగ్గు సిరప్ సేవించిన కారణంగా 11 మంది చిన్నారులు మరణించడంతో తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఏ)అప్రమత్తమైంది. కిడ్నీ వైఫల్యానికి కారణమయ్యే డైథిలిన్ గ్లైకాల్ కలుషితం ఉన్న ఎస్ఆర్ 13 బ్యాచ్ సిరప్‌ను ఉపయోగించవద్దని డీసీఏ హెచ్చరించింది. రాష్ట్రంలోని మందుల దుకాణాలు, ఆసుపత్రులలో ఈ బ్యాచ్ సిరప్‌లను సీజ్ చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించింది. చిన్నారులకు మందు సిఫారసు చేసిన ఓ వైద్యుడిని మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. దగ్గు మందుల కారణంగా దేశంలో జరిగిన విషాద ఘటనల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో >>2

మధ్యప్రదేశ్‌లో దగ్గుమందు తాగి 11 మంది చిన్నారులు మృతి 9

## ప్రపంచంలోనే తొలి రోదసీ బట్వాడా వాహనం



రన్‌వే లేకుండానే ల్యాండింగ్
హైపర్ సోనిక్ పరిశోధనలకు వేదిక 2



## చలాన్ చెల్లింపు 45 రోజుల్లో తప్పనిసరి

ట్రాఫిక్ ఉల్లంఘనపై కేంద్రం కఠిన నిర్ణయం
5 చలాన్లకంటే ఎక్కువ ఉంటే లైసెన్స్ సస్పెన్షన్ 2



# పిజి మెడికల్‌లో స్థానిక రిజర్వేషన్లు ఇవ్వండి

## ప్రస్తుత నోటిఫికేషన్ రద్దుచేసి కొత్త జీవో ఇవ్వాలి

### సిఎం రేవంత్‌కు హరీష్ బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు5:** పిజి వైద్య విద్యా ప్రవేశాల్లో రిజర్వేషన్ లేకపోవడం వల్ల తెలంగాణ విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్రమైన అన్యాయంపై తక్షణ చర్యలు తీసుకోవాలనే డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీమంత్రి, సిద్ధిపేట ఎంఎల్ఎ హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణలో పిజి వైద్య విద్య అభ్యసించాలనుకుంటున్న స్థానిక విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వందలాది సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆరోపించారు. పిజి మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,801 పిజి సీట్లు అందుబాటులో ఉండగా, అందులో సగం రాష్ట్ర కోటా కింద భర్తీ అవుతాయని తెలిపారు. ఈ రాష్ట్ర కోటాలోని 25 శాతం, అంటే సుమారు 450 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కిందకు వస్తాయని వెల్లడించారు. అయితే, ఈ సీట్లలో స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించకపోవడంతో అవన్నీ ఓపెన్ కేటగిరీలో ఇతర రాష్ట్రాల వారికి దక్కుతున్నాయని హరీష్‌రావు తన లేఖలో ఆందోళన వ్యక్తంచేశారు. పొరుగు రాష్ట్రమైన >>2



## మరో 4 రోజులు వర్ష సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు5:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురిసిన భారీ వర్షాల నుంచి కొలుకుంటున్న ప్రజలకు వాతావరణ శాఖ మరో అలర్ట్ ఇచ్చింది. రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. దీంతో పాటు మంగళవారం రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కా వర్షాలు కురుస్తాయని, ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# నీరుగారుతున్న 'నరేగా'



ఉపాధి హామీ పథకానికి టెక్నాలజి పేరుతో నియంత్రణ!

## వేతనాల చెల్లింపుల్లో జాప్యం

## యేడాదికి 45 రోజులే పని కల్పన

**హైదరాబాద్,అక్టోబర్ 5, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లోని డిసాయ కూలీలకు వ్యవసాయ పనులు, లేని కాలంలో జీవనోపాధి కల్పించే లక్ష్యంతో రూపొందించిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని(నరేగా) కేంద్రం ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తూ వ్యవసాయ కూలీలకు వెతులు మిగిలుస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఉపాధి హామీ పథకం కోసం బడ్జెట్ కేటాయింపులకు కోత పెడుతున్నదనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఉదాహరణకు 2022-2023 ఆర్థిక సంవత్సరంలో ఈ ఉపాధి హామీ పనులకు రూ. 60,000 కోట్లు కేటాయింపులు జరిగాయి. అంతకుముందు ఏడాదీ సవరించిన బడ్జెట్ కేటాయింపులు రూ.7300 కోట్లు ఉండగా పెరగాల్సిన కేటాయింపులపై కోత పడింది. అనుబంధ కటాయింపులలో తరచూ జరుగుతున్న జరుగుతున్న జాప్యం కూడా వ్యసాయ కూలీలను ఆర్థికంగా కూడా దెబ్బతీస్తోంది. వ్యవసాయ్ ఆఫ్ సీజన్ ముగిసిన తర్వాత అనుబంధ కేటాయింపులు జరగడంతో లక్షలాది మంది కూలీలు ఉపాధి పొందలేక పోవడం, సకాలంలో వేతనాలు లభించకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వేతనాల చెల్లిపుల్లో జాప్యం కారనంగా వేతన బకాయిలు భారీగా పెరిగిపోయాయి. దీంతో ఉపాధికార్మికులకు ఆ పనులపై నమ్మకం సన్నగిల్లుతోంది. ఉపాది హామీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్రవేసి గత సెప్టెంబర్ 5తో 20 సంవత్సరాలు పూర్తయిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వంలో ఉపాధి హామీ కూలీలకు వేతనాల చెల్లింపులో జాప్యాలు నిత్య కృత్యంగా మారాయనే విమర్శలు వస్తున్నాయి. వేతనాల కోసం వారాలు లేదా నెలల తరబడి వ్యవసాయ కూలీలు ఎదురుచూడాల్సిన దుస్థితి ఎర్పడుతోందని అయితే సంబంధిత మంత్రిత్వశాఖ మాత్రం జాప్యాన్ని ఒప్పుకోకుండా ఆ నిందను రాష్ట్రాలపై వేయడానికి ఏమాత్రం సంకోచించడం లేదనే విమర్శలు సైతం వస్తున్నాయి. 2022లోనే లిబ్‌టెక్ ఇండియా అనే స్వతంత్ర సంస్థ దీనిపై అధ్యయనం చేసి చట్టపరంగా తప్పనిసరిగా 15 రోజుల్లో వేతనాలు చెల్లించాల్సి ఉండగా 71 శాతం వేతనాలలో తీవ్ర జాప్యం జరిగినట్లు వెల్లడించింది. వేతనాల చెల్లింపులో ఆలస్యం కారణంగా అప్పటికే ఆర్థికంగా చితికిపోయి ఉన్న వ్యవసాయ కూలీలు మరింత దుస్థితిలోకి కూరుకుపోతున్నారని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం వైఖరి కారణంగా ఉపాధి హామీ పథకం అసలు లక్ష్యం దెబ్బతినే పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొంది. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల >>2

వార్త

ఎవరైనా కోపం తెచ్చుకోగలరు. కాని సరైన వ్యక్తిపై సరైన స్థాయిలో, సరైన సమయంలో, సరైన విధానంలో కోపగించుకోవడం మాత్రం అందరికీ సాధ్యం కాదు.

-అరిస్టాటిల్

# అర్హులకు అందలాలు అందేనా?

ప్రజాస్వామ్య పాలనలో మానవీయ కోణం ఎంతో అవసరం.ఆ నేపథ్యంలోనే పేద బడుగు బలహీన వర్గాలకు ఉచిత పథకాలు అమలవుతుంటాయి. అవన్నీ నిజమైన అర్హులకు అందితే ఎవరికీ ఏఅభ్యంతరం కలుగదు. ప్రధానంగా బిపిఎల్ వర్గాలకు అందితే స్వాగతించదగినదే. కానీ ప్రస్తుత పాలనల్లో భిన్న విధానాలు అనుసరించడం ఎన్నికలొచ్చినప్పుడు మాత్రమే కొన్ని ఉచిత పథకాలను ప్రకటించడం అసలు సిసలు పథకాలను సక్రమ అమలును పట్టించుకోకపోవడం వల్లనే ప్రభుత్వాలు విమర్శకు గురవుతున్నాయి. నాలుగు దశాబ్దాలుగా జరుగుతున్న ఎన్నికల ముందు తతంగాలలో మందిని తమకు అనుకూలంగా మార్చుకోవడం ప్రస్తుత రాజకీయ మంత్రాంగం మారింది. ఆనక అమలులోనూ చిత్తశుద్ధి కొరవడుతుందన్నది. ప్రజలను పరాన్నజీవులుగా తయారు చేయొద్దని ఉచితల పంపిణీపై ఈ దేశ అత్యున్నత ధర్మాసనం ఏనాడో అభిప్రాయపడింది. మరికొన్ని సందర్భాలలో ఉచితాలు అనుభవించడానికి అలవాటుపడి జనం తమ సొంత జీవనోపాధులపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారనే అనుభవాలను కూడా చూసాము. అయినా ఉచితాల విషయంలో ఏ రాజకీయ పార్టీ నిష్ఠగా ఉండలేకపోతోంది. ఇప్పుడు 2 నెలల్లో బీహారు ఎన్నికలు రాబోతున్నాయి. బీహార్ ఎన్నికల ప్రభ ఏ మాత్రం తగ్గిపోకుండా వివిధ రాజకీయ పార్టీలు టక్కు టమార గోకర్ణ విద్యలు ప్రవేశించడానికి ఏనాడో అంకురార్పణ చేశాయి. దేశంలో పేదలు అణగారిన వర్గాల కోసం ప్రభుత్వ పథకాలకు కొరత లేదు, కానీ వాటి కింద ఆశించిన ప్రయోజనాలు ఉద్దేశించిన లబ్ధిదారులకు అరుదుగా చేరుతాయనే అపప్రథ ఉండనే ఉంది. వాటి అమలును పటిష్ట పరచాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. అది మాని ఎన్నికల సమయంలో కొత్తగా రాజకీయ సంకల్పం చెప్పుకోవడం జరుగుతోంది. ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజున ఓటర్లకు డబ్బు పంపిణీ ఎలా జరుగుతుందో తెలియనిది కాదు. వచ్చే ఏడాది తమిళనాడుకు కూడా ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికలు అనగానే బీహారు మాత్రమే గుర్తొచ్చే విన్యాసాలను ఇప్పటికే ఎన్నో చూసాం. ఎన్నికల కమిషన్ నిర్ణయాలు వివిధ రాజకీయ పార్టీలతో వ్యవహరిస్తున్న తీరును విపక్షాలు తప్పు పట్టే స్థాయికి చేరింది. అక్కడ ఓటర్ల సవరణ కార్యక్రమంలో అనుమానాస్పద అంశాలన్నీ విమర్శలకు గురవుతున్నాయి. వీటికి తోడు ఎన్నికల కమిషన్ అక్కడి విధానాలను ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించడంతో బీహారుప్రయోగాన్ని రాజకీయ పార్టీలెవరూ మరచిపోలేకపోతున్నారు. బీహారులోమళ్లీ అధికారం హస్తగతం చేసుకోవాలని ఆశిస్తున్న ప్రధాన పార్టీకి ఎన్నికల కమిషన్ ద్వారా ఏదో అనుచిత లబ్ధికలుగబోతోందన్న సందేహం ప్రజా బహుళ్యంలోకి బాగా వెళ్లిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ప్రస్తుత పాలనను బేరీజు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.అంతేగాక తాజాగా ప్రస్తుతప్రభుత్వాధినేత నితీష్‌కుమార్ తన నేతృత్వంలోని కూటమిప్రభుత్వం తరపున ప్రజా సంక్షేమ పథకాలు ప్రకటించారు.ప్రస్తుతం బీహార్లో ప్రభుత్వ ఉచితాల వర్షంకురుస్తోంది.గత పదేళ్లుగా అక్కడ అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి అకస్మాత్తుగా ప్రజలపై ప్రేమపుట్టుకొచ్చింది.బీహార్లో అనతి కాలం పనిచేసిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది నితీష్ కుమార్. గత 20సంవత్సరాలుగా 278రోజుల స్వల్పకాలిక పాలనతో రాష్ట్రంలో అధికారంలోఉన్నారు. అకస్మాత్తుగా దూరదృష్టిగల నాయకుడిగా మారారు. దాదాపు అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికసహాయ పథకాలను ప్రకటించారు. ఏ వర్గాన్ని వదిలిపెట్టలేదు. చూస్తుంటే మొన్నటి మహారాష్ట్ర ఎన్నికలలో లడ్కి బెహన్ యోజన పథకం ఇచ్చిన ఫలితాలనే ఇస్తాయనే నమ్మకం కలిగినా ఆశ్చర్యపడనక్కర్లేదు. వాటిలో గత నెల ఆగస్టు 1నుంచి నెలకు 125 యూనిట్ల వరకు ఉచితవిద్యుత్,ఎస్సీ,ఎస్టీ వర్గాలలో పని చేసే 10,000మందికి పైగా 'వికాస్ మిత్ర'లకు ఒక్కొక్కరికి రూ 25 వేలు, టాబ్లెట్ల కొనుగోలు కోసం ప్రజలకు రూ10వేలు,30వేల మందికి పైగా విద్యావేత్తలకు రూ.10 వేలు, వెనుకబడిన తరగతులు, మైనారి టీలలో పనిచేస్తున్నారు.సీనియర్ సిటిజన్లకు పెన్షన్‌పెంచారు. రెండేళ్లపాటు నెలకు వెయ్యి రూపాయల మేరకు నిరుద్యోగభృతిని అందించబోతున్నారు.ముఖ్యమంత్రి మహిళా రోజ్గార్ యోజన కింద 75లక్షలమంది మహిళా వ్యవస్థాపకులకు ఒక్కొక్కరికి రూ.10వేలు అందిస్తుంది. దీని మొదటి విడత తరువాత 2లక్షలకు పెంచుతారు. వృద్ధులకు,వికలాంగులకు భరోసా ప్యాకేజీలు పెంచారు. కొన్ని వర్గాలకు భత్యాలు పెంచారు.టీచర్ల నియామకం జరుగుతోందని ముఖ్యమంత్రి ప్రకటించారు. అంగన్‌వాడి సేవికల జీతం 7 వేల నుంచి 9వేలకు పెంపు, కూడా ఇందులో భాగమే.దానికి ప్రతిగా ప్రతిపక్ష ఆర్‌జెడి పార్టీ నెలకు 200 విద్యుత్ యూనిట్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు, మహిళలకు ఆర్థిక సహాయం నేరుగా 2500 ఇస్తామన్నారు. ఇలా ఎన్నికల సమయంలో ఒకరికి పోటీగా మరొకరు ఉచితాలు ప్రకటించడం పరోక్షం గా ప్రలోభ పెట్టడమే. దేశంలో స్వేచ్ఛగా న్యాయంగా ఎన్నికలను నిర్ధారించడానికి స్వర్గం భూమిని కదిలించే ఎన్నికల సంఘం వేరేవిధంగా చూడటానికి ప్రతి కారణం ఉంది. ఎందుకంటే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాతే మోడల్ ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చే ముందు ఇలా పరీక్ష ఓట్ల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న ఈఉచిత ప్రచారాన్ని అంతం చేయక పోతే, నిష్పాక్షికమైన ఎన్నికల ప్రచారంపై ఉన్న అంచనాలు అగాధం లోకి పడిపోతాయి. ఇలాంటి వాటిని నిరోధించేందుకు అనుచితంగా ప్రకటించేందుకు ఎన్నికల సంఘం కూడా యోచించాలి.

ఒకే రకం కూడా నువ్వు కార్యాచరణకు పూనుకోకుండా లక్షల సార్లు ఆలోచించడం వల్ల ప్రయోజనం ఉండదు.



గురునానక్

ప్రపంచంలో అన్నింటికన్నా కష్టమైన విషయం ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకోవడమే.



అలివర్ గోల్డ్‌స్మిత్

# మన ఆర్థిక వ్యవస్థపై అమెరికా షట్‌డౌన్ ప్రభావం?

**కొత్త హెచ్1బి వీసా పిటిషన్‌ను దాఖలు చేయడానికి లేదా ఉద్యోగాన్ని మార్చడానికి, ముందుగా లేబర్ కండిషన్ అప్లికేషన్ను డీఓఎల్ ధృవీకరించాలి. ఓఎఫ్ఎల్‌సీ పనిచేయక పోవడంతో కొత్త ఎల్సీ లు దాఖలు చేయడానికి వీలులేకుండా పోయింది. దీని అర్థం హెచ్1బి వ్యవస్థ నుండి అత్యధికంగా లబ్ధిపొందుతున్న నైపుణ్యం గల భారతీయ నిపుణులు వేలాది మంది అనిశ్చితిలో చిక్కుకున్నారు. వారి ఉద్యోగ మార్పిడులు, కొత్త నియామకాలు నిరవధికంగా ఆగిపోయాయి. అదేవిధంగా, శాశ్వత నివాసానికి అవసరం అయిన గ్రీన్ కార్డ్ దరఖాస్తుల ప్రక్రియ కూడా స్తంభించింది. ఈ ప్రక్రియకు కూడా డీఓఎల్ నుండి ధృవీకరణలు లేదా ప్రస్తు త వేతనాల నిర్ధారణలు అవసరం. ఇది ప్రవాస భారతీయులకు ఇప్పటికే కఠినంగా ఉన్న నిరీక్షణ సమయాన్ని మరింత పెంచుతోంది. షట్‌డౌన్ ఎక్కువ కాలం కొనసాగితే అమెరి కన్ కంపెనీలు ఖర్చులను తగ్గించుకుంటాయి. దీనివల్ల మన దేశ ఐటీ సేవల ఎగుమతులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి పెరిగి, భారత స్టాక్‌మార్కెట్లు నష్టపోవడం, రూపాయి విలువ తగ్గడం వంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావచ్చు.**

డి జయరాం

ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తి అయిన అమెరికాలో ఒక వింత సమస్య తరచుగా తలెత్తుతుంది. అదే ప్రభుత్వ కార్యకలాపాల నిలుపుదల లేదా షట్‌డౌన్. ఇది కేవలం తాత్కాలిక పాలనాపరమైన ఇబ్బంది కాదు. రాజకీయ నాయకులు దేశ బడ్జెట్ విషయంలో ఒక నిర్ణయానికి రాలేకపోతే, దేశ కార్యకలాపాలే ఆగిపోయే ప్రమాదకరమైన సంక్షోభం ఇది. అమెరికాలో ప్రభుత్వ కార్యకలాపాలు సజావుగా సాగాలంటే అక్కడి పార్లమెంటు అయిన కాంగ్రెస్‌ఖర్చు పెట్టడానికి చట్టపరమైన అనుమతి ఇవ్వాలి. ఈ విధానం యాంటీడిఫిషియెన్సీ చట్టం (ఎడిఎ) అనే పాత చట్టంలో ఉంది. ఫెడరల్ ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులు అందించేందుకు పార్లమెంట్ తప్పనిసరిగా ప్రతి సంవత్సరం ఒక బడ్జెట్‌ను లేదా తాత్కాలిక ఖర్చు బిల్లును ఆమోదించాలి. ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి కాంగ్రెస్ ఈ నిధుల బిల్లులను ఆమోదించడంలో విఫలమైతే, ప్రభుత్వంలో అత్యవసరం కాని విభాగాల సేవలు తాత్కాలికంగా మూసివేయబడతాయి. దీనినే ప్రభుత్వ షట్‌డౌన్ అంటారు. గత దశాబ్దాలలో ఈ పరిస్థితి తరచుగా సంభవించడం పెరిగింది. ఇది ఒక సాధారణ ప్రక్రియ లోపం కాస్తా, అపారమైననష్టం కలిగించే శక్తివంతమైన రాజకీయ అస్త్రంగా మారింది. కొన్ని నిధులను ఆమోదించి, మరికొన్నింటిని ఆమోదించకపోతే అది పాక్షిక షట్‌డౌన్ అవుతుంది. ఇది అధ్యక్షుడు ఇష్టపూర్వకంగా తీసుకునే నిర్ణయం కాదు. బడ్జెట్ కేటాయింపుల్లో కాంగ్రెస్ విఫలమైనప్పుడు చట్టంప్రకారం స్వయం చాలకంగా జరిగే ప్రక్రియ ఇది. అందుకే, ఈ వైఫల్యానికి కారణం, పరిష్కారం రెండూ కాంగ్రెస్ చేతుల్లోనే ఉంటాయి. నిజానికి, ఈ చట్టాన్ని డబ్బు వృథా కాకుండా ఉండాలనే ఉద్దేశంతో తెచ్చారు. కానీ ఇప్పుడు, రాజకీయ పార్టీలు తమ విధానపరమైన డిమాండ్లను నెరవేర్చుకోవడానికి బడ్జెట్ ఆమోదాన్ని అడ్డుకోవడం ద్వారా దీనిని ఒక రాజకీయఒత్తిడి సాధనంగా ఉపయోగిస్తున్నాయి. అంటే, డబ్బును నియంత్రించే చట్టం, ప్రభుత్వ కార్యకలాపాలను ఆపేసే సాధనంగా మారిందన్నమాట. షట్‌డౌన్‌కు అసలు అధికారం అమెరికా రాజ్యాంగంలోని ప్రాథమిక నిర్మాణంలో ఉంది. యుఎస్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 1, సెక్షన్ 9, క్లాజ్ 7 ప్రకారం, 'చట్టం ద్వారా చేసిన కేటాయింపుల పర్యవసానంగా తప్ప, ఖజానా నుండి డబ్బు తీయరాదు.' ప్రభుత్వ ఖజానాపై అంతిమ అధికారం పూర్తిగా కాంగ్రెస్‌కే చెందుతుంది. దీని అర్థం, ప్రభుత్వ కార్యకలాపాలు సాగడానికి కాంగ్రెస్ డబ్బును ఆమోదించాలి. ఒకవేళ ఆమోదించకపోతే, చట్టబద్ధంగా కార్యకలాపాలు ఆగిపోతాయి. కాంగ్రెస్ నిధులను ఆమోదించడంలో విఫలమైతే, చట్టాన్ని గౌరవించి, ఖర్చును ఆపడం తప్పనిసరి. అందుకే, షట్‌డౌన్ అనేది బడ్జెట్ ఆమోదం విఫలమైనప్పుడు ఆటోమేటిక్‌గా సంభవించే ఒక పరిణామం. ఈ షట్‌డౌన్‌కు ప్రధాన కారణం పార్టీల మధ్య ఉన్న తీవ్రమైన విభేదాలు. ఈ సంక్షోభం కేవలం ఆర్థిక సమస్య కాదు, ఇది తీవ్రమైన రాజకీయ విభేదాల ఫలితం. ఉదాహరణకు, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒకవైపు, డెమొక్రాట్‌పార్టీ మరోవైపు మొండి పట్టుదలకుపోవడం ఈ సంక్షోభానికి దారితీస్తుంది. సాధారణంగా, ఆరోగ్య సంరక్షణ నిధులు అంటే మెడికేయిడ్ కోతలు, వలస విధానాలు వంటి కీలక అంశాలపై రాజకీయ డిమాండ్లను నిధుల బిల్లుకు జతచేయాలని డెమోక్రాట్లు ప్రయత్నించడంవల్ల ప్రతిష్టంభన ఏర్పడుతుంది. డెమొక్రాట్‌లు ఆరోగ్య సంరక్షణ పథకాలకు నిధులు కొనసాగించాలని పట్టుబడుతుంటే, అధ్యక్షుడుట్రంప్ దీన్ని తన రాజకీయ ఆయుధంగా వాడుకుంటారు. డెమొ




క్రాట్ల పాలనలోని రాష్ట్రాలకు కేటాయించిన అభివృద్ధి నిధులను నిలిపివేయడం, అలాగే ప్రభుత్వ ఉద్యోగులలో తనకు వ్యతిరేకంగా ఉన్నవారిని తొలగిస్తానని బహిరంగంగా బెదరించడం వంటి చర్యలు అమెరికా రాజకీయాల స్థాయిని దిగజార్చాయి. 1980 తరువాత పాత ఎడిఎ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం మొదలుపెట్టాక షట్‌డౌన్‌లు తప్పనిసరి అయ్యాయి. ఈ విధంగా, బడ్జెట్ కేటాయింపుల్లో కాంగ్రెస్ వైఫల్యం చెందితే, ఆ పరిణామాలకు కారణం, పరిష్కారం రెండూ కాంగ్రెస్ చేతుల్లోనే ఉంటాయి. 1976వ సంవత్సరం నుండి అమెరికా 20 సార్లకు పైగా నిధుల కొరతను ఎదుర్కొంది. ఈ సమస్య ఇప్పుడు మరింత తరచుగా, ఎక్కువ రోజులు కొనసాగుతోంది. ఇది రాజకీయ నాయకులు పార్టీ ప్రయోజనాలను దేశ పాలన కంటే ముఖ్యమని భావిస్తున్నారనడానికి నిదర్శనం. చారిత్రక ఉదాహరణలను పరిశీలిస్తే, 1996లో బిల్ క్లింటన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 21 రోజులు ఈ షట్‌డౌన్ కొనసాగింది. 2013లో బరాక్ ఒబామా ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు ఆరోగ్య సంరక్షణ చట్టాన్ని రద్దుచేయాలనే డిమాండ్‌పై 16 రోజుల పాటు షట్‌డౌన్ జరిగింది. ఇక, 2018-19లో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సరిహద్దు గోడ నిర్మాణానికి నిధులు ఇవ్వాలనే డిమాండ్‌తో రికార్డు స్థాయిలో 35 రోజులు షట్‌డౌన్ జరిగింది. షట్‌డౌన్ జరిగినా, ప్రాణాలు, ఆస్తులను కాపాడే జాతీయ భద్రత, పోలీసు సేవలు వంటివి కొనసాగుతాయి. సామాజిక భద్రత వంటి తప్పనిసరి కార్యక్రమాల నిధులు కూడా ఆగవు. అయితే, ఈ విభాగంలో పనిచేసే ఉద్యోగులు జీతం లేకుండా పనిచేయాలి. ఫెడరల్ పార్కులు, శాస్త్రీయ పరిశోధన, కొన్ని ప్రభుత్వ అనుమతులు ఇచ్చే కార్యాలయాలు మూసివేయబడతాయి. దాదాపు 7.5 లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులు జీతాలు లేకుండా బలవంతంగా సెలవులో ఉండాల్సివస్తుంది. రోజుకు సుమారు 400 మిలియన్ల డాలర్ల జీతం నష్టం జరుగుతుంది. జీతం తిరిగి వచ్చినప్పటికీ, ఈ మధ్యలో వచ్చే ఆర్థిక కష్టాలు, ఇంటి అద్దెలు కట్టలేని పరిస్థితి ఇబ్బంది పెడుతుంది. కాంట్రాక్టు ఉద్యోగులకు పోయిన జీతం తిరిగిరాదు.అమెరికా ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాబట్టి, ఇక్కడి ఆర్థిక అనిశ్చితి వల్ల ప్రపంచ స్టాక్ మార్కెట్లు, విదేశీ మారక మార్కెట్లు, వస్తువుల మార్కెట్లలో అస్థిరత పెరుగుతుంది. అమెరికా ప్రభుత్వం తన బడ్జెట్‌ను నిర్వహించలేకపోవడం ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.ఇది ప్రపంచ పెట్టుబడుల ప్రవాహాన్ని తగ్గిస్తుంది. అంతేకాక, ద్రవ్యోల్బణంవంటి కీలక ఆర్థికసమాచారాన్ని సేకరించే సంస్థలు ఆగిపోతాయి. ఈ సమాచారం లేకపోవడం వల్ల, ప్రపంచ బ్యాంకులతోసహా అంతర్జాతీయ సంస్థలు, ఫెడరల్ రిజర్వ్ వంటివి సరైన నిర్ణయాలు తీసుకోలేవు. షట్‌డౌన్ ఎక్కువ కాలం కొనసాగితే, అమెరికా వృద్ధి మందగించడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. తరచుగా షట్‌డౌన్‌లు రావడం వల్ల, అమెరికా ఒక స్థిరమైన, నమ్మదగిన దేశం అనే పేరును కోల్పోతుంది. అంతర్జాతీయ సహాయకార్యక్రమాలు, వీసాప్రక్రియలు వంటివి ఆగిపోవడంవల్ల విదేశీ సంబంధాలు దెబ్బతింటాయి. అత్యంత తక్షణ, బాధాకరమైన ప్రభావం హెచ్1బి వీసా, గ్రీన్ కార్డ్ ప్రక్రియల్లో ఏర్పడిన అంతరాయం. నిధుల కొరత కారణంగా యుఎస్ కార్మిక శాఖలోని ఫారిన్ లేబర్ సర్టిఫికేషన్ కార్యాలయం అన్ని కార్యకలాపాలను నిలిపివేస్తుంది. కొత్త హెచ్1బి వీసా పిటిషన్‌ను దాఖలు చేయడానికి లేదా ఉద్యోగాన్ని మార్చడానికి, ముందుగా లేబర్ కండిషన్ అప్లికేషన్ను డీఓఎల్ ధృవీకరించాలి. ఓఎఫ్ఎల్‌సీ పనిచేయక పోవడంతో కొత్త ఎల్సీలు దాఖలు చేయడానికి వీలులేకుండా పోయింది. దీని అర్థం హెచ్1బి వ్యవస్థ నుండి అత్యధికంగా లబ్ధి పొందుతున్న నైపుణ్యం గల భారతీయ నిపుణులు వేలాది మంది అనిశ్చితిలో చిక్కుకున్నారు. వారి ఉద్యోగ మార్పిడులు, కొత్త నియామకాలు నిరవధికంగా ఆగిపోయాయి. అదేవిధంగా, శాశ్వత నివాసానికి అవసరం అయిన గ్రీన్ కార్డ్ దరఖాస్తుల ప్రక్రియ కూడా స్తంభించింది. ఈ ప్రక్రియకు కూడా డీఓఎల్ నుండి ధృవీకరణలు లేదా ప్రస్తుత వేతనాల నిర్ధారణలు అవసరం. ఇది ప్రవాస భారతీయులకు ఇప్పటికే కఠినంగా ఉన్న నిరీక్షణ సమయాన్ని మరింత పెంచుతోంది. షట్‌డౌన్ ఎక్కువ కాలం కొనసాగితే అమెరికన్ కంపెనీలు ఖర్చులను తగ్గించుకుంటాయి. దీనివల్ల మన దేశ ఐటీ సేవల ఎగుమతులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి పెరిగి, భారత స్టాక్ మార్కెట్లు నష్టపోవడం, రూపాయి విలువ తగ్గడం వంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావచ్చు. •

# లైంగిక ఉన్మాదానికి కొరడా చట్టాలవసరం

మహమ్మద్ ఆరిఫ్

సొంత పెదనాన్న లైంగిక వేధింపులు భరించలేక ఇటీవల ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. హైదరాబాద్‌లో జరిగిన ఈ ఘటన పరిచయస్తులు, దగ్గరి బంధువుల నుంచి కూడా మహిళలకు రక్షణ లేదనే విషయాన్ని మరోసారి రుజువు చేసింది. బయటి వారి కంటే పరిచయస్తులు, బంధువుల నుంచే బాలికలకు ఎక్కువగా ముప్పు పొంచి ఉన్నట్టు ఈ ఘటన నిరూపిస్తున్నది. పాఠశాలలు,కాలేజీలు, ఆఫీసుల్లోనే కాదు సొంత ఇండ్లలో సైతం బాలికలు, మహిళలు లైంగిక వేధింపులకు గురవుతుండడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది. లైంగిక వేధింపులపై నమోదవుతున్న కేసుల్లో 80 శాతానికి పైగా కేసులు ఇలాంటివే ఉండడం సమాజంలో పేరుకుపోయిన మానసిక రుగ్మతను తెలియజేస్తున్నది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదికల ప్రకారం భారతదేశంలో లైంగిక వేధింపుల కేసుల్లో చాలా వరకు నిందితులు బాధితులకు తెలిసినవారే అయి ఉంటున్నారు. దేశవ్యాప్తంగా ప్రతిఏడాది లైంగిక వేధింపులకు సంబంధించి సుమారు 30వేల కేసులు నమోదవుతుంటే ఇందులో 80శాతానికి పైగా కేసుల్లో పరిచయస్తులు, బంధువులే నిందితులుగా ఉండడం గమనార్హం. బాలికలపై జరిగే లైంగిక వేధింపుల్లోనైతే 90 శాతానికి కంటే ఎక్కువ మంది నిందితులు వారికి తెలిసిన, నమ్మకమున్న వ్యక్తులే. అందులోనూ 30-40 శాతం మంది కుటుంబ సభ్యులే (తండ్రులు, సోదరులు, మామలు, పెదనాన్నలు, కజిన్స్) ఉంటున్నారు. ఈ గణాంకాలు బాలికలకు ఆప్తుల నుంచి పొంచి ఉన్న ప్రమాద తీవ్రతను తెలియజేస్తున్నాయి.లైంగిక వేధింపుల నుంచి పిల్లలను రక్షించడానికి తల్లిదండ్రులుఅనేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమున్నది. ముందుగా గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌గురించి వారికి నేర్పించాలి.ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే భయం లేకుండా తల్లిదండ్రుల వద్ద చెప్పుకునే స్వేచ్ఛావాతావరణం కల్పించాలి. అపరిచితులతోమాట్లాడడం, వారి నుంచి బహుమతులు తీసుకునే విషయాలపై వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలి. సోషల్ మీడియా, ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తలు, ఆన్‌లైన్ వేధింపుల గురించి తెలియజేయాలి. లైంగిక వేధింపుల నివారణకు ప్రభుత్వాలు నిర్భయ వంటి అనేక కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయి. బాలికలపై లైంగిక వేధింపులు జరగకుండా.. పోక్సో వంటి చట్టాలున్నాయి. అయితే గత కొన్ని సంవత్సరాల డేటా చూస్తే మాత్రం కేసుల నమోదులో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. 2020లో 28,046 లైంగిక వేధింపుల కేసులు నమోదైతే, 2021లో ఇది 31,677 కేసులకు పెరిగింది. 2022లో 31,982 కేసులు నమోదయ్యాయి. 2023తో పోల్చుకుంటే 2024లో కేసుల్లో 4.8 శాతం పెరుగుదల కనిపించింది.2025 జనవరి డేటా ఇంకా విడుదల కాకపోయినా ఇప్పటికే 25 వేలకు పైగా కేసులు నమోదైనట్టు ఒక అంచనా. తెలంగాణలోనూ 2023లో 817 లైంగిక వేధింపుల కేసులు నమోదు కాగా, 2024, 2025 ల్లోనూ ఈ కేసుల్లో పెరుగుదల కనిపించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఇదేస్థాయిలో లైంగిక వేధింపుల ఘటనలు వెలుగుచూడడం లేదనే చర్చ జరుగుతున్నది. వేధింపులకు గురైన బాధితురాలినే తప్పుపట్టే ధోరణిలో సమాజం వ్యవహరిస్తుండడంతో పరువుపోతుందనే భయంతో చాలా మంది ఫిర్యాదు చేయడానికే వెనుకాడుతున్నారు. ముఖ్యంగా దగ్గరి బంధువులే వేధింపులకు పాల్పడినప్పుడు కుటుంబ పరువుపోతుందని, బంధుత్వాలు చెడిపోతాయనే భయంతో చాలా మంది ఫిర్యాదు చేయకుండా మౌనం వహిస్తున్నారు. కేసుల విచారణలో జాప్యం,నేర నిరూపణ తక్కువ స్థాయిలో ఉండడంతో చట్టాలపట్ల నేరస్తుల్లోనూ భయం కనిపించడంలేదు. 2024లో లైంగిక దాడుల్లో కేసుల్లో కన్విక్షన్ రేటు 28శాతం మాత్రమే. ఎక్కువ కేసులు పెండింగులో ఉన్నాయి. మరోవైపు పోర్న్ వీడియోలు ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా అందుబాటులో ఉండడం కూడా లైంగిక వేధింపుల ఘటనలు పెరగడానికి పరోక్షంగా దోహదపడుతున్నాయని అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.లైంగిక వేధింపులను కేవలం చట్టపరమైన సమస్యగా మాత్రమేచూడొద్దు. ఇది సమాజంలో పాతుకుపోయిన ఒక మానసిక రుగ్మత. ఈ కేసులను నివారించాలంటే ఒకవైపు కఠినచట్టాలను అమలు చేస్తూనే బాధితులకు సకాలంలో న్యాయంజరిగేలా చూడాలి. •

# యాచకులకు ఏవీ ప్రత్యామ్నాయ పథకాలు?

మేకిరి దామోదర్

భాగ్యవంతులకు నిత్యం పండుగలే.దేశం రాష్ట్రంఎంతో అభివృద్ధి చెందిందని పాలకులు చెప్పుకుంటున్న ఈ సమాజంలో పండుగలకు నోచుకోక, పూట గడవడమే దిన గండంగా, భిక్షాటన చేస్తూ పేదరికంలో జీవితం గడుపుతున్న వారి స్థితిగతులను పరిశీలిద్దాం. దారిద్రంలో మగ్గుతు జీవితపు చరమాంకంలో కన్నవారి ఆదరణ లేని వృద్ధులు, విధి వంచితులైన చిన్నారులు, ఉపాధి లేక కడుపు నింపుకోవడానికి మరికొంతమంది భిక్షాటనను ఎంచుకుంటున్నారు. పట్టెడన్నం కోసం యాచకులు హైదరాబాద్ మహానగరంతో పాటు పెద్దపెద్ద పట్టణాల్లో ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ చలికివణుకుతున్నారు.బస్సు షెల్టర్లు, ప్రధాన కూడళ్లు, మెట్రోస్టేషన్లు,ఫ్లై ఓవర్ బేస్ మెట్లు, పార్కులు, ఫుట్‌పాతులే ఆవాసాలుగా వారు దుర్భర జీవనం సాగిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తూ దినదిన గండంగా బతుకు వెళ్లదీస్తున్నారు. వారిని ఆదుకోవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయని విమర్శలున్నాయి. వీరుపడరాని పాట్లు పడుతున్నారు. లక్ష జనాభా దాటిన పట్టణాల్లో నిరాశ్రయ కేంద్రాలు ఏర్పాటుచేసి వసతిసౌకర్యం కల్పించాలని 2007లో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఆయా చోట్ల నిరాశ్రయులను గుర్తించి వారి సంఖ్యకు అనుగుణంగా షెల్టర్ జోన్లు ఏర్పాటు చేయాలి.గతంలో 60 నిరాశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతానికి 11 కేంద్రాలున్నాయి. మరికొన్ని చోట్ల స్వచ్ఛంద సంస్థలు నిర్వహణ బాధ్యతలు అప్పగించిన లక్ష్యం నెరవేరలేదు. ఓ స్వచ్ఛంద సంస్థ అంచనా ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే సుమారు 5వేల మందికి పైగా ఎలాంటి ఆధారాలు లేనివారు, గూడు లేకుండా నివసిస్తున్నారు. రాజధాని ప్రస్తుతానికి పురుషులకు 8, స్త్రీలకు 3 షెల్టర్ జోన్లు ఉన్నాయి. వీటిలో 380 మంది వరకు నివాసం ఉంటున్నారు. మిగతావారు ఉండేందుకు నీడ లేకపోయిందని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వందకుపైగా నిరాశ్రయ కేంద్రం అవసరమని స్వచ్ఛంద సంస్థలఅంచనా!. అలాగే 5000 మందికి పైగా భిక్షాటనే వృత్తిగా జీవిస్తున్నారు. దీనితో నగరంలోని కూడళ్లు, ప్రధాన వీధుల్లో రద్దీ సమయాల్లో యాచకులతో నిండిపోతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని గత ప్రభుత్వం అనాధాశ్రయాలను ఏర్పాటు చేసి పునరావాసం కల్పించింది. కొన్నాళ్లకు ఆ కార్యాచరణ అటుకెక్కింది. 2023 అధికారం



చేపట్టిన ప్రభుత్వం తిరిగి వీరందరికీ పునరావాసం కల్పించి, నగరాన్ని బెగ్గర్స్ ఫ్రీ సిటీగా మార్చాలని జిహెచ్ఎంసి లోని అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ (యుసిడి)విభాగానికి బాధ్యతలు అప్పగించింది. రెండు నెలల క్రితం హడావుడి చేసిన యుసిడి నగరంలో 102 మంది బిచ్చగాళ్లను వివిధ షెల్టర్ హోమ్లకు తరలించింది. ఆ తర్వాత దీనిపై పెద్దగా దృష్టి సారించడంలేదు. దానితో వారంతా తిరిగి రోడ్లపై కనిపిస్తున్నారు. ఇండియాను బెగ్గర్స్ ఫ్రీగా చేయాలనే లక్ష్యంతో కేంద్రం 'స్మైల్' అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ఉద్దేశం బిచ్చగాళ్లను గుర్తించి వారికి వైద్యరక్షణ, కౌన్సిలింగ్,విద్య,నైపుణ్యం అభివృద్ధి, ఉపాధి కల్పించాల్సి ఉంది. ఇలా చేసి బెగ్గర్ ఫ్రీ సిటీగా మార్చేబాధ్యతలు (జిహెచ్ఎంసి) తీసుకుంది. ఇదిలా ఉంటే బెగ్గింగ్ మైగ్రేషన్ అనే పదం కొత్తగా వినిపిస్తున్నాయి. హైదరాబాద్ నగరం ఈ తాకిడి గురవుతుంది. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక,ఏపీతోపాటు ఉత్తరాది నుంచి హైదరాబాద్ నగరానికి ఇటీవల బిచ్చగాళ్ల వలసలు భారీగా పెరిగిపోతున్నాయి. సామాజికవేత్తలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా బెగ్గింగ్ వలసలకు భయపడుతుంది. పేదరికం, వృద్ధాప్యం, ఉపాధి లభించకపోవడం భిక్షాటనకు ప్రధాన కారణం అయినప్పటికీ సామాజిక శాస్త్ర అధ్యయనాల ప్రకారం బద్ధకం, శ్రమ పట్ల విరక్తివంటి మానసిక కారణాలతో పాటు తేలిగ్గా డబ్బు సంపాదించాలని ఉద్దేశంతో కూడా కొంతమంది వ్యక్తులు దీన్నివృత్తిగా ఎంచుకుంటున్నారు. మరి కొంతమంది అమానవీయంగా ముఠాగా ఏర్పడి చిన్నారులను,వృద్ధులను, అనాధలతో బలవంతభిక్షాటన చేయిస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా ప్రతి నగరం, పట్టణంలో ఎంతమంది బిచ్చగాళ్లు, నిరాశ్రయులున్నారని గుర్తించడం, వారికి గుర్తింపు కార్డు, ఆధార్‌వంటి సౌకర్యాలు కల్పించడం. వారికి ఎవరూ లేకపోతే షెల్టర్‌జోన్లు ఏర్పాటుకు ఆశ్రయం,ఉపాధి కల్పించడం. కుటుంబ సభ్యులు,బంధువులు ఉంటే వారికి అప్పగించడం వంటి చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఉన్న నిరాశ్రయ కేంద్రాలకు షెల్టర్ మేనేజ్మెంట్ కమిటీ, కార్యనిర్వహాకకమిటీ ఉండాలి. షెల్టర్ మేనేజ్మెంట్ కమిటీలో స్థానిక కౌన్సిలర్ లేదా కార్పొరేటర్, షెల్టర్ మేనేజర్, నిరాశ్రయుల నుంచి ముగ్గురికి చోటుకల్పించాలి. కావలసిన భోజన వసతి షెల్టర్లో ఫ్యాన్లు, టీవీ,మంచినీటి సదుపాయం,మరుగు దొడ్లు వంటి వాటిపై దృష్టిపెట్టాలి. కార్యనిర్వాహక కమిటీలో పురపాలికమిషనర్, స్థానిక పోలీస్, ట్రాఫిక్,మెప్మా అధికారులు ఉండాలి. వీరంతా ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై ఆ ప్రాంతాల్లోని నిరాశ్రయుల పరిస్థితులు,భిక్షాటన చేసేవారి అనాధలను పరిస్థితులువారికి సౌకర్యాలు అందుతున్న తీరును చర్చించాలి. అయితే ఈ నిబంధనలు ఎక్కడ అమలు కావడం లేదు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మానవీయ కోణంలో పాలన అందించాలి. •

# ప్రజావాక్కు



### పెరుగుతున్న నేరాలను అరికట్టాలి

**జాతీయ** నేరగణాంకాల నివేదికను 2023 సంవత్సరానికి గానూ భారత ప్రభుత్వం విడుదల చేసింది. ఆ అధికారిక గణాంకాలు వివిధ నేరాల పెరుగుదలను సూచిస్తోంది.అందులోముఖ్యంగా గిరిజనులపైజరిగిన నేరాల్లో, అంతకు ముందు ఏడాది కన్నా,28 శాతం పెరుగుదల కనబడడం తీవ్రఆందోళనకరం.మణిపూర్ మొదటి స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్ రెండో స్థానం పొందిన ఈ తరహా నేరాలు మిగతా రాష్ట్రాల్లో కూడా గణనీయంగానే నమోదైనాయి.పిల్లలపట్ల జరిగినవాటిలో తొమ్మిది శాతం పెరుగుదల, మహిళలపట్ల కూడా పెరుగుదలనే చూపిస్తున్నాయి. సైబర్ నేరాలైతే మరింత దూకుడుగా ఉన్నాయి. సాధారణంగా జరిగిన నేరాలన్నీ నమోదు కావు. పోలీసు స్టేషన్ దృష్టికి రానివి,నమోదు కానివి అధికంగానే ఉంటాయి. అధికారిక లెక్కలు పరిస్థితిని పైపైన చూపిస్తాయి. అసలు సమస్య ఇంకా తీవ్రంగానే ఉంటుంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### కాలమే సమాధానం చెప్పాలి

**బీహార్** ఎన్నికల ముందట వలసలు సర్ ఒక ప్రధాన అంశంగా నిలుస్తున్నాయి.గంగానది ఒడ్డున ఉన్న సారవంతం అయిన నేలలు కలిగి, బుద్ధుని చారిత్రక ఆనవాళ్లు కలిగిన రాష్ట్రం, ప్రణాళికలు సరిగాలేకపోవడం, ప్రభుత్వ పాలసీలు రూపకల్పన సరిగాలేకపోవడం మూలంగా వలసలు ఇబ్బడి ముబ్బడిగా సాగుతున్నాయి.అధికారమే పరమావధిగా నితీష్ కుప్పిగంతులు వేయడం లాలూ దాణా కేస్‌లోఉండడం అచ్చేదిన్ పేరిట బిజెపి అవకాశవాద రాజకీయాలు చేయడం మూలంగా బీహార్ ప్రజలు వలసల బాట ఎంచుకున్నారు. దాదాపు 77 లక్షల మంది ప్రజలు వలసలబాట పట్టారు.

- భారత అవినాష్, జనగామ

### వికలాంగులకు న్యాయం చేయాలి

**తెలంగాణ** రాష్ట్రంలోని వికలాంగులకు సంబంధించిన ఇండ్ల స్థలాలు కబ్జాలుచేస్తున్నారు.అందులో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు.పోలీస్‌స్టేషన్‌లో రెవిన్యూ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినాకూడా పట్టించుకోవడం లేదు. వికలాంగులకు వారి కుటుంబాలకు న్యాయం చేయాలి.2016వికలాంగుల చట్టం ప్రకారం వికలాంగుల ఇళ్లస్థలాలు అక్రమించినవారిపై కఠినచర్యలు తీసుకోవాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### ప్రజల సహకారంతోనే మార్పు సాధ్యం

**సెప్టెంబర్ 26న** ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం జరుపుకున్నసందర్భంగా ఒక నిజం మనకుస్పష్టమవుతోంది. పర్యావరణం అంటే మనందరి ప్రాణాధారం. అది కేవలం ప్రకృతితో సంబంధం ఉన్న విషయంకాదు,మన ఆరోగ్యం, మన భవిష్యత్తు అంతా దానిపైనే ఆధారపడి ఉన్నాయి. కాలుష్య గాలి, మలిన జలాలు, నాశనమవుతున్న భూమి ఇవన్నీ ప్రకృతిని మాత్రమే కాదు, మనసమాజాన్నీ నిశ్శబ్దంగా దెబ్బతీస్తున్నాయి. అనారోగ్యాలు పెరుగుతున్నాయి. జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి.మార్గరెట్ మీడ్ చెప్పినట్లుగా పర్యావరణం నాశనం అయితే, సమాజం నిలబడదు అనే మాటలు నేటి పరిస్థితులకు పూర్తిగా సరిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ వంతుబాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వాలు విధానాలు తీసుకువస్తాయి, కానీ నిజమైన మార్పు ప్రజల సహకారంతోనే సాధ్యం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పెరుగుతున్న పబ్లిక్ న్యూసెన్స్‌లు

**మన** పురాణకాలంలో చెడుపై మంచి సాధించిన విజయంగా ప్రజలంతా భావించి దీపాలను వెలిగించి ఆనందంగా దీపావళి పండుగ చేసుకోవటం, అప్పటి నుండి ప్రతిసంవత్సరం పిల్లలు పెద్దలు దీపావళి రోజు టపాసులు కాలుస్తూ పండుగ జరుపుకోవటం ఆనవాయితీగా మారిందని పెద్దలు చెబుతారు. ఐతే ఈ రోజుల్లోఆ దీపావళి టపాసుల వినియోగం నానాటికి పెరిగిపోతూ ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా ముప్పుగా తయారైంది. ఊరేగింపులకూ,శుభకార్యాలకు,అశుభ కార్యాలకు సైతం సాంప్రదాయక వాయిద్యాల స్థానంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భారీశబ్దాలతో టపాసులు, బాంబులు పేలుస్తుంటే వాటి వలన వ్యాధిగ్రస్తులు, ముఖ్యంగా గుండె జబ్బులున్న వారికి ప్రమాదకరంగా మారుతున్నాయి.

- టి. సాంబశివరావు, గుంటూరు

### సీట్ల కొరత

**భారత** దేశంలో డిమాండ్ ఉన్న కోర్సులు చదువుకునేందుకు సీట్లకొరత అలాగే చదివిన చదువులకు ఉద్యోగాల కొరత ఉంది.ఎంబీబీఎస్, ఇంజనీరింగ్,ఎంబీఏ, తదితర ఉన్నత చదువులు విదేశాల్లో చదవలసిన పరిస్థితి ఉంది. డిమాండ్ ఉన్న కోర్సుల సీట్‌లను భారత్‌లో పెంచితే విదేశాలకు వెళ్లే అవకాశం ఉండదు. అలాగే ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పించాలి. దానిని వెంటనే అమలులో పెట్టాలి.

-డి చాంద్ బాషా, కర్నూలు

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# గంజాయి పండిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

### ఆసిఫాబాద్ జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు

**ఆసిఫాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలు పండిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఆదివారం జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు సిర్పూర్ (యు) మండలం కోహినూర్ (కె) గ్రామంలో గంజాయి మొక్కలు పండిస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో దాడి నిర్వహించి తనిఖీ చేపట్టగా, వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్న జూగాదిరావు, గంగారాంలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఇద్దరు తమ వ్యవసాయ భూముల్లో అక్రమంగా మొత్తం 10 గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని నిందితులను సిర్పూర్ (యు) పోలీస్ స్టేషన్‌కు అప్పగించిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో గంజాయి వంటి మాదకద్రవ్యాలకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని, ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనే వ్యక్తులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, సిబ్బంది దేవేందర్, సంజీవ్ పాల్గొన్నారు.

## మేఘా కృష్ణారెడ్డికి మాతృవియోగం

**విజయవాడ, అక్టోబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** మేఘా సంస్థ అధినేత కృష్ణారెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి విజయలక్ష్మి(76) కన్ను మూసారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా ఎండిగా సుపరిచితులైన పీవీ కృష్ణారెడ్డి తల్లి విజయలక్ష్మి తన కుమారుని ఎదు గుదలలో కీలకంగా వ్యవహరించారు. కృష్ణా జిల్లా పామర్రు పరిధిలోని డోకిపర్రుకు చెందిన విజయలక్ష్మి ఆధ్యాత్మిక, సామాజిక, విద్య, వైద్య సేవాకార్యక్రమాల్లో కీలకంగా పాల్గొనేవారు. మేఘా ఆధ్వర్యంలో డోకిపర్రులో శ్రీవెంక టేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించే విషయంలో ఆమె కృష్ణారెడ్డికి ప్రేరణగా నిలిచారు. ఈ ఆల యంలో ప్రతియేటా జరిగే కల్యాణోత్సవాలకు సీఎం చంద్రబాబు, మాజీ కేంద్రమంత్రి చిరంజీవితో సహా ఎందరో ప్రముఖులు హాజరయ్యారు. విజయలక్ష్మి కొంతకాలం నుంచి అనారోగ్యంగా ఉంటున్నట్లు సమాచారం. విజయలక్ష్మి మరణవార్త తెలియడంతో డోకిపర్రులో విషాద ఛాయలు చోటుచేసుకున్నాయి. ఆమె భౌతికకాయాన్ని పెద్దసంఖ్యలో ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. విజయలక్ష్మి అంత్యక్రియలు డోకిపర్రులోనే నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విజయలక్ష్మి మృతి పట్ల సీఎం చంద్రబాబుతో సహా పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.



విజయలక్ష్మి (ఫైల్)

## పదవీవిరమణ చేసిన జర్నలిస్టులకు పెన్షన్ అందించాలి

### డిప్యూటీ సిఎం భట్టికి వయోధిక పాత్రికేయ సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** పదవీవిరమణ చేసిన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని వర్తింపచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో 17వ అంశంగా ఇచ్చిన హామీని అమలుచేయాలని వయోధిక పాత్రికేయ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర సంఘం నాయకులు కేశవరావు, లక్ష్మణరావు, ఎస్. శ్రీనివాసరెడ్డి, బండారు శ్రీనివాసరావు, సి.కేశవులు, ఫాజిల్, వేణుగోపాల్ లతో కూడిన బృందం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంఘ నాయకులు మాట్లా డుతూ... గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి ఈ అంశంపై విజ్ఞాపన పత్రాన్ని అందజేస్తే.. సానుకూలంగా స్పందించినట్లు వయో ధిక పాత్రికేయ సంఘం సభ్యులు గుర్తుకు చేశారు. దేశంలోని 19 రాష్ట్రాల్లో పెన్షన్ పథకం అమలులో ఉన్నదని వారు తెలిపారు. కర్ణాటకతో సహా పలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కూడా ఈ పథకం అమలులో ఉందని, ఈ విషయం కమిటీ వేసి క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించి అమలు జరిగేటట్లు ప్రయత్నిస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారని సంఘ నాయకులు తెలిపారు.

## సౌర కుటుంబం నుంచి దూసుకువస్తున్న తోకచుక్క

### భూమికి ప్రమాదం లేదన్న నాసా

**న్యూయార్క్, అక్టోబరు 5:** సౌరకుటుంబం ఆవలివైపు నుంచి వేగంగా దూసుకువస్తున్న '3ఐ/అట్లాస్ (3I/అట్లాస్) అనే తోకచుక్కతో భూమికి ఎలాంటి ప్రమాదం లేదని నాసా స్పష్టం చేసింది. సెకనుకు 61 కిలోమీటర్ల (అంటే గంటకు సుమారు 2.21 లక్షల కిలోమీటర్ల వేగం) అసాధారణ వేగంతో ఈ తోక చుక్క ప్రయాణిస్తుంది. ప్రస్తుతం ఈ తోకచుక్క కదలికలను నిరంతరం గమనిస్తున్నామని దాంతో భూమికి ఎలాంటి ప్రమాదం ఉండబోదని పేర్కొంది. మన సౌర వ్యవస్థకు చెందని ఖగోళ వస్తువులను నాసా గుర్తించడం ఇది మూడోసారి. గతంలో 2017లో 'ఔము వాము వా', 2019లో '2ఐ/బోరిసోవ్'ని శాస్త్ర వేత్తలు గుర్తించారు. తాజాగా అట్లాస్ తోకచుక్క సౌర కుటుంబం ఆవల నుంచి వస్తున్న మూడో అతిథిగా పేరు కుంటున్నారు. దాని పేరులో 'ఐ' అక్షరం 'ఇంటర్ స్టెల్లార్'ని సూచిస్తున్నది. ఈ తోకచుక్కను తొలిసారిగా ఈ ఏడాది జులై 1న చిలీలోని రియో హార్టాడోలో ఉన్న అట్లాస్ టెలిస్కోప్ ద్వారా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ తోకచుక్క సూర్యుడికి దగ్గరయ్యే కొద్దీ దీని వేగం మరింత పెరుగుతుంది నాసా పేర్కొంది. అక్టోబర్ 30 నాటికి ఇది సూర్యుడికి అత్యంత సమీపంగా అంటే సుమారు 21 కోట్ల కిలోమీటర్ల దూరానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.



ఇది అంగారక గ్రహ కక్ష్యకు కొద్దిగా లోపలి భాగంలో ఉంటుంది. భూమికి, ఈ తోకచుక్కకు మధ్య దూరం చాలా ఎక్కువగా ఉంటుందని నాసా క్లారిటీ ఇచ్చింది. ఈ తోకచుక్క భూమికి అత్యంత దగ్గరగా వచ్చినప్పుడు కూడా దాని దూరం సుమారు 27 కోట్ల కిలోమీటర్లు ఉంటుందని.. కాబట్టి భూమికి దీనివల్ల ఎలాంటి ముప్పు లేదని తెలిపింది. హబుల్, జేమ్స్ వెబ్ వంటి శక్తిమంతమైన టెలిస్కోపుల ద్వారా దీని గమనాన్ని నిశితంగా పర్య వేక్షిస్తున్నారు. అక్టోబర్ చివరిలో సూర్యుడి దగ్గర నుంచి ప్రయాణించి, మార్చి 2026 నాటికి బృహస్పతిని దాటి తిరిగి మన సౌర వ్యవస్థ నుంచి శాశ్వతంగా దూరంగా వెళ్లిపోతుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో కొత్త టెక్నాలజీ

## ఇటుకలు లేకుండా 20 రోజుల్లోనే నిర్మాణం పూర్తి

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సరికొత్త సాంకేతికతను వినియోగించి ఓ గ్రామంలో అద్భుతాన్ని సృష్టించారు. ఇటుకలు లేకుండా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తిచేసి ఔరా అనిపించారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో ఈ సంఘటన వెలుగు చూసింది. ఇటుకలు లేకుండా కేవలం సిమెంట్, కంకర, స్టీల్‌తో 20 రోజుల్లోనే ఇళ్లను నిర్మిస్తున్నారు కొందరు. మిగతా వారు కూడా ఈ పద్ధతిని అనుసరిస్తే మంచిది అంటున్నారు.తెలంగాణ సర్కార్ రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో.. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. తొలి విడతలో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ప్రస్తుతం అవన్ని నిర్మాణంలో ఉన్నాయి. కొన్ని చోట్ల ఇంటి నిర్మాణం పూర్తయ్యి.. దసరా పండుగ నాడు గృహ ప్రవేశం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అలానే ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం తక్కువ ధరకే ఇటుక, ఇసుక సరఫరా చేస్తుంది. అలానే ఉపాధి హామీని ఇంటి నిర్మాణ పనులకు అనుసంధానం చేసింది. ఇదిలా ఉండగా తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఓ చోట అద్భుతం చోటు చేసుకుంది. ఇటుకలు వాడకుండా... కేవలం 20 రోజుల్లోనే ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. కేవలం 20 రోజుల వ్యవధిలో.. ఇటుకలు వాడకుండా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్య పడేలా చేశారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లాలో వెలుగు చూసింది.

ఇక్కడ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం సరికొత్త టెక్నాలజీని వాడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన మద్దూరు మండలం.. మొమిన్‌పూర్‌లో ప్రయోగాత్మకంగా ఈ పద్ధతిని అమలు చేస్తున్నారు. ఈ కొత్త పద్ధతిలో 3 ఇళ్లను నిర్మించాలని భావించారు. ముందుగా ఆ మూడు ఇళ్లకు ముగ్గు పోసి.. ఆపై కేవలం స్టీల్, సిమెంట్, కంకర మాత్రమే వినియోగించి గోడలు నిర్మిస్తున్నారు. కాంక్రీట్ మిక్చర్ మెషీన్, ఆర్‌ఎంసీ అందుబాటులో ఉంటే కేవలం 20 రోజుల్లోనే ఇంటి నిర్మాణం పూర్తవుతుందని అధికా రులు తెలిపారు. కేవలం 20 రోజుల్లోనే అది కూడా ఇటు కలు లేకుండా ఇంటి నిర్మాణం చేపడుతుండటంపై గ్రామ స్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్రంలోని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా రాష్ట్రంలో సుమారు 4.50 లక్షల ఇళ్లు నిర్మించాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకంలో భాగంగా అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి.. దాని నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం కూడా చేస్తా రు. అలానే సొంత స్థలం లేని వారికి ముందుగా ఇంటి స్థలం కేటాయించి.. ఆపై ఇల్లు కట్టుకోవడానికి వారికి కూడా రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు. అలానే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా రూ. 1 లక్ష అంటే మొత్తం రూ. 6 లక్షలు ఆర్థిక సహాయం చేస్తారు. ఇంటి నిర్మాణం వివిధ దశల్లో ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు.

# నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై టివికె విజయ్ వ్యాన్‌డ్రైవర్ అరెస్టు

### వాహనాన్ని సీజ్ చేసిన సిట్ అధికారులు

**చెన్నై, అక్టోబరు 5:** కరూర్ తొక్కిసలాట ఘటనకు ముందు టీవీకే చీఫ్, నటుడు విజయ్ ప్రచారరథం ఇద్దరు యువకులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆ ప్రచారరథాన్ని సీజ్ చేశారు. ఆ వాహనం నడిపిన డ్రైవర్‌ను అరెస్టుచేసి విచారిస్తున్నారు. ఇటీవల తమిళనాడులోని కరూర్ జిల్లాలో విజయ్ నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఎందుకంటే ఈ ఘటనలో ఏకంగా 41 మంది మరణించారు. 80 మందికిపైగా గాయపడ్డారు. ఇదిలావుంటే ఈ ఘటనపై దర్యాప్తు కోసం ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలో పోలీసులు మరో కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌చేసి ఇద్దరిమృతికి కారణమయ్యాడన్న ఆరోపణలపై విజయ్ వ్యాన్‌డ్రైవర్‌ను అరెస్టుచేసారు. బిఎన్‌ఎస్ సెక్షన్ 281 కింద ఆయనపై కేసునమోదు చేసారు. కరూర్‌కు వస్తున్న సమయంలో అనేకమంది టివికె అభిమానులు కేడర్ రోడ్డుపైకి వచ్చారు. దీనితో కొందరు కిందపడి కరూర్ తవిట్టుపళయం వద్ద వ్యాన్ టైర్లకిందకు వచ్చారు. దీనిపై హైకోర్టుకూడా సీరియస్ అయింది. డ్రైవర్‌పై హిట్ అండ్ రన్‌కేసు నమోదుచేయాలని, ప్రచార వాహనం సీజ్‌చేయాలని ఆదేశించడంతో సిట్ బృందం డ్రైవర్‌ను అరెస్టుచేసి వాహనం సీజ్‌చేసినట్లు ప్రకటించారు.



# త్రుటిలో పెనుముప్పను తప్పించుకున్న ఎయిరిండియా



**బర్మింగ్‌హామ్, అక్టోబరు 5:** లండన్‌కు వెళ్తోన్న ఎయిరిండియా విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి లండన్ సమీపంలోని బర్మింగ్‌హామ్‌కు వెళ్లిన ఎయిరిండియా బోయింగ్ 7878 డ్రీమ్ లైనర్ ల్యాండింగ్ సమయంలో ర్యామ్ ఎయిర్ టర్బైన్ (ర్యాట్) తెరుచుకుంది. విమానం గమ్యస్థానానికి చేరుకున్న తర్వాత పైలట్ ఎత్తు తగ్గించుకుంటూ ల్యాండింగ్‌కు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో అత్యవసర సందర్భాల్లో వాడే ర్యాట్ బయటకు వచ్చింది. ర్యాట్ తెరుచుకున్నా విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై స్పందించిన ఎయిరిండియా కీలక ప్రకటన చేసింది. ఈనెల 4న మధ్యాహ్నం 12.52 గంటలకు ఏఐ117 డ్రీమ్‌లైనర్ విమానం అమృత్‌సర్ విమానాశ్రయం నుంచి బర్మింగ్‌హామ్‌కు చేరుకున్న సమయంలో ర్యాట్ పనిచేయడం ప్రారంభించినట్లు పైలట్లు గుర్తించారు. విద్యుత్తు వ్యవస్థలు లేదా హైడ్రాలిక్ ప్రమాణాలు అన్నీ సాధారణ స్థితిలోనే ఉన్నాయి.. చివరకు విమానం సురక్షితంగా దిగింది. అయితే, బర్మింగ్‌హామ్ నుంచి ఢిల్లీకి రావాల్సిన సర్వీసును రద్దుచేసి,ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపింది.

ఈ విమానంలో ఎంత మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు అనే వివరాలను మాత్రం ఎయిరిండియా వెల్లడించలేదు. ర్యామ్ ఎయిర్ టర్బైన్ అనేది విమానం రెక్క లేదా ప్రధాన భాగంలో ఉండే చిన్నపాటి పరికరం. సాధారణంగా ఇది విమానం లోపల ముడుచుకుపోయి ఉంటుంది. ఇంజిన్ వైఫల్యం, ఇంధనం సరఫరా నిలిచిపోవడం వంటి ఎమర్జెన్సీ పరిస్థితుల్లో మాత్రమే తెరుచుకొని, బయటకు వస్తుంది. ఇది వెలుపలకు వచ్చిందంటే.. విమానం ప్రమాదంలో ఉన్నట్లే. రెండు ఇంజిన్లు ఒకేసారి విఫలమైనపుడు లేదా ఎలక్ట్రికల్, హైడ్రాలిక్ వ్యవస్థలు నిలిచిపోయినప్పుడు ఈ ర్యాట్ ఆటోమేటిక్‌గా ఓపెన్ అవుతుంది. ఇంజిన్, ఎలక్ట్రికల్, హైడ్రాలిక్ వ్యవస్థలు విఫలమైనప్పుడే ఇలా జరుగుతుందని నిపుణులు తెలిపారు.

## బస్సు చార్జీల పెంపు క్షమించరానిది

### మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 5:** ప్రభుత్వం ఆర్టీసి ప్రయాణికులకు షాకింగ్ న్యూస్ ఇచ్చింది. హైదరాబాద్‌లో ఆర్టిసి బస్సుల టికెట్ ధరలు భారీగా పెంచేసింది. మొదటి 3 స్టేజీలక రూ.5, ఆ తర్వాత నుంచి రూ.10కి పెంచారు. దీనిపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆదివాకం ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. సిటీ బస్సు చార్జీలను ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఒకేసారి 10 రూపాయలు పెంచి జంట నగరంలోని పేద మధ్య తరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని చూస్తున్న రేవంత్ రెడ్డి నిర్ణయాలు దుర్మార్గమైనవి. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో అల్లాడుతున్న తరుణంలో.. ప్రతి ప్రయాణికుడిపై నెలకు 500 రూపాయల అదనపు భారం మోపితే బడుగుజీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలి. ఇప్పటికే విద్యార్థుల బస్‌చార్జీలు, టీ24 టిక్కెట్ చార్జీలను పెంచింది చాలదన్నట్టు.. ఇప్పుడు కనీస చార్జీపై కనికరం లేకుండా 50 శాతంటిక్కెట్టు ధరలను పెంచడం రేవంత్ అసమర్థ విధానాలకు నిదర్శనం. రాజధాని వాసుల నడ్డివిరిచి ప్రతి నిత్యం కోటి రూపాయల భారం మోపాలని చూస్తున్న ముఖ్యమంత్రి హైద రాబాద్ ప్రజలపై కక్ష పెంచుకుంటున్నట్టు అర్థమవుతోంది. తుస్సుమన్న ఫ్రీబస్సు పథకంతో దివాళా తీసిన ఆర్టీసిని గట్టెక్కిం చాల్సిందిపోయి, సామాన్య ప్రయాణికుల నడ్డి విరచాలని చూడటం క్షమించరానిదని కెటిఆర్ పోస్ట్ చేశారు.

## 8 వరకు ఎప్‌సెట్ బైపిసి కౌన్సెలింగ్

### 7 నుంచి 9 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు ఎప్‌సెట్-2025 ద్వారా.. బి ఫార్మసీ, ఫార్మా-డి, బైయో టెక్నాలజీ, బయో మెడికల్ ఇంజనీరింగ్, ఫార్మాసూటికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడానికి కౌన్సెలింగ్‌ను ఆదివారం(అక్టోబర్ 5) నుంచి ప్రారంభించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను అప్‌లోడ్ చేస్తూ స్లాట్ బుక్ చేసుకోవడానికి ఈ నెల 8 వరకు అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆదివారం ప్రకటించారు. ఈ నెల 7 నుంచి 9 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. 8 నుంచి 10 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 13లోపుగా మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 13, 14 తేదిల్లో ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ అక్టోబర్ 16 నుంచి ప్రారంభం కానుంది. అక్టోబర్ 17న సర్టిఫికెట్‌వెరిఫికేషన్ ఉంటుంది. అక్టోబర్ 17, 18 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 21లోగా ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీటు పొందిన విద్యార్థులు అక్టోబర్ 21, 22 తేదిల్లో ట్యూషన్‌ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అక్టోబర్ 22, 23 తేదిల్లోగా సీట్లు పొందిన విద్యార్థులు నేరుగా కాలేజీల్లో చేరాలని కమిషనర్ సూచించారు.

# తగ్గుముఖం పట్టిన వరద

### జూరాల 13గేట్లు ఎత్తి నీటివిడుదల

### శ్రీశైలం డ్యాం గేట్లు మూసివేత

### 210టిఎంసిలకు చేరిన నీటిమట్టం

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 5, ప్రభాతవార్త:** ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు స్వల్పంగా వరద నమోదవుతున్నది. పాలమూరు వరప్రదాయిని జూరాల 13గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నాయి. జలాశయానికి 1,29,000ఇన్‌ఫ్లో నమోదు కాగా, 6గేట్లు ఎత్తి దిగువకు 41,742 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పవర్ హౌజ్‌కు 40476 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.824 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. జూరాల ఎడమ కాలువకు 550, క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 82,813 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

#### 883 అడుగులకు చేరిన శ్రీశైలం

శ్రీశైలం డ్యాం నిండుకుండను తలపిస్తున్నది. గత వారం రోజులుగా వరద ఉధృతి కారణంగా గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేయడంతో పర్యాటకుల సందడి నెలకొన్నది. వరద తగ్గుముఖం పట్టడంతో ఆదివారం గేట్లు మూసివేశారు. డ్యాం నీటిమట్టం 885 అడుగులకు గాను 884.20 అడుగులకు చేరింది.

డ్యాం సామర్థ్యం 215.8070 టీఎంసీలకు 210.9946 టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల పవర్ హౌజ్ నుంచి 37982, సుంకేసుల నుంచి 13,333 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ, కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 61,853 క్యూసెక్కులు, గేట్ల ద్వారా 192990క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాంకు 1,45,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, 94,722 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది.

## ప్రారంభమైన ఐసెట్ స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్

### నేడు, రేపు వెబ్‌ఆప్షన్లకు అవకాశం

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఎంబిఏ, ఎంసిఏ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారం నుంచి స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. నేడు(సోమవారం) సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (సోమవారం), మంగళవారం(మంగళవారం) వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చినట్టు తెలిపారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 10లోగా సీట్ల కేటాయింపు చేపట్టనున్నట్టు తెలిపారు. స్పెషల్ ఫేజ్‌లో సీటు పొందిన వారు ఈ నెల 13న ఆయా కాలేజీల్లో చేరాలని సూచించారు. ఫైనల్ ఫేజ్‌లో 19,540 మంది 2,51,192 వెబ్‌ఆప్షన్లను ఇచ్చారు. 288 కాలేజీల్లో 37,814 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయి. వాటిలో 30,587 ఎంబిఏ సీట్లు కాగా.. 7227 ఎంసిఏ సీట్లు ఉన్నాయి. చివరి విడత నాటికి ఎంబిఏలో 26,131 సీట్లను కేటాయించగా.. ఎంసిఏలో 4,723 సీట్లను కేటాయించారు. ఫైనల్ ఫేజ్‌లో సీట్లు పొందిన వారిలో ఎంత మంది విద్యార్థులు కాలేజీల్లో చేరారో సోమవారం ప్రకటించే అవకాశం ఉంది.

# దేశంలో ఆగని మత్తు దందాలు

### 2024లో 13,306 క్వింటాళ్ల డ్రగ్స్ పట్టివేత

### 96 వేల కేసులు, లక్షా 20 వేల మంది నిందితుల అరెస్టు

### గంజాయి స్మగ్లింగ్‌కు కారిడార్‌గా మారిన తెలంగాణ

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** దేశంలో డ్రగ్స్ మాఫియా కట్టడికి అన్ని రాష్ట్రాలతో పాటు కేంద్ర విభాగాలు ఉక్కుపాదం మోపుతున్నా స్మగ్లర్లు యధేచ్ఛగా తమ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) తాజా నివేదిక తేట తెల్లం చేసింది. విదేశీ డ్రగ్స్‌తో పా టు గంజాయి వంటి స్వదేశీ మత్తు పదార్థాల సాగు బాగా పెరిగిందని ఎన్‌సిబి నివేదిక వెల్లడించింది. 2024లో దేశ వ్యాప్తంగా 13,306 క్వింటాళ్ల మత్తు పదార్థాలు పట్టుబడగా ఈ సందర్భంగా 96 వేల కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి లక్షా 20 వేల మంది నిందితులు అ రెస్టయ్యారు. ఇక తెలంగాణ రాష్ట్రం గంజాయి స్మగ్లింగ్‌కు కారిడార్‌గా మారిందని, ఇక్కడి నుంచే దేశంలోని అనేక ప్రాంతాలకు స్మగ్లింగ్ అవుతుందని, ఎపి, ఒడిషా ఏజెన్సీ ప్రాంతాలతో పాటు హిమాచల్‌ప్రదేశ్. జ మ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్‌లో భారీగా సాగవుతున్న గంజాయి సాగతుతోందని ఎన్ సిబి తేల్చింది.

దేశంలో మత్తుపదార్థాల స్మగ్లింగ్, వినియోగం ప్రమాదకర స్థాయిలో వుందని ఎన్‌సిబి తాజా నివేదిక చెబుతోంది. ఓవైపు విదేశాల నుంచి కొకైన్, హెరాయిన్, ఎల్‌సిడి వంటి డ్రగ్స్ స్మగ్లింగ్ అవు తుండగా మరోవైపు గంజాయి, హష్ ఆయిల్, ఎపిడ్రిన్, ఎండిఎ, యాంపిటమైన్, టైప్ స్టిమ్యులెంట్స్, మెథక్వలోన్ వంటి సింథటిక్ డ్రగ్స్ దేశంలోనే తయారవుతుండడం ఆందోళన కలిగించే అంశంగా ఎన్‌సిబి పేర్కొంది. 2024లో పట్టుబడ్డ డ్ర గ్స్‌లో గంజాయి వంటి దేశీయ మాదకద్రవ్యాల వాటా 41 శాతంగా వుంది. 2019లో 1890 కిలోల డ్రగ్స్ పట్టుబడగా 2024 నాటికి ఇది 13,306 క్వింటాళ్లకు చేరింది. 2020లో 19 కిలోల కొకైన్ జప్తు చేయగా 2024 నాటికి ఇది 78 రెట్లు పెరిగి 1483 కిలోలకు పెరిగింది.

#### ఎపి, ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్‌లో భారీగా గంజాయి సాగు

ఇదిలా ఉండగా గంజాయి సాగులో దక్షిణాదిలో ఎపితో పాటు తూర్పు రాష్ట్రంగా పేరొందిన ఒడిషా ఉత్తరాది రాష్ట్రాలు హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్‌లు అగ్రభాగంలో వున్నట్లు ఎన్‌సిబి నివేదిక చెబుతోంది. ఒడిషా, ఎపిలోని ఏజెన్సీలలో నాణ్యమైన శీలావతి రకం గంజాయి సా గు ఎక్కువగా అవుతుందని ఎన్‌సిబి తెలిపింది. ఇక్కడ సాగవుతున్న గంజాయి తెలంగాణ మీదుగా గుజ రాత్, మహారాష్ట్ర, రాజస్తాన్‌లకు రవాణా అవుతోందని ఎన్‌సిబి నివేదికలో వుంది. తెలంగాణ మీదుగా స్మగ్లింగ్ అవుతున్న వందల కిలోల గంజాయి తరచూ ఇక్కడ పట్టుబడుతుండడం ఇం దుకు ఉ దాహరణ ఎన్‌సిబి చెబుతోంది. ఇక ఇటీవల కాలంలో హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరా ఖండ్‌లలో హైబ్రీడ్ గంజాయి సాగు పెర గడం ఆందోళనకలిగించేదిగా వుందని ఎన్‌సిబి పేర్కొంది. ఢిల్లీ విమానాశ్రయంలో ఇటీవల తరచూ భారీగా హైబ్రీడ్ గంజాయి పట్టుబడడం వెనుక ఈ మూడు రాష్ట్రాలలోని గంజాయి మాఫియా హస్తం వుందని ఎన్‌సిబి నివేదిక తేటతెల్లం చేసింది. ఇక దేశ వ్యాప్తంగా 2024లో 2700 కోట్ల రూ పాయల విలువచేసే 5408 క్వింటాళ్ల గంజాయిని ఆయా రాష్ట్రాలతో పాటు కేంద్ర విభాగాలు పట్టుకున్నాయి. తెలంగాణ వరకు వస్తే 24,427 కి లోల గంజా యితో పాటు 119 లీటర్ల హష్ ఆయిల్, 2.85 కిలోల హెరాయిన్, 132 బాట్ల ఎల్‌ఎస్‌డి జప్తు చేశారు.

## మావోయిస్టు కంచుకోట బస్తర్‌లో పదివేల రేడియోసెట్‌ల పంపిణీ

### ప్రజలకు మరింత చేరువయ్యేందుకు సిఆర్‌పిఎఫ్ బలగాల యత్నాలు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** మావోయిస్టు ప్రభావిత జిల్లాగా పేరొందిన ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్‌లో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు సిఆర్‌పిఎఫ్ బలగాలు మరో వినూత్న పంథాను ఎంచుకున్నాయి. ఇప్పటి వరకు ప్రజలకు చేరువయ్యేందుకు ఉచిత వైద్య శిబిరాలతో పాటు ప్రభుత్వ పథకాల అమలులో శ్రద్ధ కనబరచిన భద్రతా బలగాలు ఇప్పుడు మరో అడుగు ముందుకేసి చిన్నపాటి రేడియోలను స్థానికులకు ఉచితంగా అందజేస్తున్నాయి. ఈ రేడియోల జాతీయ భావనను పెంపొందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేబడుతున్న పథకాల గురించి వివరి ంచనున్నారు. బస్తర్ జిల్లా అంతా మారుమూల ప్రాంతం కావడం, ఇక్కడ టివిలు పెద్దగా వుండక పోవడం గమనార్హం. రేడియోలు కూడా కొందరి వద్దే వుంటాయి. ఇప్పుడు భద్రతా బలగాల పుణ్యమాని అక్కడి మెజారిటీ ప్రజలకు రేడియోలు అందుబాటులోకి వచ్చాయి. నెల రోజులుగా ఈ రేడి యో సెట్‌లను సిఆర్‌పిఎఫ్ బలగాలు పంపిణీ చేస్తున్నాయి. ఇప్పటి వరకు పది వేలకు పైగా రేడియోలను ప్రజలకు అందజేశారు. మరో పదివేల సెట్‌లను పంపిణీ చేయనున్నారు. ఈ రేడియోల ద్వారా ప్రధాని మోది ప్రతీ నెల నిర్వహించే మన్ కీ బాత్‌ను సిఆర్‌పిఎఫ్ బలగాలు ప్రజలకు వినేలా ఏర్పాటు చేశారు. దీంతో పాటు వినోద కార్యక్ర మాలు కూడా రేడియో ద్వారా ప్రసారం చేయనున్నారు. బస్తర్ జిల్లాలో 180 కంపెనీల సిఆర్‌పిఎఫ్ బలగాలు (సుమారు 1800 మంది) వుండగా ఈ బలగాలు మారుమూల ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ఒక్కో రేడియో సెట్‌ను అందజేస్తున్నాయి. ఈ రేడియో సెట్‌లో కరెంటు లేదా బ్యాటరీ ద్వారా పనిచేసేలా రూపొందించారు. ఒక్కో రేడియో సెట్ 1500 రూపాయల వరకు వుంటుందని అధి కారులు తెలిపారు.

# రూ.లక్ష కోట్లకు చేరిన ఖజానా ఆదాయం

## బడ్జెట్ అంచనాల్లో 90 శాతానికి చేరిన రుణాలు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆదాయం లక్ష కోట్ల రూపాయలకు చేరువైంది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలోని తొలి ఐదు నెలల కాలానికి సర్కార్‌కు 96,654.25 కోట్ల రూపాయల మేర ఆదాయం లభించింది. అయితే గత ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే పన్నుల ద్వారా రాబడుల్లో తగ్గుదల చోటు చేసుకుంది. ఈ మేరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అగస్టు నెలాఖరు వరకూ ఖజానా పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదికలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్ర రెవెన్యూ ఆదాయం 63 వేల కోట్ల రూపాయలు దాటింది. అయితే పన్నుల ద్వారా సమకూరిన రాబడులు గత ఏడాది ఇదే కాలానికి వచ్చిన మొత్తం కంటే ఈ సారి 1 శాతం తగ్గి 33 వేల కోట్ల రూపాయలకు చేరాయి.

జీఎస్టీ కింద 21,144 కోట్ల రూపాయలు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా 6,218 కోట్ల రూపాయలు, మద్యం అమ్మకాలు తదితర వాటి ద్వారా 7,758 కోట్ల రూపాయలు, అమ్మకం పన్ను కింద 14,079 కోట్ల రూపాయలు లభించాయి. అలాగే ఇతర పన్నులు, డ్యూటీల ద్వారా 3,352 కోట్ల రూపాయలు, కేంద్ర పన్నుల్లో వాటాగా 7,413 కోట్ల రూపాయలు సమకూరాయి. అలాగే పన్నేతర ఆదాయం 1,578 కోట్ల రూపాయలు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద 1,673 కోట్ల రూపాయలు వచ్చాయి. కాగా అప్పులు మాత్రం వార్షిక అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న మొత్తంలో ఇప్పటికే 90 శాతం దాటాయి. బడ్జెట్‌లో 54 వేల కోట్ల రూపాయల మేర రుణాలు సమకూర్చుకోనున్నట్లు పేర్కొనగా, ఐదు నెలల్లో 61.87 శాతం మేర 33,434 కోట్ల రూపాయలను సేకరించింది. గత నెలలో చేసిన 15 వేల కోట్ల రూపాయలను కలిపితే ఆరు నెలలకు 90 శాతం మేర అప్పులు చేసినట్లయింది.

# జమైకాలో పశువుల మేత కొరత నివారణ

## ఇక్రిశాట్‌తో ఒప్పందం

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** జమైకాలో పశువుల మేతకు తీవ్ర కొరత ఏర్పడిన దృష్ట్యా ఆదేశంలో దాణాను పెంచేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ఇందుకు హైదరాబాద్‌లోని ప్రపంచంలోనే అగ్రగామి డ్రై ల్యాండ్ వ్యవసాయ సంస్థ ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ ది సెమీ-అరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్)తో అక్కడి ప్రైవేటు కంపెనీలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. కారికామ్ ప్రైవేట్ సెక్టార్ ఆర్గనైజేషన్ (సిపిఎస్ఒ), సెప్రోడ్ భాగస్వామ్యం ద్వారా జమైకాలో పశువుల మేత కొరతను అధికమించేందుకు అవసరమైన ప్రాజెక్టు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు ఇక్రిశాట్ కు మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ప్రధానంగా ఈ ప్రాజెక్టులో భాగంగా జమైకాలో మేత కొరతను పరిష్కరించడానికి, పశువుల దిగుబడిని పెంచడానికి, వాతావరణ స్థితి స్థాపకతను మెరుగుపర్చడానికి ఇక్రిశాట్ సహకారాన్ని అందించనుంది. ద్వంద్వ ప్రయోజన జొన్న రకాల అభివృద్ధిని వేగవంతం చేయడం, పశువుల దాణా భద్రతను బలోపేతం చేయనుంది.

# రైతులకు రూ.1,160 కోట్ల బకాయిలు

## రబీ బోనస్ కోసం ఎదురుచూపులు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** రబీ (యాసంగి) సీజన్ ముగిసి, ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ (వానాకాలం' సాగు చేసే సమయం చివరి దశకు చేరుకున్నా ధాన్యం అమ్మిన అన్నదాతలు బోనస్ సొమ్ముల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసి నాలుగు నెలలు అయినా ఇంత వరకూ క్వింటాలుకు 500 రూపాయలు చొప్పున రైతులకు చెల్లించకుండా పెండింగ్ పెట్టింది. యాసంగి సీజనులో రాష్ట్రవ్యాప్తంగా 74.23 లక్షల టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. ఇందులో సన్న రకానికి చెందిన ధాన్యం దాదాపు 23.20 లక్షల టన్నులు కాగా, వీటికి బోనస్‌గా 1,160 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించాల్సి ఉంది. మరోపక్క ప్రస్తుత ఖరీఫ్ సీజను ధాన్యం మార్కెట్‌కు రానుండగా, యాసంగిలో అమ్మిన ధాన్యానికే దిక్కులేదని పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 67.33 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడగా, తద్వారా 80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా. ఇందులో 62 శాతం మేర సన్న రకాలను రైతులు సాగు చేయగా, 42 నుండి 45 లక్షల టన్నులు దిగుబడి అవుతుందని అధికారులు చెబుతున్నారు.

# మెట్రో రైలు ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్!




ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ సి.రాంచంద్రయ్య

## హెచ్‌సిఎఫ్ చర్చాగోష్టిలో ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య.

**హైదరాబాద్(చిక్కడపల్లి) అక్టోబరు 5, ప్రభాతవార్త:** హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో 'మెట్రో రైల్ నష్టాలకు కారణమెవరు? భవిష్యత్ సవాళ్లు ఏమిటి?' అంశంపై ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఐలమ్మ ఆర్ట్‌గేలరీలో చర్చాగోష్టి జరిగింది. హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వహణ నుండి ఎల్అండ్‌టి తప్పుకున్న విషయంపై జరిగిన చర్చాగోష్టిలో ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రొఫెసర్ సి.రాంచంద్ర య్య మాట్లాడిన ప్రసంగించారు. ప్రయాణికుల ప్రయోజనాల కంటే రియల్ ఎస్టేట్ ప్రయోజనాలే ముఖ్యంగా కొనసాగిన మెట్రో రైల్ ప్రాజెక్టు ఒప్పందం విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండగా మారుతుందన్నారు. అనేక వాగ్దానాలు చేసిన ఎల్ అండ్ టి సంస్థ వాటిని నిలబెట్టుకోలేక పోయిందని, ప్రయాణీకుల సంఖ్య భారీగా పెరుగుతుందని వేసిన అంచనా పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కామన్ టికెట్ తెస్తామని చెబుతూనే ఉన్నారు, అమలుపై చిత్తశుద్ధిని ఏ ప్రభుత్వం పాటించలేదని, మెట్రో రైల్ ప్రాజెక్టు పేరుతో బస్ రవాణా, ఎంఎంటీఎస్, ఫుట్ పాత్ ల వ్యవస్థలను నిరక్ష్యం చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో 36 ఫ్లైఓవర్లు నిర్మించారు. కానీ ఒక్క ఫుట్ పాత్ కూడా నిర్మించలేదన్నారు.

తెలంగాణ అర్బన్ డెవలప్మెంట్ ఫోరం కన్వీనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ నష్టాల పేరుతో మెట్రో రైల్ నిర్వహణ నుండి ఎల్ అండ్ టి తప్పుకోవడం ఒప్పంద ఉల్లంఘనే అవుతుందని, ఎల్ అండ్ టి సంస్థ ఆర్థిక లక్ష్యాలు సాధించడంలో పూర్తిగా విఫలమైందని, నష్టాలకు పూర్తి బాధ్యత ఎల్ టి నే వహించాలన్నారు. ఒప్పందానికి విరుద్ధంగా మెట్రో రైల్ ఛార్జీలు భారీగా పెంచిందని. సామాన్య ప్రయాణికులపై ఎల్ అండ్ టి భారం మోపిందని. ప్రయాణికుల సౌకర్యాలపై ఏ మాత్రం శ్రద్ధ వహించలేదన్నారు.

రైల్ కోచ్ ల సంఖ్యను పెంచాలనే డిమాండ్ ను కనీసం పట్టించుకోలేదని, మెట్రో రైల్ రెండో దశ కు అనుమతి ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపిస్తుందని, కొర్రీలు వేయడం మానుకొని మెట్రో ప్రాజెక్టుకు కేంద్ర సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్చా గోష్టికి హెచ్.సి.ఎఫ్ ప్రధాన కార్యదర్శి కే.వీరయ్య వక్తలను వేదిక మీదకి ఆహ్వానించగా, హెచ్.సి.ఎఫ్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సామాజిక వేత రాజీవ్ కుమార్ గారు, పర్యావరణవేత్త డాక్టర్ జయసూర్య గారు ప్రసంగించారు. ఈ చర్చా గోస్టికి హెచ్.సి.ఎఫ్ నగర నాయకులు పి. శ్రీనివాసరావు, మోహన్, సంగీత, కె.లలిత, హస్మిత, జె. నర్సింగరావు, కె. రమేష్, శంకర్ లు నాయకత్వం వహించారు. కోశాధికారి రాజమోళి వందన సమర్పణ చేశారు.

# అడ్డూ అదుపులేని విద్యుత్ చౌర్యం

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** విద్యుత్ అధికారుల ఉదాశీనత, నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ చౌర్యం పీక్ స్టేజికి చేరుతోంది. దీనిపై అధికారులు పట్టించుకోక పోవడంతో విద్యుత్ చౌర్యం మరింత పెరుగుతోంది. కొందరు విద్యుత్ ఉద్యోగులతో కుమ్మక్కవుతూ కరెంటును దొంగచాటుగా విని యోగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ చౌర్యానికి సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా ఇటీవల ఎనిమిది నెలల్లో 46,480 కేసులు నమోదుకావడం విశేషం. రాష్ట్రంలోని యాదాద్రి, సూర్యాపేట, మెదక్, నల్గొండ, మేడ్చల్, సంగారెడ్డి లో విద్యుత్ దొంగతనం ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు అధికారులు ప్రతి సర్కిల్‌లో 2,500 కి పైగా కేసులు నమోదు చేస్తు వచ్చారు. అత్యధికంగా నల్గొండలో 3,505 కేసులు ఉన్నారు. ఇలా ఒక్క మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలలోనే 46,480 కేసులను నమోదయ్యాయి. ఇలా గత 2022 నుంచి తెలంగాణలో విద్యుత్ దొంగతనం పై కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2022 ఏడాదిలో దొంగ కరెంటు వినియోగం 64,245 కేసులు నమోదు కాగా, అది 2023లో 69,064 కేసులు నమోదయ్యాయి. 2024 లో నవంబర్ వరకు 28,536 కేసులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కరెంటు దొంగతనాలను అరికట్టాలనే ఉద్దేశ్యంతో ఉన్నతాధికారుల వ్యూహాత్మకంగా ముదుకు వెళుతున్నారు. గృహ, గృహేతర, వాణిజ్య, మతపరమైన ప్రదేశాలతో పాటు, పౌల్ట్రీ ఫారాలు, పరిశ్రమలు, కుటీర పరిశ్రమలతో సహా అన్ని రకాల విద్యుత్ వినియోగదారులపై ఉన్నతాధికారులు దృష్టిసారిస్తున్నా, వాటికి కొందరు అధికారులు అడ్డుతగులుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్ఎస్పీడీసీఎల్) యాంటీ పవర్ పీల్ఫరేజ్ టీముల ద్వారా ఎనిమిది నెలల్లో ట్రాక్ చేయడంతో విద్యుత్ చౌర్యం బయటపడింది. ఈ కేసుల్లో అత్యధికంగా 4,194 కేసులు హైదరాబాద్ సర్కిల్‌లోనే నమోదయ్యాయి. 2024 లో నవంబర్ వరకు 28,536 కేసులు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్ సర్కిల్ పరిధిలోని పాతబస్తీ, బంజారాహీల్స్, సైబర్ సిటీ, సికింద్రాబాద్ తదితర చోట్ల కూడా ప్రధానంగా మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ చౌర్యం సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. నివాస ప్రాంగణాల్లో కూడా కరెంటు దొంగతనంగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. సగటున మీటర్ ట్యాపరింగ్ తర్వాత నెల వారీ విద్యుత్ బిల్లుల ద్వారా వచ్చే ఆదాయంలోన సుమారు 150 నుండి 250 శాతం వరకూ తగ్గుదల చోటు చేసుకుంటున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు.

> **కరెంటు అధికారుల ఉదాశీనత**
> **ఎనిమిది నెలల్లోనే 46 వేల కేసులు!**
> **హైదరాబాద్ సర్కిల్‌లో సంఖ్య 4,194**

# బిసి రిజర్వేషన్లు అడ్డుకుంటే అగ్గి రాజేస్తాం

## హైకోర్టు, సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తాం: జాజుల

**హైదరాబాద్ అక్టోబరు 5, ప్రభాతవార్త:** బీసీలకు న్యాయబద్ధంగా రావలసిన 42 శాతం రిజర్వేషన్లను రెడ్డి సంఘం పేరుతో మాధవరెడ్డి, గోపాల్ రెడ్డిలు అనేక కుట్రలు కుతంత్రాలతో అడ్డుకోవాలని చూస్తున్నారని, బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే రాష్ట్రవ్యాప్తంగా బీసీలంతా అగ్గి రాజేస్తారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచడం మూలంగా రాష్ట్రంలో ఏ సామాజిక వర్గానికి నష్టం లేనప్పటికీ బీసీ రిజర్వేషన్లను ఎలాగైనా అడ్డుకొని తీరాలని తెరవెనుక ఎంతో మంది అగ్రకుల శక్తులు కుటీల ప్రయత్నాలు మొదలు పెట్టారని అందులో భాగంగానే రెడ్డి జాగృతికి చెందిన మాధవరెడ్డి గోపాల్‌రెడ్డిను ముందు పెట్టి బీసీ రిజర్వేషన్లకు గండిగొట్టి బీసీలను రాజకీయంగా అణిచివేయాలని పథకం పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కామారెడ్డి డిక్లరేషన్లు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించినప్పుడు గానీ రాష్ట్రంలో కులగన చేసినప్పుడు గాని అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టం చేసినప్పుడు గాని ఎప్పుడూ నోరు ఎత్తని రెడ్డి సంఘం వారు తీరా 42 శాతం రిజర్వేషన్లు పెంచుతు జీవోను విడుదల చేయగానే రాత్రికి రాత్రే కోర్టులను వేదికగా చేసుకొని బీసీలకు అన్యాయం తలపెట్టాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు బీసీల పక్షాన ధర్మం న్యాయం ఉన్నదనీ హైకోర్టులో సుప్రీంకోర్టులో బీసీలకు న్యాయం జరుగుతుందని విశ్వాసం తమకుందన్నారు

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు పోరాడి సాధిస్తాం

> **పోరాటాలకు బిసిలు సిద్ధం కావాలి:**
> **ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు**
> **బిసి బిల్లు ఆమోదించడంలో కేంద్రం వెనుకంజ:**
> **మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపణ**



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, వాకిటి శ్రీహరి, గుజ్జ కృష్ణ, బండారు దత్తాత్రేయ, వి.హెచ్, మధుసూదనాచారి, రవిచంద్ర.

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 5, ప్రభాతవార్త:** బిసిలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్‌లు దక్కించుకునేందుకు ఎంత వరకైనా తెగించి పోరాడి సాధిస్తామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. అవసరమైతే న్యాయ పోరాటం, ప్రజా పోరాటం చేస్తామని, ఇందుకు యావత్ బిసి ప్రజానీకం సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కోలా జనార్ధన్ అధ్యక్షతన ఆదివారం బిసి సంఘాల-బిసి అఖిల పక్ష ప్రజా ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశం లక్డికాపూల్‌లోని ఒక హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ అగ్రకులాలకు పది శాతం రిజర్వేషన్‌లు ఇచ్చినప్పుడు 50 శాతం సీలింగ్ గుర్తుకు రాలేదా ? అని ప్రశ్నించారు. అగ్రకులాల జనభా 6 శాతం ఉంటే పది శాతం రిజర్వేషన్‌లు కల్పించారని, 56 శాతం ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తుంటే అగ్రవర్ణాల వారు కోర్టుకు వెళ్ళడం దారుణమన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌లు సాధించాలనే కోరికి ప్రతి ఒక్కరి నరనరాల్లో కసి ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిసి బిల్లు ప్రవేశపెట్టి అమోదం కోసం కేంద్రానికి పంపిందని చెప్పారు. గతంలో తమిళ నాడులో జయలలిత బిసి బిల్లు ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారం లో ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టి 5 నెలలు గడుస్తున్న కేంద్రం నుంచి ఏలాంటి స్పందన రాలేదన్నారు. ఈ రోజుల్లో బిసిలు ఆనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటే తప్ప ఎమ్మెల్యేలు కూడా కాలేక పోతున్నారని, భవిష్యత్తు తరాలకు ఇలాంటి పరిస్థితులు రాకుడదని చెప్పారు. ఈ వేదిక భవిష్యత్ తరాలకు బాటలు వేసే వేదికగా కావాలని, ఆ విధంగా కార్యాచరణను రూపొందించాలని మంత్రి కోరారు.

ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో రాజ్యసభసభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మల్కా కొమరయ్య, రాజ్యసభ మాజీసభ్యుడు వి.హను మంతరావు, రాపోలు ఆనంద్‌భాస్కర్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం యాదయ్య యాదవ్, పుట్టా మధు, పలు బిసి సంఘాల నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# దసరా తిరుగు ప్రయాణానికి ప్రత్యేక బస్సులు

## రద్దీ మేరకు అదనపు బస్సులు ఏర్పాటు: ఆర్‌టిసి

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెద్ద పండుగగా జరుపుకునే దసరా పండుగకు ప్రయాణీలకు తమ సొంత గ్రామాలకు వెళ్లడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన ఆర్‌టిసి.. వారు తిరిగి తమ ప్రాంతాలకు చేరుకోవ డానికి సైతం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా దసరా పండుగ తిరుగు ప్రయాణం నేపథ్యంలో ప్రజలకు రవాణా పరమైన అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఆర్‌టిసి యాజమాన్యం ప్రకటించింది. ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కి 1050 స్పెషల్ బస్సులను సంస్థ ఏర్పాటు చేసింది. అందులో అత్యధికంగా వరంగల్ రీజియన్ నుంచి 229, కరీంనగర్ నుంచి 211, నల్గొండ నుంచి 137 ప్రత్యేక సర్వీసులని నడిపింది. ఆదివారం రాత్రి వరకు రద్దీ కొనసాగింది. సోమవారం కూడా హైదరాబాద్‌కి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో.. రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆర్‌టిసి అధికారులు ప్రకటించారు. దసరా పండుగ నేపథ్యంలో 7754 ప్రత్యేక బస్సులను ఆర్‌టిసి కొనసాగించింది.

# పెంచిన ఆర్‌టిసి ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** హైదరాబాదు, సికింద్రాబాదు జంట నగరాల్లో ఆర్‌టిసి పెంచిన బస్ ఛార్జీలను వెంటనే ఉపసంహారించుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఆర్‌టిసి ఛార్జీలను మొదటి మూడు స్టేజీలకు రూ.5, నాలుగవ స్టేజీకి రూ.10 చొప్పున పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తమ పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. పెంచిన ఛార్జీలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త డిపోలు, కొత్త ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటుకు రూ.392 కోట్లు ఖర్చు అవుతుందని, ఈ ఛార్జీలను పెంచుతున్నట్లు, అందుకు ప్రజలు సహక రించాలని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాదులో ఎలక్ట్రికల్ బస్సు చార్జీలను, బస్సు పాస్ చార్జీలను భారీగా పెంచిందని గుర్తు చేశారు.

అంతేకాకుండా పండగల పేరుతో ప్రజల నుండి 50 శాతం ప్రత్యేక చార్జీలు వసూలు చేస్తూనే ఉన్నారని అన్నారు. మౌలిక సదుపాయాలకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా.. ప్రజలపై మరోసారి అదనంగా భారాలు వేయడం సమంజసం కాదన్నారు జాన్ వెస్లీ. కార్గో సేవలను ఆర్‌టిసిలోనే కొనసాగాంచాలని డిమాండ్ చేశారు.

ఆర్‌టిసి కార్గో సర్వీసులను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తున్నట్లు వార్తలొస్తున్నాయని.. కార్గో సేవలను ప్రైవేటీకరించాలనే ప్రయత్నాలను విరమించుకొని, ఆర్‌టిసిలోనే కార్గోసేవలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత అందుబాటులోకి తేవాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని రిక్రూట్ చేసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.


# భారత్ ఇజ్రాయెల్‌తో అన్ని సంబంధాలు తెంచుకోవాలి

## పాలస్తీనా సమస్య మానవతాపరమైనది

## ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా నేతలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబరు 5, ప్రభాతవార్త:** భారత ప్రభుత్వం ఇజ్రా యెల్‌తో అన్నిరకాల దౌత్య, వాణిజ్య సంబంధాలను తక్షణమే తెంచుకోవాలని ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా నేతలు డిమాండ్ చేశారు. రెండేళ్లుగా గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమానికి వ్యతిరేకంగా ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ఆదివారం ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆనంద్, శ్రీజ, భార్గవి, పీఓడబ్ల్యూ సంధ్య, సజయ తదితరులు పాల్గొని పాలస్తీనాకు మద్దతుగా ప్రసంగించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలస్తీనా సమస్య మతపరమైన అంశం కాదని, మానవతాసమస్య అని ఉద్ఘాటించారు. మత విశ్వాసాలతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు పాలస్తీనాకు మద్దతుగా వీధుల్లోకి వస్తున్నారని గుర్తు చేశారు. మానవత్వం వైపు నిలబడాలని అనుకునే వారు పాలస్తీనాకు మద్దతు ఇస్తూ, ఇజ్రాయెల్‌ను వ్యతిరేకించాలని అన్నారు. దిశ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, నవజవాన్ భారత్ సభ, ప్రొగ్రెసివ్ డాక్టర్స్ లీగ్ కూడా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని పాలస్తీనా ప్రజలకు సంపూర్ణ మద్దతు తెలియచేశారు.



# అణగారిన వర్గాల గొంతుక కాకా

## నివాళులర్పించిన పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** అణగారిన వర్గాల గొంతుకగా, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత కాకా వెంకట స్వామి అని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాక జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాకా వెంకట స్వామి చూపిన మార్గం, ఆయన విలువలు, సమానత్వం, న్యాయం, సేవ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల కోసం 1949లో జాతీయ గుడిసెల సంఘంను స్థాపించి హైదరాబాద్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్మికుల పక్షపాతిగా కాకా గారు చేసిన సేవలు అద్భుతమని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల పట్ల కాకాకి ఉన్న పేగు బంధాన్ని స్మరించుకుంటూ, కేంద్ర మంత్రిగా సింగరేణి కార్మికుల ఐటి మాఫీ చేయాలని పార్లమెంట్‌లో కోరిన మొదటి నేతగా ఆయన పేరు చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ప్రజాసేవే పరమావధిగా కాకా జీవించారని, నేటి తరం నాయకులకు ఆయన జీవితం స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తుందని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. పేదల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన కాకా ఆలోచనలు సామాజిక సమానత్వ సాధనలో మనకు దిశానిర్దేశం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# చంద్రశేఖర్ కుటుంబానికి అండగా ప్రభుత్వం

## పరామర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** అమెరికాలో దుర్మరణం పాలైన విద్యార్థి పోలో చంద్రశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎస్సి, ఎస్టి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. అమెరికాలో జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన తెలంగాణ విద్యార్థి పోలే చంద్రశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని మంత్రి అడ్లూరి క్ష్మణ్ కుమార్ కుమార్ బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఎల్బీనగర్‌కు చెందిన చంద్రశేఖర్ కుటుంబాన్ని మంత్రి ఆదివారం స్వయంగా వెళ్లి పరామర్శించారు. బాధిత విద్యార్థి తల్లికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంచి భవిష్యత్తు కోసం విదేశాలకు వెళ్లిన ప్రతిభావంతుడు ఇలా దుండగుల చేతిలో మృత్యువాత పడటం ఎంతో బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇదివరకే మాట్లాడినట్లు చెప్పారు. చంద్రశేఖర్ పార్థివదేహాన్ని వీలైనంత త్వరగా హైదరాబాద్‌కి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే అమెరికా ఎంబసీ అధికారులతో, భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయంతో సిఎస్ స్థాయిలో నిరంతర సమన్వయం జరుగుతోందని చెప్పారు.




సిడిని ఆవిష్కరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, జి.వివేక్ వెంకటస్వామి తదితరులు

# పదవులకే వన్నె తెచ్చిన వెంకటస్వామి

## జయంతి వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 5, ప్రభాతవార్త:** కేంద్ర మాజీమంత్రి, ప్రముఖ కార్మిక నేత జి.వెంకటస్వామి 96వ జయంతి వేడుకలు ఆదివారం రవీంద్ర భారతిలో ఘనంగా జరిగాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే జి.వినోద్, పార్లమెంట్ సభ్యులు ఎ.అనిల్ కుమార్ యాదవ్, వంశీకృష్ణ తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయాల్లో గొప్ప పేరున్న వ్యక్తి జి.వెంకటస్వామి (కాకా) అని కొనియాడారు. రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, కార్మిక నేతగా, సిడబ్ల్యూసి సభ్యుడుగా పనిచేసిన ఆయన పదవులకే వన్నె తీసుకువచ్చారని చెప్పారు. అంతకు ముందు కాకా జీవిత చరిత్రకు సంబంధిన సిడిని వారు ఆవిష్కరించారు. కాకా చిత్రపటానికి నివాళులు అర్పించిన వారిలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆదివారం ట్యాంక్‌బండ్ వద్దగల వెంకటస్వామి విగ్రహానికి పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, జి.వివేక్ వెంకటస్వామి, మాజీమేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పూల మాలలువేసి ఘనంగా నివాళులు అర్పించి కాకా సేవలను కొనియాడారు.

# ఎసిబి కస్టడీకి విద్యుత్ శాఖ మాజీ ఎడిఇ అంబేద్కర్

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** వందల కోట్ల రూపాయల అక్రమాస్తుల కేసులో అరెస్టయిన విద్యుత్ శాఖ మాజీ ఏడీఈ అంబేద్కర్‌ను ఎసిబి అధికారులు సోమవారం కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. అంబేద్కర్‌ను నాలుగు రోజుల పాటు కస్టడీకి ఎసిబి కోర్టు అనుమతించింది. ఆయన ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో వుండడం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం బాగ్‌లో ఎడిఇగా పనిచేసిన అంబేద్కర్ భారీగా అక్రమాస్తులు కలిగివున్నట్లు అభియోగాలు రావడంతో ఎసిబి అధికారులు దాడులు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన వద్ద 200 కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులు పట్టుబడడం విదితమే. ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఇళ్లలోనూ ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో అంబేద్కర్‌ను అరెస్టు చేయగా ఇతన్ని మరింతగా విచారించేందుకు ఎసిబి అధికారులు కస్టడీ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఎసిబి పిటిషన్‌ను విచారించిన కోర్టు నాలుగు రోజుల కస్టడీకి అనుమతించింది. సోమవారం ఉదయం అంబే ద్కర్‌ను చంచల్‌గూడ జైలు నుంచి ఉస్మానియా ఆ సుపత్రికి తరలించి వైద్య పరీక్షల తరువాత బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలో తరలించి విచారించనున్నారు.



## విమానంలో కోపైలట్‌గా బిజెపి ఎంపి రాజీవ్‌ప్రతాప్ రూడీ!

**భోపాల్, అక్టోబరు 5:** ప్రజాసేవలో బిజీగా ఉండే రాజకీయ నాయకులు అప్పుడప్పుడు తమలో ఉన్న ప్రతిభకు కొంత సమయం కేటాయిస్తుంటారు. తాజాగా బీజేపీకి చెందిన బీహార్ ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ కో పైలట్‌గా మారారు. దీనిపై రూడీని ప్రశంసిస్తూ కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పెట్టిన పోస్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళ్తే పాట్నా నుంచి ఢిల్లీకి వెళ్లే విమానంలో మంత్రి చౌహాన్ ప్రయాణించారు. ఈ క్రమంలో విమానంలో కోపైలట్‌గా ఉన్న రూడీని చూసి ఆశ్చర్యపోయారు. దీనికి సంబంధించి చౌహాన్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'రాజీవ్ ఈ రోజు మీరు మా హృదయాలను గెలిచారు. పాట్నా నుంచి ఢిల్లీకి వెళ్లే ఈ ప్రయాణం నాకు మరవలేనిది. ఎందుకంటే ఈ విమానానికి నా ప్రియమైన స్నేహితుడు, ఛాప్రా ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ కోపైలట్‌గా ఉన్నారు' అని చౌహాన్ రాసుకొచ్చారు. విమానంలో రూడీతో మాట్లాడుతున్న ఫొటోతోపాటు రూడీని ప్రశంసిస్తూ చేతితో రాసిన లేఖను కూడా చౌహాన్ పంచుకున్నారు.

# బిఎంసి ఎన్నికల కోసం ఒకే వేదికపైకి థాకరే సోదరులు!

## ఇప్పటికే పలుసార్లు పరస్పరం భేటీ

**ముంబయి, అక్టోబరు 5:** మహారాష్ట్ర స్థానికసంస్థలకు ఎన్నికలు సమీపిస్తుండటంతో విడిపోయిన థాకరే సోదరులు మళ్లీ కలుస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు ఈ కుటుంబాలు అప్పుడప్పుడూ ప్రత్యేకకార్యక్రమాల్లో కలుసుకుంటూ వస్తున్నారు. హిందీని మూడో తప్పనిసరిభాషగా చేయడాన్ని ఈ రెండు శివసేనలు కూడా సంయుక్తంగా వ్యతిరేకించాయి. శివసేనతో వేరుపడినరాజ్‌థాకరే మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్‌సేన ఏర్పాటుచేసుకుంటే శివసేనలో చీలకలు వచ్చినతర్వాత ఉద్ధవ్‌థాకరే విభాగం శివసేనయుబిటిగా అవతరించిన సంగతి తెలిసిందే. షిండే సేనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఈ రెండువర్గాలువెన్నుపోటుకు గుణపాఠం చెప్పాలన్న లక్ష్యంతోనే ఉన్నారు. ఒకటో తరగతినుంచి హిందీని తప్పనిసరిచేయడంపై ఎంఎన్ఎస్;యుబిటి శివసేన రెండూ వ్యతిరేకిస్తున్నాయి. అయితే ఇటీవలికాలంలో వీరిద్దరూ కూడా ఐదుసార్లు కలుసుకున్నారు. రోజుకు రెండుసార్లు కూడా కలుస్తుకోవడం బిజెపి,కాంగ్రెస్; ఇతర పార్టీల్లో చర్చకు దారితీస్తోంది. ఒకసారి కకుటుంబ పరమైన వేడుకలో కలుసుకోగా ఆ కార్యక్రమాన్ని యుబిటి ఎంపి సంజయ్‌రౌత్ నిర్వహించారు.

ఆ తర్వాత ఉద్ధవ్‌థాకరే బాంద్రా ఈస్ట్ నివాసంలో వీరిరువురి భేటీ పతాకస్థాయి చర్చలకు తావిచ్చింది. ఈ రెండు సంస్థలుకలిసే సంయుక్తంగా ఒక కార్యాచరణ లేదా నిరసన అమలుచేయాలనిచూసారు. రెండుదశాబ్దాల్లో మొట్టమొదటిసారిగా అటు థాకరే, ఇటు రాజ్‌థాకరేలు ఒకేవేదికపైకి వచ్చారు. థాకరే శివసేన రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ముందుగానే అవగాహనతో పోటీచేస్తామని ప్రకటించింది. జులైనెలలో రాజ్‌థాకరే అకస్మాత్తుగా థాకరే పుట్టినరోజున మాతోశ్రీ నివాసానికి వచ్చారు.

ఈ రెండువిభాగాల్లోని సీనియర్ నాయకులతో ఏర్పాటుచేసిన కమిటీ పార్టీలపరంగా ఎక్కడ బలం ఉందనేది అధ్యయనం చేస్తోంది. క్షేత్రస్థాయిలో రెండు పార్టీలనేతలు ఇప్పటికే ఒక్కటిగా కార్యక్రమాలుచేస్తున్నారు. నాసిక్‌లో ఎంఎన్ఎస్, యుబిటికేడర్ ఇటీవలే సమిష్టిగా ర్యాలీతీసారు. బెస్ట్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో కూడా కలిసేపోటీచేసారు అయితే సక్సెస్ కాలేకపోయారు. పార్టీనేతలు మాత్రం ఈ సొసైటీ ఎన్నికలను అంతగా పట్టించుకోలేదని సమర్ధించుకుంటున్నారు. బిఎంసి ఎన్నికల్లో తమకు కీలకమని వారు చెపుతూ సమిష్టిగానే ఈసారి పోటీకి దిగుతామని చెపుతున్నారు. ఇదిలా ఉంటే బిజెపి ఇటీవలే కొత్తగా నగర అధ్యక్షుడిని నియమించుకుంది. యుబిటి అధికారంలోకి రావాలనుకుంటే మేం ఈసారి ముంబయి నగరానికి ఖాన్‌పేరిట కొత్తమేయర్‌ను తెస్తామని హెచ్చరికలుచేస్తోంది. ఇక మరాఠి గుర్తింపుకోసం థాకరే విభాగం ముందునుంచి పోరాడుతున్న సంగతి తెలిసిందే. దసరా ర్యాలీలోకూడా ఉద్ధవ్‌థాకరే, సంజయ్‌రౌత్‌లు పార్టీనేతలకు రాజ్‌థాకరేపార్టీపట్ల కలిసి రావాలంటూ సూచనలు కూడాచేసారు. దీనితో బిఎంసి ఎన్నికల్లో థాకరేలు సమష్టిగాపోటీచేస్తారన్న అంచనాలు జోరందుకున్నాయి.



## హైదరాబాద్‌లో కొత్తగా ఆరు ఫైవ్‌స్టార్ హోటళ్లు

### పర్యాటక శాఖతో ఒప్పందాలు కుదుర్చుకున్న పలు సంస్థలు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా నగరంలో ఆరు ఫైవ్‌స్టార్, ఒక ఫోర్‌స్టార్ హోటల్‌తో పాటు.. ఒక ట్రేడ్ సెంటర్.. నగరం వెలుపల ఒక వెల్‌నెస్ రిసార్ట్ నిర్మించనున్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాలలో సుమారు రూ. 6 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టులు రానున్నాయి. ఈ నిర్మాణాల ద్వారా పర్యాటక రంగంలో సుమారు 8 వేల మందికి ఉపాధి లభిస్తుందని పర్యాటక శాఖ అంచనా వేస్తోంది. హైదరాబాద్ నగరం పర్యాటక రంగంలో సరికొత్త పురోగతిని సాధించే దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర రాజధానిని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు.. పర్యాటక శాఖ వసతి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ లక్ష్య సాధనలో భాగంగా.. హైదరాబాద్‌లో ఏకంగా ఆరు ఫైవ్‌స్టార్ హోటళ్లు, ఒక ఫోర్‌స్టార్ హోటల్‌తో సహా ఒక ట్రేడ్ సెంటర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. నగరానికి వచ్చే జాతీయ, అంతర్జాతీయ సందర్శకులకు అత్యున్నత స్థాయి ఆతిథ్యం అందించేందుకు ఈ భారీ ప్రాజెక్టును చేపట్టారు. ఇటీవల జరిగిన టూరిజం కాన్‌క్లేవ్‌లో వివిధ దేశీయ, అంతర్జాతీయ సంస్థలతో ప్రభుత్వం ఈ నిర్మాణాల కోసం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ నిర్మాణాలు హైదరాబాద్‌లోని అత్యంత కీలకమైన.. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో రూపుదిద్దుకోనున్నాయి. ఆ ప్రాంతాల విషయానికి వస్తే.. రాయదుర్గం, బుద్వేల్, పుప్పాలగూడ, శంషాబాద్, నియోపోలిస్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాంతాలలో ఈ హోటళ్లు , ట్రేడ్ సెంటర్ల నిర్మాణం జరగనుంది. కేవలం నగరం లోపల మాత్రమే కాకుండా, హైదరాబాద్ శివారు ప్రాంతాలలో ఒక ప్రత్యేక వెల్‌నెస్ రిసార్ట్‌ను కూడా నిర్మించనున్నారు. ఇది నగర జీవితానికి దూరంగా, ప్రశాంతమైన వాతావరణంలో వినోదాన్ని అందిస్తుంది. ఈ మొత్తం ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారుగా రూ. 6 వేల కోట్ల భారీ మొత్తాన్ని పెట్టుబడి పెట్టడానికి సిద్ధమైంది. ఇంత పెద్ద ఎత్తున హోటళ్ల నిర్మాణం చేపట్టడం వలన, ఆతిథ్యం (హాస్పిటాలిటీ), అనుబంధ రంగాలలో సుమారు 8 వేల మందికి నేరుగా లేదా పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పర్యాటక శాఖ అంచనా వేస్తోంది. ఈ విస్తృత ప్రాజెక్టుల ద్వారా హైదరాబాద్ నగరంలోని పర్యాటక మౌలిక సదుపాయాలు (। గణనీయంగా మెరుగుపడతాయి. అధిక స్థాయి వసతి లభించడం వల్ల, విదేశీ పర్యాటకుల రాక పెరుగుతుంది. దీని ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెరగడమే కాకుండా.. నగర గ్లోబల్ ఇమేజ్ కూడా మరింత పటిష్టం అవుతుంది. తెలంగాణ ప్రభుత్వం టూరిజం రంగాన్ని రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ఒక ముఖ్యమైన శాఖగా గుర్తించింది. ఈ ఫైవ్ స్టార్ హోటళ్లు , ట్రేడ్ సెంటర్ నిర్మాణంతో.. అంతర్జాతీయ వ్యాపార సదస్సులు, సమావేశాలు (కన్వెన్షన్స్) నిర్వహించడానికి కూడా హైదరాబాద్ ఒక ప్రధాన కేంద్రంగా మారుతుంది.

# దివ్యక్షేత్రంగా శ్రీశైలం

## మాస్టర్‌ప్లాన్‌తో అభివృద్ధికి చర్యలు

### తిరుమల తరహాలో భక్తులకు సౌకర్యాలు

### 2వేల హెక్టార్ల అటవీభూమి కేటాయించాలని కేంద్రానికి విన్నపం: ఏపి సిఎం చంద్రబాబు

### సమీక్షలో సూచనలు చేసిన డి.సిఎం పవన్

**విజయవాడ అక్టోబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆలయాల అభివృద్ధి వలన ఆయా ప్రదేశాలు, పర్యాటకరంగంలోను అద్భుతరీతిలో వృద్ధి సాధించవచ్చునని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అటవీప్రాంతాల సంరక్షణ విషయంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవస్థానాన్ని సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌తో దివ్య క్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఏటా లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించే ప్రణాళికలపై దేవాదాయ, అటవీశాఖ అధికారులకు మార్గదర్శనం చేసారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం దేవాలయ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్య మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో వర్చువల్‌గానే డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో సిఎం చంద్రబాబు మాట్లాడారు. సిఎంతో పాటు సమావేశంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవాదాయ శాఖ, అటవీ శాఖల ఉన్నతాధికారులు హాజర య్యారు. జ్యోతిర్లింగం, శక్తి పీఠం రెండూ కలిగిన దివ్య క్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీశైలం ఆలయ సమగ్రాభివృద్ధిపై సిఎం చర్చించారు.

తిరుమల తరహాలోనే శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వేర్వేరు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఈ క్షేత్రానికి వస్తున్న నేపథ్యంలో రద్దీకి తగ్గట్టు వారికి సౌకర్యాలు కల్పించాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. దేవాలయ అభి వృద్ధి కోసం 2 వేల హెక్టార్ల అటవీ భూమిని దేవా దాయశాఖకు కేటాయించేలా కేంద్రఅటవీ మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. అలాగే ఈ నెల 16 తేదీన ప్రధాని మోడీ శ్రీశైల మల్లిఖా ర్జున స్వామిని దర్శించు కొనేందుకు శ్రీశైలం రానున్న దృష్ట్యా ఆయనతో ఆలయ అభివృద్ధిపై చర్చించాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి జాతీయ రహదారులను సైతం అనుసంధానించేలా ప్రణాళికలు చేయాలని సిఎం సూచించారు. దోర్నాల, సుండిపెంట, ఈగలపెంట తదితర ప్రాంతాల సమీపంలో ఉన్న జాతీయ రహదారులను దేవాలయానికి కనెక్టు చేసేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆధ్యాత్మికంగా పర్యాటక ప్రాంతంగా, పర్యావరణ పరంగా శ్రీశైలాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు ఉండాలని సిఎం పేర్కొన్నారు. దీనిపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పందిస్తూ భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతున్న కారణంగా ఆలయ సమగ్ర అభివృద్ధికి సత్వర చర్యలు అవసరమని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తున్న నేపథ్యంలో సౌకర్యాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న శబరిమల లాంటి దేవాలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధ్యయనం చేసి శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేద్దామని డిప్యూటీ సిఎం ప్రతిపాదించారు.

**ఏపిలో రెండో అతిపెద్ద దేవాలయంగా శ్రీశైలం అభివృద్ధి**

రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలన్నీ అటవీ, గిరులపైనే ఉన్నాయని వారసత్వంగా వచ్చిన ఈ ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తిరుమల తర్వాత అతిపెద్ద ఆలయంగా శ్రీశైలం అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా భక్తులకు విస్తృతమైన సౌకర్యాలను కల్పించాల్సి ఉందని అన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో సరైన పార్కింగ్ సదుపాయాలు కూడా లేవని అన్నారు. భూమి అందుబాటులో లేకపోతే పెద్ద ఎత్తున వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలను కల్పించలేమని.. ఈ నేపథ్యంలో అధికారుల బృందం ఢిల్లీ వెళ్లి అటవీ మంత్రిత్వశాఖకు ఈ అంశాలను వివరించాలని సూచించారు. ఆయా ఆలయాల పరిసర ప్రాంతాల్లో ఉన్న అటవీ ప్రాంతాలను కూడా రాష్ట్రప్రభుత్వం సంరక్షిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. పచ్చదనం పెంపు, అటవీ ప్రాంతాల అభివృద్ధిపై ఇప్పటికే కార్యాచరణ అమలు చేస్తున్నామని అన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాన స్థాయిలో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శ్రీశైలం పులుల అభయారణ్యంలో పులుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని దీనికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సిఎం అటవీశాఖ అధికారులను ఆదేశించారు. శ్రీశైల మహాక్షేత్రం అభివృద్ధికి నూతన ప్రతిపాదనలను దేవస్థానం అధికారులు సిద్ధం చేశారు. ఈ నెల 16వ తేదీన ప్రధాని మోడీ శ్రీశైలం దర్శనానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైల మల్లన్న ఆలయానికి దాదాపు రూ.1,657 కోట్ల ఆర్థిక సహాయం చేయాలని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ప్రధానిని కోరనున్నారు. కాశీ క్షేత్రంలో కాశీ విశ్వనాథ్ కారిడార్, ఉజ్జయిని మహాకాళ్ కారిడార్ తరహాలో శ్రీశైల క్షేత్ర కారిడార్‌ను అభివృద్ధి చేయడానికి సదరు నిధులు వినియోగించాలని దేవాదాయశాఖ, దేవస్థానం అధికారులు యోచిస్తున్నారు. అందుకుగాను రూ.90 కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్, రూ.65 కోట్లతో గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు సాలుమండపాల నిర్మాణం, రూ.25 కోట్లతో కైలాస మానస సరోవరం ఏనుగుల చెరువు కట్ట అభివృద్ధి, రూ.25 కోట్లతో కైలాస కళాక్షేత్రం, రూ.13 కోట్లతో నూతన ప్రసాదాల తయారీ పోటు నిర్మాణం, రూ.10 కోట్లతో సామూహిక అభిషేక మండప నిర్మాణం, రూ.5 కోట్లతో దేవస్థానం వర్క్‌షాప్ నుంచి రుద్రపార్కు వరకు బ్రిడ్జి నిర్మాణం, రూ.95 కోట్లతో సిద్ధరామప్ప కొలను అభివృద్ధి పనులు చేయాలని ఇఒ ఎం. శ్రీనివాసరావు ఇప్పటికే దేవాదాయశాఖ అనుమతి కోరారు.

శ్రీశైలం దేవస్థానం నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు పరిధిలోనే ఉండడంతో అభివృద్ధి పనులను చేయాలంటే తరచూ అటవీశాఖ నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. దాంతో శ్రీశైల దేవస్థానం భూమి సమస్యను సైతం ప్రధాని దృష్టికి తీసుకెళ్లేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. అటవీశాఖ ఎటువంటి అభ్యంతరాలను లేవనెత్తకుండా 5,362 ఎకరాల భూమిని దేవస్థానానికి చెందే విధంగా సమస్య పరిష్కరించాలని ఈ సందర్భంగా విన్నవించనున్నారు తెలంగాణ పరిధిలో అమ్రాబాద్ నుంచి బ్రహ్మగిరి(దోమపెంట)వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని తెలంగాణ సర్కారు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అదే విధంగా కర్ణాటక, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చేటటువంటి భక్తులు ఆత్మకూరు-దోర్నాల మధ్యనున్న ఇరుకైన రహదారి వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆత్మకూరు దోర్నాల మధ్య నల్లమల అడవులు ఉండడంతో జాతీయ రహదారి నిర్మాణం ఊసే లేకుండా పోయింది. అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉండడంతో ఘాట్ రోడ్డు విస్తరణ పనులు చేయడం సమస్యగా మారింది. తెలంగాణ ప్రాంతం తరహాలో ఇక్కడ కూడా ఎలివేటెట్ కారిడార్‌ను నిర్మిస్తే ప్రయాణాలకు అసౌకర్యాలన్నీ తొలగిపోతాయని ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులంతా అభిప్రాయపడుతున్నారు.

## నేడు ఎపి సిఎం చంద్రబాబుచే స్వచ్ఛతా అవార్డులు ప్రదానం

**విజయవాడ,అక్టోబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6వ తేదీ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛతా అవార్డులు ప్రదానం చేయ నున్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాల్లో ఉత్తమ పనితీరు కనపరిచినసంస్థలు, వ్యక్తులు, ప్రభుత్వ శాఖలకు ఈఅవార్డులను ప్రదానం చేయనున్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రేపు సాయంత్రం 5 గంటలకునిర్వహించనున్న స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమంలో భాగంగా వీటిని అందించను న్నారు. మొత్తం 21 కేటగిరీల్లో రాష్ట్రస్థాయిలో 69 అవార్డులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రదానంచేయనున్నారు. జిల్లా స్థాయిలో 1,257 అవార్డులు విజేతలకు అందించనున్నారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు గానూ రాష్ట్ర స్థాయిలో 6 మున్సిపాలిటీలు, 6 గ్రామ పంచాయతీలు ఎంపికయ్యాయి. మంగళగిరి తాడేపల్లి మున్సి పల్ కార్పొరేషన్, తాడిపత్రి, బొబ్బిలి, పలమనేరు,ఆత్మకూరు, కుప్పం మున్సిపాలిటీలు, స్వచ్ఛ గ్రామ పంచాయితీలుగా ఎంపికైన అనకా పల్లిజిల్లాచౌడువాడ, ప్రకాశంజిల్లాఆర్ఎల్ పురం, కోనసీమలోని లోల్ల, కృష్ణా జిల్లాలోని చల్లపల్లి, కడపజిల్లాలోని చెన్నూరు, చిత్తూరు జిల్లాలోని కనమకులపల్లె అవార్డులు అందుకోనున్నాయి.

# పాక్ బ్యాటర్లను వణికించిన భారత్ బౌలర్లు

### 88 పరుగుల తేడాతో పాకిస్థాన్ ఓటమి

### వన్డే వరల్డ్‌కప్‌లో దాయాదిపై భారత్ మహిళా జట్టు విజయం

### ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా క్రాంతిగౌడ్

**కొలంబో, అక్టోబరు 5:** మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌లో ఆరోమ్యాచ్‌లో భారత్ మహిళలజట్టు పాక్ జట్టును చిత్తుగా ఓడించింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన భారత్ మహిళలు నిర్ణీత 50 ఓవర్లలో 247 పరుగులుచేసారు. తదనంతరం బ్యాటింగ్ చేసిన పాక్ జట్టు 159 పరుగులకే ఆలౌట్ అయింది. దీనితో 88 పరుగుల తేడాతో భారత్ మహిళాజట్టు విజయం సాధించినట్లయింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా భారత్‌జట్టులో క్రాంతిగౌడ్ ఎంపికయింది. 20 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసిన గౌడ్‌ను ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎంపికచేసారు. దీనితో మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత్ జట్టు రెండో విజయం సాధించింది. తొలిపోరులో శ్రీలంకకు షాకిచ్చిన టీమిండియా ఈసారి పాకిస్తాన్‌ను కూడా మట్టి కరిపించింది.

బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో పోరాడగలిగే స్కోరుచేసిన మహిళాకెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సేన ఆ తర్వాత బ్యాటింగ్‌లో పాక్‌ను చిత్తుచేసింది. క్రాంతి గౌడ్ 20 పరుగులకు మూడు వికెట్లుతస్తే స్నేహ్‌రాణా 38 పరుగులిచ్చి రెండు వికెట్లు తీసింది. దీప్తిశర్మ 45 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసింది. చివరి వికెట్‌కూడా దీప్తిచేతిలోనే టౌన్ కావడంతో 88 పరుగులతో భారత్‌విజయభేరి మోగించింది. ఈ ఫార్మాట్‌లో చిరకాలప్రత్యర్థిపై 12 విజయాలతో భారత్ జట్టు పైచేయి సాధించింది. తొలి వరల్డ్‌కప్ వేటలో హార్లీన్ డియోల్ 46, రీచాఘోష్ 35 పరుగులు నాటౌట్‌గా నిలిచారు. ఛేదనలో తొలినుంచి తడబడిన పాక్‌జట్టు ఏదశలోను కూడా భారత్‌ను అధిగమించలేకపోయింది. మ్యాచ్‌పై పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనామాట్లాడుతూ 200 పరుగులవద్ద కట్టడిచేయాలనుకున్నామని టాప్ ఐదు స్థానాల్లోస్పెషలిస్టు బ్యాటర్లతో వెళ్లాలని నిర్ణయించుకున్నా కొంత వెనకబడ్డామని ప్రకటించింది. మొత్తంగాచూస్తే 43 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. సిద్రా అమీన్ 81 పరుగులతో చివరివరకూ పోరాడినా ఫలితం లేకపోయింది. మిగిలిన బ్యాటర్లుకూడా తక్కువ స్కోరుకే పరిమితం అయ్యారు.







## గురుకులంలో కామెర్ల కలకలం

### ఎపిలో వారంలో ఇద్దరు విద్యార్థులు మృతి

### 112 మందికి ఆస్పత్రిలోచికిత్స

### కలుషితనీరే కారణం: ప్రిన్సిపల్ సెక్రటరీ

**కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా), అక్టోబర్ 5 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో గల గురుకుల పాఠశాలలో వందల సంఖ్యలో విద్యార్థులకు పచ్చకామెర్లు సోకటంతో జిల్లాలో కలకలం రేగింది. ఇప్పటికే వారం రోజులు వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, విశాఖ, పార్వతీపురం, కురుపాం ఆసుపత్రులలో వందల సంఖ్యలో చికిత్స పొందడంతో తమ పిల్లలకు ఏం అవుతుందోనన్న భయంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కురుపాం మండలం శివన్న పేటలోగల గురుకుల పాఠశాలలో సుమారు 612 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఇప్పటికే రక్త పరీక్షలు నిర్వహించి 100 మందికి పైగా విద్యార్థులకు ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. ఇంకా పలువురికి రక్త పరీక్షలు రిపోర్ట్‌లు రావాల్సి ఉంది. గురుకుల పాఠశాలలో కనీస వసతులు లేకపోవడం, వాటర్ ప్లాంట్ పని చేయకపోవడంతో కలుషితమైన నీరు త్రాగడం వల్ల పచ్చకామెర్లు సోకినట్లు తెలుస్తోంది. పచ్చకామెర్లతో గత నెల 26న 9వ తరగతి చదువుతున్న కల్పన(14) తన ఇంటి వద్ద మృతి చెందింది. ఈ నెల 1న పదవ తరగతి విద్యార్థిని పువ్వల అంజలి(15) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి, ఆదివాసీ గిరిజన సంఘాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు అలాగే పాఠశాలను పరిశీలించి గురుకుల పాఠశాలలో కనీస సౌకర్యాలు లోపించాయని, కలుషిత నీరు త్రాగటం వలన విద్యార్థులకు వ్యాధి సోకి మృతి చెందారని అన్నారు. ఆదివాసి సంఘాలు విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లా కలెక్టర్, వైద్యాధికారులు ఎటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. దీంతో విద్యార్థులందరికీ రక్త పరీక్షలు నిర్వహించి వెంటనే వాటి రిపోర్టులను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల్లో ఇప్పటికే 112 మందికి వ్యాధి సోకినట్లు ఇందులో 28 మంది పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మిగిలిన వారికి జిల్లా ఆసుపత్రి పార్వతీపురం, కురుపాం ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం రాష్ట్రస్థాయి వరకు వ్యాపించడంతో గురుకులాల ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.గౌతమ్ శనివారం రాత్రి పాఠశాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని అలాగే రక్షిత మంచినీరు అందివ్వాలని ఆమె అధికారులకు ఆదేశించారు.

**ఇద్దరు విద్యార్థినిల మృతి బాధాకరం: పవన్ కల్యాణ్**

కురుపాం గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిల మృతి బాధాకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. కురుపాం బాలికల గురుకులంలోని విద్యార్థినిలు అనారోగ్యానికి గురైన విషయం తెలిసి బాధపడినట్లు చెప్పారు. అక్కడ నెలకొన్న పరిస్థితిపై జిల్లా అధికారులు, వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. అక్కడి పిల్లలు పచ్చకామెర్లు సంబంధిత లక్షణాలతో అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఇద్దరు విద్యార్థినులు వేర్వేరు రోజుల్లో ఇంటి దగ్గర ఒకరు, మరొకరు ఆసుపత్రిలో మృతి చెందినట్లు పవన్ కల్యాణ్ వివరించారు. మృతి చెందిన విద్యార్థినిలు కుటుంబాలకు పవన్ కల్యాణ్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# నకిలీ మద్యం నిందితులపై కొరడా

### నిష్పాక్షిక దర్యాప్తు జరిపి కఠినచర్యలు తీసుకోవాలని ఎపి సిఎం చంద్రబాబు ఆదేశం

### ఎక్సైజ్ తనిఖీల్లో కొందరు నకిలీమద్యం బాటిళ్లతో పట్టుబడ్డారన్న మంత్రులు

### ఎ-1గా గుర్తించిన జనార్ధన్‌కు విజయవాడలో బార్‌లైసెన్స్ ఉంది

### నలుగురిని అరెస్టు చేసే అవకాశం


**విజయవాడ, అక్టోబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ప్రజల ప్రాణాలకు చేటు చేసే నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశించారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం ములకలచెరువులో నకిలీ మద్యం వ్యవహారంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి అధికారులకు స్పష్టంచేశారు. ఈ వ్యవ హారంలో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని ఆదే శించారు. నకిలీ మద్యం వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్య దర్శి ముఖేష్ కుమార్ మీనా, ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌తో ఆదివారం సాయంత్రంతరువాత క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇందులో భాగంగా ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు తెలిపారు. ములకలచెరువులో జరిపిన ఎక్సైజ్ శాఖ తనిఖీల్లో ముందుగా కొందరు వ్యక్తులు నకిలీ మద్యం బాటిళ్లతో పట్టుబడ్డారన్నారు. వారిని విచా రించి సేకరించిన సమాచారం అధారంగా ములకల చెరువు గ్రామంలో సోదాలు నిర్వహించామని అధి కారులు సిఎంకు వివరించారు. ములకలచెరువు సమీపంలోని కదిరినత్తునికోట గ్రామంలో నిర్వహిం చిన తనిఖీల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రం బయటపడిందని అధికారులు సిఎంకు తెలియ జేశారు. నకిలీ మద్యం తయారు చేస్తున్న 14 మందిని గుర్తించి 10 మందిని అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. అలాగే, ఫేక్ లేబుల్స్, వివిధ బ్రాండ్ల నకిలీ మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎ1గా అద్దేపల్లి జనార్ధన్ రావు అనే వ్యక్తిని గుర్తించామని అతనికి విజయవాడలో ఒక బార్ లైసెన్సు ఉందని ముఖ్యమంత్రికి తెలిపారు. నకిలీ మద్యం దందాకు ములకలచెరువుకు వచ్చాడని తెలిపారు. ఇక్కడ తయారైన మద్యాన్ని పెద్దతిప్పసముద్రంలోని ఆంధ్రా వైన్స్, ములకలచెరువులోని రాక్ స్టార్ వైన్స్‌లో విక్రయించినట్టు తెలిపారు. ఈ నకిలీ మద్యం తయారీలో ఇతనే ప్రధాన నిందితుడని, తమిళనాడుకు చెందిన నలుగురు వ్యక్తులను, ఒడిశాకు చెందిన వారిని కూడా నియమించుకున్నాడని తెలిపారు. నకిలీ మద్యం సరఫరాకు ఓ డ్రైవర్‌ను కూడా నియమించుకున్నట్టు వివరించారు. అద్దేపల్లి జనార్ధన్ రావు సూచనల మేరకు నకిలీ మద్యం తయారు చేస్తున్న అంశాన్ని మిగతా నిందితులు అంగీకరించారని సిఎంకు తెలియజేశారు. నకిలీ మద్యాన్ని విక్రయిం చిన రాక్ స్టార్ లైసెన్స్ టి రాజేష్ అనే వ్యక్తి పేరిట ఉందని, రాజేష్‌కు సంబంధించిన వాహనంలోనే నకిలీ మద్యం రవాణా చేస్తుంటే తాము పట్టుకున్నట్టు తెలిపారు. రెండు వైన్ షాపులపైన సోదాలు నిర్వహించి, సీజ్ చేశామని తెలిపారు. ప్రధాన నిందితుడు జనార్ధన్ రావు ప్రస్తుతం విదేశాల్లో ఉన్నట్టు గుర్తించామని అధికారులు వివరించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని ఎక్సైజ్ అధికారులు సిఎంకు తెలిపారు. స్థానిక నాయకుడు జయచంద్రారెడ్డి పాత్రపై కూడా సమగ్ర విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఒక ప్రణాళికతో అద్దేపల్లి జనార్ధన్ రావు ఏర్పాటు చేసిన ఈ లిక్కర్ తయారీ కేంద్రానికి కొందరు స్థానికుల సహకారం కూడా ఉన్నట్టు గుర్తించామని అధికారులు వివరించారు. ఏ1 జనార్ధన్ రావు, ఏ2 కొట్టారాజు, ఏ5 పి రాజేష్, ఏ12 కె శ్రీనివాస రావులును అరెస్టు చేయాల్సి ఉందని అధికారులు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ దీనిపై అన్ని కోణాల్లో విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిందితులు ఎంతటి వారైనా వదలొద్దని సిఎం స్పష్టం చేశారు.

# ఐక్యతను చాటిన నాటి తారల నేటి కలయిక



దక్షిణ భారత సినిమా పరిశ్రమలో ప్రతి సంవత్సరం ఎంతో అద్భుతంగా జరిగే" అక్టోబర్ 4, 2025న చెన్నైలో జరిగింది. మూడు సంవత్సరాల విరామం తర్వాత జరిగిన ఈ సమావేశం, అందరికీ అద్భుతమైన ఎమోషనల్ మూమెంట్‌గా నిలిచింది. గతేడాదే నిర్వహించాలనుకున్నా, చెన్నైలో జరిగిన భారీ వర్షాలు, వరదల కారణంగా ఆ రీయూనియన్ వాయిదా పడింది. ఈసారి ఆ వేడుక స్నేహం, ఐక్యత, హృదయపూర్వకమైన సమావేశం విజయవంతంగా జరిగింది. రాజ్‌కుమార్ సేతుపతి, శ్రీప్రియ దంపతులు తమ ఇంట్లోనే ఈ రీయూనియన్‌ను ఆతిథ్యం ఇచ్చారు. లిస్సీ లక్ష్మి, పూర్ణిమ భగ్యరాజ్, ఖుష్బూ సుందర్, సుహాసిని మణిరత్నం ఈ కార్యక్రమాన్ని కోఆర్డినేట్ చేశారు. ఇంటి ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ సమావేశం, ఆ తారల మధ్య ఉన్న నిజమైన అనుబంధాన్ని ప్రతిబింబించింది. మొత్తం 31 మంది నటులు ఈ రీయూనియన్‌లో పాల్గొన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు హిందీ పరిశ్రమ నుండి కూడా స్టార్స్ వచ్చారు. సాయంత్రం అంతా నవ్వులు, జ్ఞాపకాలు, అనుభవాలు పంచుకుంటూ ఆత్మీయంగా గడిచింది. 80ఎస్ స్టార్స్ రీయూనియన్ గురించి మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియాలో పోస్ట్ షేర్ చేశారు. 80ఎస్ స్టార్స్ రీయూనియన్ స్నేహితులతో ప్రతి రీయూనియన్ మధుర జ్ఞాపకాల వీధిలో ఒక నడకలా ఉంటుంది. నవ్వులు, ఆప్యాయత, పాత జ్ఞాపకాలు తలుచుకుంటూ ఆనందం, ప్రేమతో గడుస్తుంది. ఎన్ని సార్లు కలిసినా, ప్రతి సారి కొత్తగా, మొదటిసారి కలిసినట్టే సంతోషంగా అనిపిస్తుంది' ఈసారి ఇది ఉత్సవం కాదు" అని సుహాసిని మణిరత్నం అన్నారు. ఇది సంవత్సరాలుగా పరిచయమైన స్నేహితుల కలయిక ఒకరికొకరు మద్దతుగా ఉండటానికి, కృతజ్ఞత తెలిపేందుకు," అని లిస్సీ లక్ష్మి తెలిపారు. ఇలా ప్రతి ఏడాది జరిగే ఈ 80ఎస్ రీయూనియన్ స్నేహం, ఐక్యత, భిన్నత్వంలో ఏకత్వం విలువలకు ప్రతీకగా నిలుస్తోంది.

## శ్రేష్ట్ మూవీస్ 'ఆర్యన్ 'గ్రాండ్ రిలీజ్



విష్ణువిశాల్ డార్క్ అండ్ సస్పెన్స్ ఫుల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఆర్యన్ అక్టోబర్ 31న శ్రేష్ట్ మూవీస్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన హీరో విష్ణు విశాల్, విష్ణు విశాల్ స్టూడియోస్, శుభ్ర ఆర్యన్ రమేష్ లతో కలిసి నిర్మించిన 'ఆర్యన్' అనే గ్రిప్పింగ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ తో వస్తున్నారు. ఈ చిత్రానికి ప్రవీణ్ కె దర్శకత్వం వహించారు. మేకర్స్ ఇటీవల టీజర్‌ను విడుదల చేశారు. దీనికి అద్భుతమైన స్పందన వచ్చింది. ఆర్యన్ చిత్రం అక్టోబర్ 31న విడుదల కానుంది. హీరో నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో శ్రేష్ట్ మూవీస్ ద్వారా విడుదల చేయనున్నారు. అనేక బ్లాక్ బస్టర్లను అందించిన ప్రొడక్షన్ , డిస్ట్రిబ్యూషన్ బ్యానర్ మద్దతుతో ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. శ్రేష్ట్ మూవీస్ గతంలో విక్రమ్, అమరన్, థగ్ లైఫ్ వంటి చిత్రాలను విడుదల చేశారు. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్, అభిషేక్ జోసెఫ్ జార్జ్ సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. విష్ణు విశాల్ ఫైర్ చిత్రానికి దర్శకత్వం వహించిన మను ఆనంద్ ఈ చిత్రానికి సహ రచయితగా పనిచేశారు. హరీష్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, గిబ్రాన్ సంగీతం, శాన్‌లోకేషన్ డిటర్. ట్రైలర్, ఆడియోలాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్‌లు త్వరలో అనౌన్స్ చేస్తారు. తారాగణం: విష్ణు విశాల్, సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానసచౌదరి, నిర్మాణం, విష్ణు విశాల్ (విష్ణు విశాల్ స్టూడియోస్)దర్శకత్వం: ప్రవీణ్ కె, నిర్మాతలు : శుభ్ర, ఆర్యన్ రమేష్, విష్ణు విశాల్

# మిరాయ్ టీమ్‌ను అభినందించిన దిల్‌రాజు

సూపర్‌హీరో తేజా సజ్జా బాక్సాఫీస్ వద్ద విజయయాత్ర కొనసాగిస్తున్నారు. ఆయన తాజా చిత్రం మిరాయ్ ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన కలెక్షన్ తో దూసుకెళ్తోంది. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ సీజన్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. తాజాగా ప్రముఖ నిర్మాత దిల్ రాజు మిరాయ్ టీంని అభినందించారు. మిరాయ్ సినిమా విజయాన్ని పురస్కరించుకొని సూపర్‌హీరో తేజసజ్జా కోసం తమ ఇంట్లో ఆత్మీయంగా ఒక వేడుక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తేజసజ్జాతో పాటు డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. ఇది అభిమానం, అభినందనలతో కూడిన ఒక ఆద్భుతమైన సందర్భంగా నిలిచింది. మిరాయ్ ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్ లో 150 కోట్లు పైగా వసూలు చేసింది. నార్త్ అమెరికాలో 3 మిలియన్ డాలర్ల మార్క్‌ని దాటింది. రితికా నాయక్ హీరోయిన్‌గా, మనోజ్ మంచు, శ్రియా శరణ్ ముఖ్యపాత్రల్లో నటించిన ఈ చిత్రం, యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ప్రెజెంటేషన్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం మిరాయ్ థియేటర్స్‌లో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది .



# సైకోమైథలాజికల్ థ్రిల్లర్'అరి'




ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషరెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా 'అరి'. లింగ గుణపనేని కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి ఖిమై నేమ్ ఈజ్ నో బడీఖి అనేది ఉపశీర్షిక. వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "పేపర్ బాయ్" చిత్రంతో ప్రతిభావంతమైన దర్శకుడుగా పేరు తెచ్చుకున్న జయశంకర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ˊఅర్థి సినిమా ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10వ తేదీన వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. సైకలాజికల్, మైథలాజికల్ ఎలిమెంట్స్ కలిసి ఓ డిఫరెంట్ థ్రిల్లర్ మూవీగా అరిఉండబోతున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఒక లైబ్రరీ, అక్కడ రివీల్ అయ్యే ఏడు జీవితాలను ఆసక్తికరంగా ట్రైలర్ లో చూపించారు. అరి సినిమా ట్రైలర్ ఎలా ఉందో చూస్తే భూలోకంలో జన్మించాలని శ్రీకృష్ణుడు సంకల్పించగానే ఆ విషయం స్వర్గ లోకంలో తెలిసి ఆరుగురు దేవతలు తమనూ భూలోకం తీసుకెళ్లమని శ్రీకృష్ణుడిని వేడుకున్నారు, అవే అరిషడ్వర్గాలు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు..ఖి అనే డైలాగ్ తోˊఅర్థి సినిమా ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఇక్కడ అందరి కోర్కెలు తీర్చబడును అని ఓ యూనివర్సిటీ లైబ్రరీ నుంచి వెలువడిన ప్రకటన చూసి సినిమాలోని ప్రధాన పాత్రధారులు వచ్చి తమ కోర్కెలు చెబుతుంటారు. ఈ ప్రపంచంలో మనషులందరిలో ఉండే అరిషడ్వర్గాలకు వారి కోర్కెలు ప్రతీకలుగా కనిపిస్తాయి. ఈ పాత్రధారుల నేపథ్యం ఏంటి ?, అందరి కోర్కెలు తీర్చే బాధ్యతను తీసుకున్నది ఎవరు ?,ఎందుకు ?, తన దగ్గరకు వచ్చే వారికి ఆయన ఇచ్చే టాస్క్‌ ఏంటి ? అనేది థియేటర్స్ లో చూడాల్సిందే. పరిత్రాణాయ సాధూనాం.. అనే భగవద్గీత శ్లోకంతో ట్రైలర్ ఆసక్తికరంగా పూర్తవుతుంది. నటీనటులు వినోద్ వర్మ , అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్, వైవా హర్ష, శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర, శుభలేక సుధాకర్, సురభి ప్రభావతి, అక్షయా శెట్టి, రిధిమా పండిట్, పి.అనిల్ కుమార్, నవీనా రెడ్డి, తమిళ బిగ్ బాస్ ఫేమ్ పావని రెడ్డి, జెమినీ సురేష్, ఐ డ్రీమ్ అంజలి, మనిక చిక్కాల, సుమన్, ఆమని, ప్రవల్లిక చుక్కల, సురభి విజయ్, బ్యాంకు శ్రీనివాస్, సమీర్, మాణిక్ రెడ్డి, రాజ్ తిరందాస్, గాయత్రి భార్గవి, మీనా కుమారి, లావణ్య రెడ్డి, ఇంటూరి వాసు, జబర్దస్త్ సద్దాం, నీలా ప్రియ, యోగి ఖత్రి తదితరులు టెక్నికల్ టీమ్ మ్యూజిక్ : అనుప్ రూబెన్స్ ఎడిటర్ : జి. అవినాష్‌లిరిక్స్ : కాసర్ల శ్యాం, వనమాలి, కళ్యాణ్ చక్రవర్తి, కొరియోగ్రఫీ భాను, జీతుప్రొడక్షన్ డిజైనర్ : రాజీవ్ నాయర్‌స్టైలిస్ట్ : శ్రీజ రెడ్డి చిట్టిపోలు, సిరి చందనసినిమాటోగ్రఫీ : కృష్ణ ప్రసాద్.

# 'హైలెస్సో' పవర్‌ఫుల్ ఫస్ట్‌లుక్



సుడిగాలి సుధీర్‌గా అందరికీ సుపరిచితుడైన సుధీర్ ఆనంద్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఇది వారి బ్యానర్‌కు ప్రొడక్షన్ నంబర్ 1, సుధీర్ ఆనంద్‌కు హీరోగా ఐదవ చిత్రం. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ విలన్‌గా కనిపించబోతున్నారు. దసరా సందర్భంగా సుధీర్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఇంటెన్స్ అండ్ డివైన్ వైబ్ తో వున్న పోస్టర్ అదిరిపోయింది. ఫస్ట్‌లుక్ కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్స్‌గా నటించగా, ప్రముఖ కన్నడ నటి అక్షరగౌడ కీలక పాత్రలో కనిపించనున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. యంగ్ అండ్ టాలెంటెడ్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. అనుదీప్ దేవ్ సంగీతం అందించగా, సుజాత సిద్ధార్థ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ఎడిటర్‌గా చోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్ బ్రహ్మ కడలి, చింతా శ్రీనివాస్ రైటర్. హై లెస్సో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది.

తారాగణం: సుధీర్ ఆనంద్, శివాజీ, నటాషా సింగ్, నక్ష శరణ్, అక్షర గౌడ, మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య.

# 'ఓ చెలియా' నుండి మెలోడీ పాట విడుదల



అందమైన ప్రేమ కథలకు ఆడియెన్స్ నుంచి ఎప్పుడూ సపోర్ట్ లభిస్తూనే ఉంటుంది. ఓ అద్భుతమైన ప్రేమ కథతో ఎస్‌ఆర్‌ఎస్ మూవీ క్రియేషన్స్, ఇందిరా దేవీ ప్రొడక్షన్స్ బ్యానర్ల మీద రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్న చిత్రం ఓ చెలియా. నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని ఎం. నాగ రాజశేఖర్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు.

ఇప్పటికే సినిమాకు సంబంధించిన పోస్టర్లు, గ్లింప్స్, సాంగ్స్, టీజర్ ఇలా అన్నీ కూడా సోషల్ మీడియాలో బాగానే ట్రెండ్ అయ్యాయి. ఇక తాజాగా మరో మెలోడీ సాంగ్‌ను టీం రిలీజ్ చేసింది. హీరోనవీన్ చంద్ర చేతులు మీదుగా కొంచెం కొంచెంగా అంటూ సాగే మెలోడీ పాటను టీం విడుదల చేయించింది. ప్రస్తుతం ఈ పాట శ్రోతల్ని ఎంతో ఆకట్టుకుంటోంది. ఎంఎం కుమార్ బాణీ వినడానికి ఎంతో శ్రావ్యంగా ఉంది. సుధీర్ బగాడి సాహిత్యం అయితే అందరికీ అర్థమయ్యేలా ఉంది. వాగ్దేవి, మనోజ్ పాడిన ఈ యుగళ గీతం, వారి గాత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ లిరికల్ వీడియోని చూస్తుంటే హీరో హీరోయిన్ల మధ్య ఎంత ఘాడమైన ప్రేమ అల్లుకుని ఉందో అర్థం అవుతోంది. ఇక ఈ పాటను రిలీజ్ చేసిన అనంతరం హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, ఓ.. చెలియా నుంచి మంచి మెలోడీ సాంగ్‌ను రిలీజ్ చేశాను. కొంచెం కొంచెంగా అంటూ సాగే ఈ పాట అందరినీ ఆకట్టుకునేలా ఉంది. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.

## ఓంకార్ రాజుగారి గది 4 'శ్రీచక్రం" అనౌన్స్‌మెంట్



మిరాయ్ భారీ విజయం తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మరో సినిమాటిక్ స్పెక్టికల్ రాజుగారి గది 4: "శ్రీచక్రం"తో రెడీ అవుతోంది. రాజుగారి గదిని కల్ట్ హారర్‌కామెడీ ఫ్రాంఛైజీగా మార్చిన విజనరీ ఫిల్మ్ మేకర్ ఓంకార్ దర్శకత్వం వహిస్తున్న ఈ నాల్గవ భాగం ఈ సిరీస్‌ను నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లనుంది. దసరా శుభ సందర్భంగా ఈరోజు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని అనౌన్స్ చేసింది. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ఎర్రటి చీరలో ఒక మహిళ, ఉగ్రమైన, దైవిక కాళిని గుర్తుచేసే దేవత విగ్రహం ముందు ఎగురుతోంది. ఈ అద్భుతమైన ఇమేజరీ పవిత్రమైన, అతీంద్రియాల మధ్య సాగే చిత్రానికి టోన్ సెట్ చేస్తుంది. "ఎడివైన్ హర్రర్ బిగిన్స్" అనే పవర్ ఫుల్ ట్యాగ్‌లైన్‌తో శ్రీచక్రం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది. గ్రాండ్ విజువల్స్, ఎస్ఎస్ థమన్ పవర్ ఫుల్ మ్యూజిక్, ఓంకార్ సిగ్నేచర్ స్టోరీ టెల్లింగ్‌తో, శ్రీచక్రం యూత్, కుటుంబ ప్రేక్షకులను అలరించే మాస్ థియేట్రికల్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని హామీ ఇస్తుంది. పురాణ విశ్వాసాలు, హిడెన్ సీక్రెట్స్, మరచిపోయిన వారసత్వాలపై ఆధారంగా రూపుదిద్దుకున్న డివైన్ హారర్‌కామెడీ శ్రీచక్రం. ప్రత్యేకమైన అనుభూతిని అందించేందుకు ఈ చిత్రం సిద్ధమైంది. ఇది ఆధ్యాత్మిక యాత్రలా సాగుతూ, మిస్టిసిజంతో నిండి, సస్పెన్స్ థ్రిల్స్, మాస్ హ్యూమర్ మూమెంట్స్ తో ఎంటర్‌టైన్ చేసే గొప్ప అనుభూతిని అందించబోతోంది. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటర్. శ్రీ నాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైనర్ కాగా, అజ్జు మహాకాళి డైలాగ్ రైటర్. ఆర్‌జిజి4 -శ్రీచక్రం భయపెట్టే క్షణాలు, నవ్వించే సన్నివేశాలు, భక్తి, భయం కలిసి మరచిపోలేని హారర్ అనుభవాన్ని ఇవ్వనుం ఎందుకంటే ఒకసారి 'శ్రీచక్రం' తెరుచుకున్నాక దాన్ని మూయడం అసాధ్యం. ఈ చిత్రం దసరా 2026కి థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'సీమంతం' టీజర్ రిలీజ్

'సిమంతం' టీజర్‌ను ప్రముఖ దర్శకుడు తేజ విడుదల చేశారు. ఇది ఓ క్రైమ్, సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది.

గర్భిణీ మహిళలపై హత్యలు. అనే మూడుతో కథ సాగనుందని టీజర్ సూచిస్తోంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం సుధాకర్ పాణి. వహించారు. వజ్రయోగి, శ్రేయ భారతి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాత ప్రశాంత్ టాటా, సహ నిర్మాత గాయత్రి సౌమ్య గుడిసేవ. సంగీతాన్ని ఎస్. సుహాస్ సమకూర్చారు. తేజ. మాట్లాడుతూ ,బీజీఎం, విజువల్స్ చాలా ఇంటెన్స్‌గా ఉన్నాయి. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ చాలా బాగా ఉన్నాయి అన్నారు. సినిమా త్వరలో విడుదల కానుంది, మూవీ: 'సిమంతం' మూవీ కాన్సెప్ట్ :సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్. తారాగణం హీరో : వజ్రయోగి ,హీరోయిన్ : శ్రేయభర్తీ తదితరులు. టెక్నికల్ టీం: డైరెక్టర్ : సుధాకర్ పాణి, బ్యానర్ : టీఆర్ డ్రీమ్ ప్రొడక్షన్స్ ప్రొడ్యూసర్: ప్రశాంత్ టాటా, సహ నిర్మాత: గాయత్రీ సౌమ్య గుడిసెవా, డీఓపీ : శ్రీనివాస్ విన్నకోట ఎడిటర్: అమర్ రెడ్డి ,మ్యూజిక్: ఎస్. సుహాస్‌ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: వీరవల్లి శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్ : వీరవల్లి మురళికృష్ణ.



# ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'సంతాన ప్రాప్తిరస్తు'




యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ "సంతాన ప్రాప్తిరస్తు" మూవీతో స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ సింగర్‌గా మారారు. ఈ చిత్రంలో ఆయన అనుకుందొకటిలే. పాటను పాడటం విశేషం. "సంతాన ప్రాప్తిరస్తు" చిత్రంలో గర్భగుడి వెల్‌నెస్ సెంటర్ నిర్వహించే డాక్టర్ భ్రమరం పాత్రలో వెన్నెల కిషోర్ నవ్వులు పంచనున్నారు. తన దగ్గరకు చికిత్స కోసం వచ్చిన కథానాయకుడికి ధైర్యం చెబుతున్న సందర్భంలో డాక్టర్ భ్రమరం పాత్ర నేపథ్యంగా ?అనుకుందొకటిలే.. పాటను ఆకట్టుకునేలా రూపొందించారు. అనుకుందొకటిలే.. పాట ఎలా ఉందో చూస్తే అనుకుందొకటిలే అయ్యిందొకటిలే, అయిపోలేదులే, గేరే మార్చులే, భ్రమరం ఫార్ములా ఫెయిలే అవదులే, కళ్లే మూసుకో, నన్నే నమ్ముకో అంటూ వినోదాత్మకంగా సాగుతుంది పాట. ఈ పాటను సునీల్ కశ్యప్ కంపోజ్ చేయగా, బాలవర్ధన్ లిరిక్స్ అందించారు. వెన్నెల కిషోర్ ప్రొఫెషనల్ సింగర్‌లా పాడి ఆకట్టుకున్నారు. విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న "సంతాన ప్రాప్తిరస్తు" సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. .

# 'డ్యూడ్' హై ఎనర్జీ ఫన్ ట్రాక్ సింగారి సాంగ్ రిలీజ్



వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పాన్ ఇండియా మూవీ డ్యూడ్‌తో అలరించడానికి రెడీ అవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. 'పేమలు' అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. రీసెంట్‌గా విడుదలైన బూమ్ బూమ్, బాగుందు పో సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. మ్యూజిక్ ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా నుంచి థర్డ్ సింగిల్ సింగారిసాంగ్‌ని రిలీజ్ చేశారు. ఈ పాటను స్వయంగా సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ స్వరపరచి పాడారు. ఎనర్జిటిక్ బీట్స్, క్యాచి లిరిక్స్, యూత్ ఎనర్జీ ఈ సాంగ్ ని ఒక ఫన్ ప్యాకేజ్‌లా మార్చేశాయి. రామజోగయ్య శాస్త్రి రాసిన ఆకట్టుకునే లిరిక్స్ సాంగ్‌కి అదనపు ఉత్సాహం తీసుకొచ్చింది. ఫన్ ఫుల్ గా వినిపించే ఈ ట్రాక్ అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రదీప్ అద్భుతమైన కామిక్ టైమింగ్‌తో సాగే సన్నివేశాలు పాటకు మరింత మజాను తెచ్చాయి. సాయి అభ్యంకర్ తన ఫస్ట్ ఫీచర్ ఫిల్మ్ మ్యూజిక్ తోనే మంచి ఇంప్రెషన్ క్రియేట్ చేశాడు. ఇప్పటికే అన్ని భాషల యువతరంలో సాంగ్స్ పాపులర్ అవుతున్నాయి.

ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని నికేత్ బొమ్మి, ఎడిటర్ భరత్ విక్రమన్, ప్రొడక్షన్ డిజైనర్ లతా నాయుడు. డ్యూడ్ అక్టోబర్ 17న దీపావళి సందర్భంగా, తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# విజయ్ టివికెతో బిజెపి అవగాహన!



## సంయమనం పాటించాలంటూ సలహా

**చెన్నై, అక్టోబరు 4:** కరూర్ తొక్కిసలాట తర్వాత చిక్కుల్లో పడిన సినీ నటుడు, టివికే అధినేత విజయ్‌ను మచ్చిక చేసుకుని వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని లబ్ధి పొందాలని బిజెపి తహతహలాడుతోంది. ఇందులో భాగంగా కరూర్ ఘటనపై డిఎంకే ప్రభుత్వం టివికేని ఇబ్బంది పెట్టాలని చూస్తే తాము అండగా ఉంటామని బిజెపి సీనియర్ నాయకుడు ఒకరు విజయ్‌కి కబురు పంపించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కరూర్ ఘటనలో డిఎంకెని కూడా బాధ్యురాలిని చేయాలని తాము భావిస్తున్నామని, విజయ్ సంయమనం పాటించాలని ఆ నాయకుడు సూచించినట్లు వారు చెప్పారు. తన భవిష్యత్తు రాజకీయ ర్యాలీలపై సందిగ్ధంలో పడిన విజయ్‌ని తమ దారిలోకి తెచ్చుకుని ప్రజలలో ఆయనకు ఉన్న మాస్ ఇమేజ్ ద్వారా ఎన్నికల లబ్ధి పొందాలన్నది బిజెపి ఆలోచనగా కనిపిస్తోంది. కరూర్‌లో ఇటీవల జరిగిన ఘోర దుర్ఘటనపై శనివారం తీవ్ర విచారం వ్యక్తం చేసిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఈ ఘటనకు ఎవరు బాధ్యులో నిగ్గుతేల్చి, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై మద్రాసు హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను, చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని ఎక్స్ పోస్టులో స్టాలిన్ తెలిపారు. ఇదిలాఉంటే కరూర్‌లో విజయ్ ర్యాలీ దుర్ఘటనపై బిజెపి నేతలు కొంతమేర తటస్థవైఖరితో ఉండటాన్ని పరిశీలకులు గమనించారు. ఈ సంఘటనను అస్త్రంగా మలుచుకుని తమిళనాడులో టివికెతో అవగాహనకు వచ్చి డిఎంకెను ఓడించాలన్న లక్ష్యంతో బిజెపి అగ్రనేతలున్నట్లు తెలుస్తోంది. ఇందుకు తగినట్లుగానే బిజెపి మాజీ చీఫ్ అన్నామలై వ్యాఖ్యలు కూడా ఇటీవల అదే తరహాలో ఉన్నాయని నాయకులు చెపుతున్నారు. అయితే టివికెనుంచి ఇదే విషయమై ఎలాంటి స్పష్టత రాలేదు. ముందు విచారణ పూర్తి అయి నిర్దోషులుగా వచ్చిన తర్వాతనే ఎలాంటి వ్యాఖ్యలయినా చేయాలని పార్టీ సీనియర్ కేడర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు బిజెపి ఇంఛార్జ్‌గా నియమితులైన జయ్ పాండా ఈనెల 6న రాష్ట్ర పర్యటనకు రానున్నారు.

ఈ సందర్భంగా తమిళనాడులోని బిజెపి సీనియర్ నేతలు, పదాధికారులతో సమావేశం కానున్నారు. అటు, ఢిల్లీలో ఉన్న తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై.. కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన వివరాలు, దాని రాజకీయ ప్రభావంపై పార్టీ నాయకులకు నివేదిక ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేపై వ్యతిరేకత స్పష్టంగా ఉంటుందని భావిస్తోన్న బీజేపీ విపక్ష ఓట్లు చీలిపోకూడదనే వ్యూహంతో టివికెపై దృష్టి సారిస్తున్నారు.



# దగ్గుమందు తాగి 11 మంది చిన్నారుల మృతి

## చీటీ రాసిన డాక్టరు అరెస్టు

**భోపాల్, అక్టోబరు 5:** మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో 11 మంది చిన్నారుల మృతికి కారణమైన దగ్గుమందు రాసిన డాక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగిన పక్షంరోజుల్లోనే చిన్నారులు కిడ్నీ ఫెయిల్ అయి మృతిచెందారు. ఈనేపథ్యంలో కాఫ్ సిరప్‌సూచించిన డాక్టర్ ప్రవీణ్‌సోనీని పరాసియా ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు ఆదివారం ప్రకటించారు. ప్రభుత్వ డాక్టర్ అయిన ప్రవీణ్ చింద్వారాలో ప్రైవేట్ క్లినిక్ నడుపుతున్నారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి చికిత్స కోసం తన వద్దకు వచ్చిన చిన్నారులకు ఆయన కోడ్రిఫ్ సిరఫ్‌ను సూచించారు. దీంతో 11మంది చిన్నారులు అస్వస్థతకు గురై మరణించారు. ఈ నేపథ్యంలో కోల్డ్రిఫ్‌సిరప్‌అమ్మకాలను మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది. డాక్టర్‌పై కేసునమోదుచేసిన పోలీసులు అదుపులోకి తీసుకుంది. ఆసిరప్‌ను ఉత్పత్తి చేస్తున్న శ్రీసన్ ఫార్మా స్యూటికల్స్‌పై ప్రభుత్వం కేసు నమోదుచేసింది. ఈ డ్రగ్ కిడ్నీలకు హాని కలిగించే విషపూరిత పదార్థాలతో కలుషితమైనట్లుగా అనుమానిస్తున్నారు.

# మణిపూర్‌లో ప్రభుత్వ పునరుద్ధరణకు బీరేన్‌సింగ్ కసరత్తు

**ఇంఫాల్,అక్టోబరు 5:** మణిపూర్ మాజీ సిఎం బీరేన్ సింగ్ నేతృత్వంలో బిజెపి ఎమ్మెల్యేలు ఢిల్లీలో మకాంవేశారు. ప్రస్తుతం రాష్ట్రపతి పాలనలో ఉన్న ఆరాష్ట్రంలో ప్రభుత్వం పునరుద్ధరణ కోసం ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి తెచ్చేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. బిజెపి ఎమ్మెల్యేలు హెచ్ డింగో, రాబిన్‌ద్రో, ఎస్ రంజన్, మాజీ మంత్రి గోవిందాస్ కొంథోజామ్, హిల్ ఏరియాస్ కమిటీ ఛైర్మన్ డింగాంగ్లంగ్ గంగ్మేయ్ ఈబృందంలో ఉన్నారు. హోంమంత్రి అమిత్ షా, జెపినడ్డా, ప్రధాని మోడీ అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రధాని బిజీ షెడ్యూల్ దృష్ట్యా ఆయనను వారు కలుస్తారా లేదా అన్నది సందేహంగా ఉన్నది. కాగా, బిజెపి కేంద్ర నాయకత్వాన్ని కలవడం, మణిపూర్‌లో కొత్తప్రభుత్వాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేయడం లక్ష్యంగా తాము ఢిల్లీకి చేరినట్లు బీరేన్‌సింగ్ తెలిపారు. రెండేళ్లుగా జాతి హింసతో ఆ రాష్ట్రం రగిలిన నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం పదవికి ఆయన రాజీనామా చేశారు. దీంతో ఫిబ్రవరి 13 నుంచి రాష్ట్రపతి పాలన అమలులోకి వచ్చింది. మరోవైపు ఆగస్టులో పార్లమెంటు ఆమోదంతో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలల పాటు కేంద్రం పొడిగించింది. అయితే ఆ రాష్ట్రం కేంద్ర పాలనలో ఉన్నప్పటికీ అసెంబ్లీని రద్దు చేయలేదు. అసెంబ్లీని సస్పెన్షన్‌లో ఉంచారు.


# పాక్‌తో భారత్‌కు ఇబ్బందికలిగే ఒప్పందమేమీ రష్యాకులేదు!

## క్రెమ్లిన్ ప్రతినిధి వెల్లడి

**మాస్కో, అక్టోబరు 5:** ఫైటర్ జెట్ ఇంజిన్ల సరఫరా, తయారీకోసం పాకిస్తాన్‌తో రష్యా ఒప్పందం జరిగిందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని నిజానికి పాకిస్థాన్‌తో అలాంటి ఒప్పందమేదీ చేసుకోలేదని భారత్‌కు ఇబ్బందికరంగా అనిపించేంత పెద్ద ఒప్పందాలను తాము ఆదేశంతో చేసుకోలేదని రష్యా స్పష్టం చేసింది. భారత్‌కు ఇబ్బందికరంగా మారే చర్యలు తాము చేపట్టబోమని స్పష్టం చేసింది.

పాకిస్థాన్‌తో అలాంటి ఒప్పందం జరిగినట్లు ఎలాంటి ఆధారం లేదు. రానున్న కొద్ది రోజుల్లో రష్యా, భారత్ మధ్య పెద్ద ఒప్పందాలు జరుగుతాయని విశ్లేషించే పరిశీలకులకు ఈ వార్తల్లో లాజిక్ కనిపించదు. భారత్ ఇబ్బందిగా ఫీల్ అయ్యేంత పెద్ద ఒప్పందం పాకిస్తాన్‌తో రష్యా చేసుకోలేదు. పాక్‌తో ఆ స్థాయి సహకారం లేదు. భారత్, రష్యాల మధ్య చాలా ఉన్నత స్థాయిలో పరిచయాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంలో ఇరు దేశాల సహకారాన్ని చెడగొట్టేలా ఎవరో ప్రయత్నాలు చేస్తున్నారని క్రెమ్లిన్ వర్గాలు చెప్పినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ యుద్ధ విమానాల కోసం రష్యా ఇంజిన్లను సరఫరా చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. పాక్‌లో ఉన్న చైనా తయారీ ఫైటర్ జెట్లలో వాడే ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తోందని పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ వార్తలు దేశంలో పొలిటికల్ హీట్‌ను పెంచాయి. ప్రభుత్వ వైఖరిపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశాయి.

బిజెపిపై కాంగ్రెస్ తీవ్రవిమర్శలుచేసింది. ప్రధాని నరేంద్ర మోడీ రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపార భాగస్వామిగా చెబుతారని కానీ ఆ దేశం మన శత్రువుకు మద్దతునిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపణలు గుప్పించారు. మోడీది వ్యక్తిగతమైన దౌత్యం అని



ఎద్దేవాచేశారు. రష్యా, పాక్‌మధ్య ఒప్పందం ఇతర దేశాలతో సంబంధాల విషయంలో ప్రధాని వైఫల్యాన్ని సూచిస్తుందని మండిపడ్డారు. ఆయన జాతీయ ప్రయోజనాలకంటే తనకు పేరు వచ్చే విషయాలకే ప్రాధాన్యతనిస్తారని ఘాటుగా వ్యాఖ్యానించారు. రష్యా ఎందుకు పాక్‌కు సహకారాన్ని అందిస్తుందో ప్రభుత్వం చెప్పితీరాలన్నారు.

# భారీ వర్షాలకు విరిగిపడిన కొండచరియలు

## 17 మంది మృతి, మరికొందరికి గాయాలు




**డార్జిలింగ్, అక్టోబరు 5:** పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో మృతుల సంఖ్య 17కు చేరింది. వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. మరికొందరికి తీవ్ర గాయాలయినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు బాలసోన్ నదిపై దూదియా వద్ద సిలుగుడిమరిక్ ప్రాంతాలను కలిపే ఇనుప వంతెన కుప్పకూలింది. దాంతో రాకపోకలు నిలిచిపోయాయి. కలింపాంగ్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా పరిస్థితి దారుణంగా మారింది. 717 జాతీయ రహదారిపై కొండచరియలు విరిగి పడడంతో సిక్కిం-సిలిగురి మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. తీస్తా, మాల్ పర్వత ప్రాంత నదులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. భూటాన్‌లో భారీ వర్షాలతో బెంగాల్‌కు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది. ప్రజలందరూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు డార్జిలింగ్‌లోని పర్యాటక ప్రదేశాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు తూర్పు నేపాల్‌లోని కోషి ప్రావిన్స్‌లో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. 14 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. ఇలామ్ జిల్లాలో ఐదుగురు మరణించగా పటేగాన్, మన్సేబుంగ్, డ్యూమా, ధుసుని, రత్మాటే, ఘోసాంగ్ ప్రాంతాలలో మరో తొమ్మిది మంది మరణించారని అధికారులు తెలిపారు. సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుండటంతో హెలికాప్టర్లను రంగంలోకి దింపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు

# హమాస్ నిరాయుధీకరణలో వెనక్కితగ్గేదిలేదు

## ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు

**జెరూసలెం, అక్టోబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికకు హమాస్ పాక్షికంగా అంగీకరించిన మరుసటి రోజే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. హమాస్‌ను నిరాయుధీకరణ చేసే విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ఈ లక్ష్యాన్ని మంచి మాటలతో అయినా లేదా సైనిక చర్యతో అయినా సాధించి తీరతామని ఆదివారం స్పష్టం చేశారు. ఈ పరిణామం గాజా శాంతి చర్చల భవిష్యత్తుపై కొత్త సందేహాలను రేకెత్తిస్తోంది. డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో తెరపైకి వచ్చిన శాంతి ప్రణాళికలో భాగంగా యుద్ధాన్ని ముగించడం, బందీల విడుదల, గాజా పునర్నిర్మాణం వంటి కొన్ని అంశాలకు హమాస్ అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో నెతన్యాహు విడుదల చేసిన ఒక వీడియో సందేశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ ప్రణాళిక ప్రకారం దౌత్యపరంగా లేదా మా సైనిక మార్గంలో హమాస్‌ను నిరాయుధీకరణ చేస్తాం. గాజాను నిస్సైనికీకరణ చేసి తీరతాం. ఇది సులభంగా జరగవచ్చు లేదా కఠినంగానైనా మేం చేసి చూపిస్తామని నెతన్యాహు హెచ్చరించారు. గాజాలో ఇజ్రాయెల్ సైన్యం నియంత్రణలో ఉన్న ప్రాంతాల నుంచి పూర్తిగా వైదొలగే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. మరోవైపు, బందీల విడుదల విషయంలో నెతన్యాహు ఆశాభావం వ్యక్తం చేశారు. మనం ఒక గొప్ప విజయం అంచున ఉన్నాం. రాబోయే కొద్ది రోజుల్లో, సుక్కోత్ పండుగ సమయంలోపే మన బందీలందరూ (మరణించిన వారితో సహా) తిరిగి వస్తారనే శుభవార్తను మీకు అందించగలనని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ అంశంపై సోమవారం ఈజిప్టులో ఇజ్రాయెల్, హమాస్ ప్రతినిధుల మధ్య కీలక చర్చలు జరగనున్నాయి. శాంతి చర్చలు ఒకవైపు జరుగుతున్నప్పటికీ గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ హెచ్చరికలను సైతం



లెక్కచేయకుండా ఇజ్రాయెల్ జరిపిన తాజా వైమానిక దాడుల్లో ఆరుగురు మరణించినట్లు గాజా అధికారులువెల్లడించారు. ఇదిలా ఉండగా, ప్రాథమికంగా వెనక్కి వెళ్లేందుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, హమాస్ ధ్రువీకరించిన వెంటనే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

# కేరళ అదృశ్య వ్యక్తికి రూ.25 కోట్ల బంపర్ లాటరీ

**తిరువనంతపురం, అక్టోబరు 5:** కేరళకు చెందిన ఓ వ్యక్తి జాక్ పాట్ కొట్టాడు. కేరళ తిరువోణం బంపర్ లాటరీలో గుర్తుతెలియని వ్యక్తి రూ.25 కోట్లు గెలుచుకున్నాడు. అయితే లాటరీ ఫలితాలు ప్రకటించి ఒక రోజైనా లాటరీ మొదటి బహుమతి విజేత ఎవరో ఇంకా మిస్టరీగానే ఉంది. విజేతకు లాటరీ టికెట్ (టిహెచ్ 577825) ఎర్నాకుళంలోని నెట్టూర్‌కు చెందిన లాటరీ ఏజెంట్ లతీఫ్ విక్రయించారని వెల్లడైంది. అయితే లాటరీ ప్రైజ్‌ను అందుకునేందుకు విజేత ఇంకా ముందుకు రాకపోవడం గమనార్హం. మరోవైపు, లాటరీలో రూ.25 కోట్లు గెలుచుకున్న వ్యక్తి నెట్టూర్ ప్రాంత వాసేనని తెలుస్తోంది. అజ్ఞాత వ్యక్తికి లాటరీ టికెట్‌ను డ్రాకు కేవలం ఒక రోజు ముందు అమ్మానని



లతీఫ్ చెప్పాడు. అయితే దానిని ఎవరు కొన్నారో తనకు కచ్చితంగా తెలియదన్నాడు. తొలుత కొబ్బరి నూనె వ్యాపారి అయిన లతీశ్, ఇప్పుడు లాటరీ ఏజెన్సీని నడుపుతున్నాడు. రూ.25 కోట్ల విజేతకు టికెట్ అమ్మడం ద్వారా ప్రస్తుతం రాష్ట్రంలో అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ సంవత్సరం తిరువోణం బంపర్ (బీఆర్92) టికెట్లను అమ్మడం పట్ల లతీశ్ చాలా సంతోషంగా ఉన్నాడు. లాటరీలో మొదటి బహుమతి టికెట్‌ను లతీఫ్ అమ్మడం గత మూడు నెలల్లో ఇది రెండో సారి. ఈ క్రమంలో తాను సాధించిన ఘనత గురించి లతీశ్ ఆనందం వ్యక్తం చేశాడు. నేను అమ్మిన టికెట్ బహుమతి గెలుచుకున్నందుకు నేను 100 శాతం సంతోషంగా ఉన్నాను. నేను దేవునికి కృతజ్ఞతలు చెప్పుకోవాలని లతీశ్ అన్నాడు. రూ. 25 కోట్ల బంపర్ బహుమతిని అమ్మే ఏజెంట్‌కు దాదాపు 10 శాతం అంటే రూ. 2.5 కోట్ల కమీషన్ లభిస్తుంది. ట్యాక్స్ రూ. 6.6 కోట్లుపోనూ రూ.15.40 కోట్లు ఉంటుంది. మొత్తం ఆదాయం రూ.15 కోట్లు దాటినందున పన్నుపై 37శాతం సర్ ఛార్జ్ (సుమారు రూ2.5 కోట్లు)ను విధిస్తారు. ఇవన్నీ పోనూ మిగతా డబ్బులు లాటరీ విజేతకు దక్కుతాయి. బంపర్ లాటరీ టికెట్లు రిలీజ్‌మరోవైపు, పూజ బంపర్ లాటరీ టికెట్లను కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్ విడుదల చేశారు. తిరువనంతపురంలోని గోర్కీ భవన్‌లో జరిగిన తిరువోణం బంపర్ డ్రా వేడుకకు ముందు ఈ టికెట్లను రిలీజ్ చేశారు. ఈ పూజ బంపర్ లాటరీ డ్రాలో మొదటి బహుమతి విజేతకు రూ.12 కోట్లు అందుతాయి. ఈ బంపర్ లాటరీ టికెట్ ధర రూ.300గా నిర్ణయించారు. 3,32,130 మంది బహుమతులు అందజేయనున్నారు. పూజ బంపర్ లాటరీ డ్రా నవంబర్ 22న మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుంది.




# నలుగురి హత్యలపై న్యాయవిచారణ జరపాలి

## లేదంటే నేను జైలులోనే కొనసాగేందుకు సిద్ధమే!

## పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్

**లేహ్, అక్టోబరు 5:** లడఖ్‌కు రాష్ట్రహోదాకోసం డిమాండ్ చేస్తూ ఇటీవల లేహ్ ప్రాంతంలో జనం నిరసనలకు దిగగా అల్లర్లు చెలరేగాయి. ఆ అల్లర్లలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 90 మందికి పైగా గాయపడ్డారు. దాంతో లధఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన జైలు నుంచి ఓ సందేశంపంపారు. లధఖ్ ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై స్వతంత్ర్య దర్యాప్తు జరిపించాలని, లేదంటే తాను జైల్లోనే ఉండిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని వాంగ్‌చుక్ తన సందేశంలో హెచ్చరించారు. కాగా, వాంగ్‌చుక్ ప్రస్తుతం జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు. సోదరుడు కాత్సే తాన్ డోర్జే లేతో పాటు న్యాయవాది ముస్తఫా హాజీలు ఆయనను కలిసిన సందర్భంగా ఈ సందేశాన్ని పంపారు. తాను శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నానని, తన కోసం ప్రార్థిస్తున్న వారికి ధన్యవాదాలు అని తన సందేశంలో వాంగ్‌చుక్ పేర్కొన్నారు. ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నానని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాననిఅన్నారు. నలుగురి హత్యలపై న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. లేదంటే తాను జైలులోనేఉండేందుకు సిద్ధంగా ఉన్నాననిచెప్పారు. లధఖ్‌కు రాష్ట్రహోదా కోసం ప్రజలు, లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్‌చేస్తున్న డిమాండ్‌లకు మద్దతిస్తున్నానని పేర్కొన్నారు. ఈసందర్భంగా శాంతి, ఐక్యతను కాపాడుకోవాలన్నారు. అహింసా మార్గంలోనే మన పోరాటాన్ని శాంతియుతంగా కొనసాగించాలని ప్రజలకు సూచించారు. కాగా సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే లేహ్‌లో ఆందోళనలు జరిగాయని ఆరోపించిన కేంద్రం జాతీయ భద్రతాచట్టం కింద ఆయనను అరెస్ట్ చేయించింది. ఈ చట్టం కింద అరెస్టయిన వ్యక్తిని విచారణ చేయకుండా 12 నెలలపాటు నిర్బంధించేందుకు చట్టం అనుమతిస్తుంది. ఈ క్రమంలోనే తన భర్తను విడుదల చేయాలంటూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జే ఆంగ్మో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌పై సోమవారం విచారణ జరగనుంది.

# కోళ్లు, గొర్రెల వివరాలు అడగవద్దని చెప్పా

## కుల గణనపై కర్ణాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్

**బెంగళూరు, అక్టోబరు 5:** కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన కులగణన పూర్తి కావడానికి ఇంకా మూడు రోజులే మిగిలి ఉండడంతో.. అధికారులు సర్వేను మరింత వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కులగణనకు వెళ్లే అధికారులకు ముందే తాను పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలను వారికి ఎన్ని కోళ్లు, గొర్రెలు, మేకలున్నాయి? ఎంత బంగారం ఉందనే వ్యక్తిగత ప్రశ్నలు, వివరాలు అడగవద్దని సూచించానన్నారు. సర్వే చేస్తున్న సమయంలో ప్రజలు పంచుకోలేని వ్యక్తిగత ప్రశ్నలు అడగవద్దని చెప్పినట్లు తెలిపారు. కానీ సర్వే నిర్వహించే అధికారులు స్వతంత్ర కమిషన్‌కు చెందిన వారు కాబట్టి.. ఆ సమయానికి వారు ఏమి చేస్తున్నారో తెలియదన్నారు.

రూ. 420 కోట్ల అంచనా వ్యయంతో నిర్వహిస్తున్న ఈ సర్వేలో 60 ప్రశ్నల ప్రశ్నాపత్రం ఉందని.. అందులో అడిగే అన్ని ప్రశ్నలకు కచ్చితంగా సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం లేదని శివకుమార్ అన్నారు. సమాధానం చెప్పడం ఇష్టం లేకపోతే అధికారులు వారిని బలవంతం చేయకూడదని కోర్టు సైతం పేర్కొన్నట్లు తెలిపారు. సర్వేకు సంబంధించిన అభ్యంతరాలను, ఖర్చును ప్రస్తావిస్తూ, ఎవరు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా కులగణనను పూర్తి చేస్తామన్నారు.

2015లో కర్ణాటక వెనకబడిన వర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలోనే ఆమోదించింది. నిపుణులు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవడంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాష్ట్రంలో మరోసారి కులగణనను చేపట్టింది. సెప్టెంబరు 22న ప్రారంభమైన ఈ సర్వే ఈ నెల 7న ముగియనుంది.


# సంక్షిప్తంగా..

## కరూర్ తొక్కిసలాట పక్కా ప్రణాళికతో చేసిందే: ఖుష్బూ

**చెన్నై, అక్టోబరు 5:** టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘటనపై నటి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖుష్బూసుందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా ప్రణాళికతో, కావాలని చేసినట్లు కన్పిస్తోందని ఆరోపిస్తూ.. తమిళనాడు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తొక్కిసలాట ఘటనలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిందని ఖుష్బూ పేర్కొన్నారు. ఇది ఎవరో కావాలని సృష్టించినట్లు ఉందన్నారు. విజయ్ ర్యాలీకి ప్రభుత్వం సరైన స్థలం ఇవ్వలేదని విమర్శించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయారని.. మౌనంగా ఉన్న సిఎం స్టాలిన్ దీనిపై మాట్లాడాలన్నారు. ర్యాలీలో పోలీసులు లాఠీచార్జి ఎందుకు చేశారని ఆమె ప్రశ్నించారు. దీనిని సంబంధించిన చాలా విడియోలు బయటకు వచ్చాయన్నారు. కరూర్ విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా.. అనేకమంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి టివికెకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు.

## భారత్ నుంచి అంటార్కిటికాకు రవాణా విమానం!


**పనాజీ, అక్టోబరు 5:** భారత్‌నుంచి నేరుగా అంటార్కిటికాకు తొలిసారి రవాణా విమానం వెళ్లింది. దీనిలో భారీ సైన్స్‌పరికరాలను పంపించారు. ఇందుకోసం రష్యా తయారీ ఐఎల్-76 అనే భారీ విమానం వినియోగించారు. దీనిని డ్రోనింగ్ మౌడ్ ల్యాండ్ అండ్ ఎయిర్ నెట్‌వర్క్ నిర్వహిస్తోంది. ఈ విమానంలో మొత్తం 18 టన్నుల దుస్తులు,



ఔషధాలు, నిత్యావసరాలను పంపించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ విమానం గోవాలోని మనోహర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి వెళ్లింది. ఇది దక్షిణాఫ్రికాకు వెళ్లి.. అక్కడి కేప్‌టౌన్ నగరం మీదుగా తన గమ్యాన్ని చేరుకోనుంది. మన దేశం అంటార్కిటికాలో భారతీ, మైత్ర అనే రెండు రీసెర్చి బేస్‌లను నిర్వహి స్తోంది. 1981 నుంచి భారత్ అంటార్కిటికాలో ప్రయోగాలు చేస్తోంది. ప్రస్తుతం భౌగోళిక రాజకీయ మార్పులు, అనుమతుల కోసం సుదీర్ఘకాలం ఎదురుచూడాల్సి రావడం, సముద్ర మార్గంలో తరలింపు ఆధారపడదగ్గది కాకపోవడం వంటివి నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చికి ఆందోళనకరంగా మారాయి.

## అలనాటి బాలివుడ్‌నటి సంధ్యాశాంతారామ్ కన్నుమూత

**ముంబయి, అక్టోబరు 5:** ప్రముఖ హిందీ సినీ నటి, దిగ్గజ దర్శకుడు వి. శాంతారామ్ సతీమణి సంధ్యా శాంతారామ్ (94) కన్నుమూశారు. వయోభారంతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న ఆమె తన స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారని సమాచారం. ఆమె మరణం పట్ల చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. సంధ్యా శాంతారామ్ సినీ రంగంలో సుదీర్ఘకాలం పాటు తనదైన ముద్ర



వేశారు. ఆమె హిందీతో పాటు మరాఠీ సినిమాల్లో కూడా విజయవంతంగా నటించారు. అమర్ భూపాలి, ఝనక్ ఝనక్ పాయల్ బాజే, నవరంగ్, పింజారా వంటి చిత్రాలు ఆమెకు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. ఈ చిత్రాలలో ఆమె పోషించిన పాత్రలు, ముఖ్యంగా ఆమె నృత్య ప్రదర్శనలు ఆమెను కలల నటిగా నిలిపాయి. నృత్యకళలో ఆమె చూపిన ప్రత్యేక ప్రతిభ ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. సంధ్యా శాంతారామ్ మరణం పట్ల పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు.

## ఖలిస్థానీ వేర్పాటువాదసంస్థలకు కెనడానుంచే నిధులు!

**టొరంటో, అక్టోబరు 5 :** ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థలకు తమ దేశం నుంచే నిధులు అందుతున్నాయన్న వాస్తవాన్ని కెనడా ప్రభుత్వం తొలిసారి అధికారికంగా అంగీకరించింది. దేశంలోని మనీలాండరింగ్, ఉగ్రవాద ఫండింగ్‌పై విడుదల చేసిన ఒక కీలక నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా తెలిపింది. సేవా సంస్థల ముసుగులో జరుగుతున్న ఈనిధుల మళ్లింపుపై కెనడా ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. కెనడా ఆర్థిక శాఖ ఇటీవల విడుదల చేసిన అసెస్‌మెంట్ ఆఫ్ మనీలాండరింగ్, టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ రిస్క్స్ ఇన్ కెనడా 2025నివేదికలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ సిక్ యూత్ ఫెడరేషన్ వంటి ఖలిస్థానీ వేర్పాటువాద గ్రూపులతో పాటు హమాస్, హెజ్‌బొల్లా వంటి సంస్థలు కూడా కెనడాలోని వ్యక్తులు, సంస్థల నుంచి ఆర్థిక సహాయం పొందుతున్నాయని ఆ నివేదిక వెల్లడించింది.

## బాక్సింగ్ ఫెడరేషన్ కప్‌లో సెమీస్‌కు భారత్ మహిళా బాక్సర్లు





**న్యూఢిల్లీ:** బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కప్-2025లో భారత్ మహిళా బాక్సర్లు అద్భుత ప్రతిభ కనపరిచి సెమీస్‌కు చేరుకున్నారు. వీరిలో మంజు రాణి, అంకుషిత, అరుంధతి, ప్రియ, పర్వీన్ ఉన్నారు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత మంజు రాణి (రైల్వేస్) 5:0 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. అలాగే ప్రపంచ యూత్ ఛాంపియన్ అంకుషిత బోరో (అస్సాం), మాజీ యూత్ వరల్డ్ ఛాంపియన్ అరుంధతి చౌదరి (సర్వీసెస్), అండర్22 రజత పతక విజేత ప్రియా (హర్యానా), ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత పర్వీన్ హుడా (ఎస్ఎఐ) కూడా ఆధిపత్య విజయాలతో సెమీఫైనల్‌ను నిర్ధారించారు. ఇక పురుషుల విభాగంలో, ప్రపంచ కప్ బ్రెజిల్ కాంస్య పతక విజేత మనీష్ రాథోడ్ (ఎఐపి), అండర్ 22 ఆసియా కాంస్య పతక విజేత రాకీ (ఎఐపి), ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత అమిత్ పంఘల్ (సర్వీసెస్) తమ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మహ్మద్ హుసాముద్దీన్ (సర్వీసెస్) తన ఖ్యాతిని నిలబెట్టుకున్నాడు. బిఎఫ్ఐ కప్ ఎలైట్ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో తన ప్రారంభ బౌట్‌లో సర్వీసెస్‌కు చెందిన హర్ష్‌పై 5:0 తేడాతో ఆధిపత్యం చెలాయించాడు.

## అమెరికా చేతిలో భారత్ చిత్తు

### గుకేష్, అర్జున్, దివ్య, సాగర్ టీం ఓటమి



**న్యూఢిల్లీ:** చెక్‌మేట్ టోర్నమెంట్‌లో అమెరికా చెస్ జట్టు చేతిలో భారత్ చెస్ జట్టు ఓటమి చెందింది. యుఎస్ఎ వర్సెస్ ఇండియా అనే విలక్షణమైన మ్యాచ్‌లో భారత చెస్ జట్టు 0-5 తేడాతో బలమైన యుఎస్ఎ జట్టుచేతిలో చిత్తయింది. డల్లాస్, టెక్సాస్‌లోని ఆర్లింగ్టన్, ఈ స్పోర్ట్స్ స్టేడియంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన ఈ ఈవెంట్ లో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్, ఎరిగైసి అర్జున్, ఇటీవల మహిళల ప్రపంచ కప్ ఛాంపియన్ దివ్య దేశ్‌ముఖ్, హికారు నకమురా, షాబియాన్ కరువానా వంటి అగ్ర ఆటగాళ్లతో కూడిన భారత్, అమెరికా దేశాల టాప్ చెస్ స్టార్లు తలపడ్డారు. ఫాబియానో కరువానాతో తలపడిన అర్జున్ భారత్ గ్రాండ్ మాస్టర్ అర్జున్ పావులు కదపడంలో వెనుకబడిపోయాడు. ఆ తర్వాత వాజ్ అడెవుమి చేతిలో ఓడిపోయాడు. ఇటీవల పట్టాభిషేకం చేసిన యిప్‌తో జరిగిన మ్యాచ్‌లో దివ్య ఒత్తిడిలో తడబడింది. ఫలితంగా ఈ మ్యాచ్‌లో యిప్ 3-0 ఆధిక్యాన్ని యుఎస్ఎకి అందించాడు. ఆ తర్వాత రోజ్‌మన్‌తో జరిగిన పది నిమిషాల ఆటను షా డ్రాగా ముగించాడు. ఇక గుకేష్ వరుసగా పది, ఐదు నిమిషాల మ్యాచ్‌లలో నకమురాతో డ్రా చేసుకున్నాడు. దీంతో భారత్ 0-5 తేడాతో ఓడిపోయింది.

ఆట



### ఫెనెస్టా ఓపెన్‌లో ఛాంపియన్స్‌గా

## మనీష్, వైష్ణవి

**న్యూఢిల్లీ:** ఫెనెస్టా ఓపెన్ నేషనల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2025, పురుషుల, మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ ప్లేయర్లు మనీష్ సురేష్ కుమార్, వైష్ణవి అడ్కర్ ఛాంపియన్లుగా నిలిచారు. న్యూఢిల్లీలో జరిగిన తమిళనాడుకు చెందిన మనీష్, మహారాష్ట్రకు చెందిన వైష్ణవి వరుసగా పురుషుల మరియు మహిళల సింగిల్స్ టైటిళ్లను కైవసం చేసుకుని తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో, మనీష్ 6-4, 6-2 తేడాతో కీర్తివాసన్ సురేష్‌ను ఓడించి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. మొదటి సెట్‌ను హోరాహోరీగా ఎదుర్కొన్న తర్వాత, మనీష్ తన జోరును కొనసాగించి రెండవ సెట్‌ను ముగించి కిరీటాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్ పోరులో వైష్ణవి అడ్కర్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించి, ఆకాంక్ష నిట్టూర్‌ను 6-1, 6-2 తేడాతో ఓడించింది. వైష్ణవి దూకుడుగా ప్రారంభించి ప్రారంభంలోనే బ్రేక్ చేసి, తన ఖచ్చితమైన షాట్ మేకింగ్ మరియు దృఢమైన సర్వ్‌ను ఉపయోగించి వరుస సెట్లలో టైటిల్‌ను కైవసం చేసుకుంది. కాగా అండర్18 విభాగంలో, హర్షిణి ఎన్ 6-1, 2-6, 6-4 తేడాతో స్నిగ్ధ కాంతపై మూడు గంటల పాటు ఉత్కంఠభరితంగా జరిగిన పోరులో పోరాడి బాలికల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. ఇక హృతిక్ కటకం గాయం కారణంగా రిటైర్ కావడంతో తవిష్ పహ్వా బాలుర సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది, స్కోరు 7-6(2), 1-0తో తవిష్‌కు అనుకూలంగా ఉంది. పురుషుల డబుల్స్ ఫైనల్‌లో నితిన్ కుమార్ సిన్హా-మాన్ కేశర్వాణి, మనీష్ సురేష్‌కుమార్-అభినవ్ సంజీవ్ ఎస్‌లను 6-4, 3-6 (10-5) తేడాతో ఓడించి విజయం సాధించారు. మహిళల డబుల్స్‌లో ఆకాంక్ష నిట్టురే-సోహా సాదిక్ జట్టు, జత పూజా ఇంగలే-యుబ్రాని బెనర్జీలను 6-2, 6-2 తేడాతో ఓడించింది.

# ముగ్గురు ఔట్

### ఛాంపియన్స్ ట్రోఫీ విజేతలకు షాక్

## జడేజా, షమీ, వరుణ్‌లకు ప్లేస్ నిల్

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ విజయానికి కారణమైన టీమిండియాకు నాయకత్వం వహించిన రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తొలగించారు. ఇదే సమయంలో ఈ ట్రోఫీ విజయానికి కీలకమైన మరో ముగ్గురు ఆటగాళ్లను జట్టు నుంచి తొలగించారు. వారిలో రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నారు. ఈ







నెల 19 నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియా పర్యటనలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు టీమిండియా సభ్యులను భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) పురుషుల సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఏడు నెలల క్రితం ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టును విజయపథంలో నడిపించిన కెప్టెన్ రోహిత్ స్థానంలో శుభ్‌మాన్ గిల్‌ను కెప్టెన్‌గా నియమించడం వివాదాస్పదమైంది. అయితే ఆస్ట్రేలియా టెస్ట్‌లో ప్లేయర్‌గా రోహిత్‌కు అవకాశం కల్పించారు. దీంతో రోహిత్ భవిష్యత్తు ఇప్పటికే ప్రశ్నార్థకంగా ఉంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీని ఎంపిక చేయలేదు. ఛాంపియన్స్ ట్రోఫీలో, షమీ సెమీఫైనల్‌లో 3 వికెట్లు పడగొట్టి, జట్టు ఫైనల్‌కు చేరుకోవడానికి సహాయం చేశాడు. అతను టోర్నమెంట్‌లో భారత జట్టు తరపున అత్యంత విజయవంతమైన బౌలర్. తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. కానీ, ఇప్పుడు అతనికి జట్టులో చోటు లేదు. షమీ మాత్రమే కాదు, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ కూడా తొమ్మిది వికెట్లు పడగొట్టి, ఛాంపియన్స్ ట్రోఫీలో షమీ వికెట్‌ను సమం చేశాడు. భారత జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. సెమీఫైనల్, ఫైనల్‌లో వరుణ్ ఆర్థికంగా బౌలింగ్ చేశాడు. చెరో 2 వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శన ఉన్నప్పటికీ, ఆస్ట్రేలియా పర్యటనకు అతనిని తప్పించడం ఆశ్చర్యకరం. మరో ముఖ్యమైన నిర్ణయం రవీంద్ర జడేజాను తప్పించడం. జడేజా టీం ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో భాగం. కానీ ఆ టోర్నమెంట్ అతనికి అంతగా ఆకట్టుకోలేదు. కేవలం 5 వికెట్లు మాత్రమే తీసుకుని 50 పరుగులు మాత్రమే చేశాడు. అయినప్పటికీ, ఇటీవల ఇంగ్లాండ్‌తోను, ఇప్పుడు వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్‌లలో తన బ్యాటింగ్‌తో తనను తాను నిరూపించుకున్నాడు. అయితే, ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేయకుండా పక్కనపెట్టారు.



## ఇరానీ కప్ విజేత విదర్భ

### రెస్ట్ ఆఫ్ ఇండియాకు షాక్

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ ఛాంపియన్ విదర్భ తమ జోరును చూపిస్తూ ఇరానీ కప్ నూ దక్కించుకుంది. బ్యాటర్లతో పాటు స్పిన్నర్ దూబే చెలరేగడంతో రెస్ట్ ఆఫ్ ఇండియాకు షాకిస్తూ మూడోసారి ట్రోఫీని అందుకుంది. 2018, 2019లో ఇరానీ కప్ విజేత అయిన విదర్భ ఈసారి కూడా ఛాంపియన్‌గా నిలిచింది. దూబే నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థిని కూల్చడంతో 93 పరుగుల తేడాతో గెలుపొందింది. శతకంతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన అథర్వ తైడే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. విదర్భ నిర్దేశించిన 361 పరుగుల ఛేదనలో రెస్ట్ ఆఫ్ ఇండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. 35/2తో ఐదో రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు ఐదో ఓవర్లోనే కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ కోల్పోయింది. రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్‌లు సైతం త్వరగా వెనుదిరగడంతో 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది రెస్ట్ ఆఫ్ ఇండియా. అనంతరం యశ్ ధుల్(92), సరాన్ష్ జైన్(29)లు ఆరో వికెట్‌కు 53 పరుగులు జోడించింది ఆదుకున్నారు. కానీ, జైన్ ఎల్బీగా ఔట్ కావడంతో 156/6తో లంచ్‌కు వెళ్లింది రెస్ట్ ఆఫ్ ఆండియా. ఆ తర్వాత మానవ్ సుతార్ (56), ధుల్ ద్వయం 103 పరుగుల భాగస్వామ్యంలో విదర్భను భయపెట్టారు. కానీ సెంచరీకి చేరువైన ధుల్‌ను, అన్షుల్ కంబోజ్‌ను యశ్ ఠాకూర్ ఔట్ చేయడంతో ఆ జట్టు ఆశలు ఆవిరయ్యాయి. టీ బ్రేక్ లోపే రెస్ట్ ఆఫ్ ఇండియాను 267కు ఆలౌట్ చేసిన విదర్భ హ్యాట్రిక్ ట్రోఫీతో చరిత్ర సృష్టించింది. నాగ్‌పూర్‌లోని వీసీఏ స్టేడియంలో విదర్భ బౌలర్ల ధాటికి రెస్ట్ ఆఫ్ ఇండియా కుప్పకూలింది. తొలి వికెట్‌కు 52 పరుగుల శుభారంభం లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. కెప్టెన్ రజత్ పాటిదార్(66), అభిమన్యు ఈశ్వరన్(52)లు రాణించగా, యశ్ ఠాకూర్ విజృంభణతో ఆ జట్టు214కే ఆలౌట్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో అథర్వ తైడే(143) మారథాన్ ఆటతో ఆదుకోగా, యశ్ రాథోడ్(91) మెరవగా విదర్భ 312 రన్స్ చేసింది. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో ఆకాశ్ దీప్ (351), సరన్ష్ జైన్(294)లు రాణించారు.

## నిర్ణయాత్మక మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 316 భారీ స్కోర్



### 172 / 3తో క్రీజులో భారత్

### కెప్టెన్ శ్రేయస్, రియాన్

**న్యూఢిల్లీ:** భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా నిర్ణయాత్మక మూడో వన్డేలో ఆసీస్ భారీ స్కోర్ చేసింది. ఆదివారం టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.1 ఓవర్లలో 316 పరుగుల స్కోర్ చేసింది. కూపర్ కన్నోలీ 64, లియామ్ స్కాట్ 73, కెప్టెన్ జాక్ ఎడ్వర్డ్స్ 89తో అర్ధ సెంచరీలు చేసి సత్తా చాటి ఆసిస్ భారీ స్కోర్ చేసేందకు దోహదపడ్డారు. 44 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దశలో కన్నోలీ, లిచ్లన్ షా (32) సాయంతో ఆసీస్ ఇన్నింగ్స్‌కు జీవం పోశాడు. ఆ తర్వాత లియామ్ స్కాట్, ఎడ్వర్డ్స్ సంచలన ఇన్నింగ్స్‌లతో భారీ స్కోకర్ అందించారు. భారత్ బౌలర్లలో అర్షదీప్ షింగ్, హర్షిత్ రాణా చెరో 3 వికెట్లు తీయగా, పార్ట్ టైమ్ బౌలర్ ఆయుష్ బదోని 2, గుర్జప్నీత్ షింగ్, నిషాంత్ సంధు తలో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం 317 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ శతకంతో విరుచుకుపడటంతో 24 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ తన శైలికి విరుద్ధంగా నిదానంగా ఆడి 25 బంతుల్లో 22 పరుగులు చేసి ఔటయ్యాడు. తిలక్‌వర్మ 3 పరుగులతో నిరాశపరిచాడు. కెప్టెన్ శ్రేయష్ అయ్యర్ (17), రియాన్ పరాగ్ (22) క్రీజ్‌లో ఉన్నారు. భారత్ గెలవాలంటే 26ఓవర్లలో మరో145 పరుగులు చేయాల్సి ఉంది. చేతిలో ఇంకా 7 వికెట్లు ఉన్నాయి.

వాణిజ్యం

## చిన్న బ్యాంకుల్లోనూ సీనియర్ సిటిజన్స్‌కు అధిక వడ్డీ!



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** అధిక వడ్డీ కోరుకునే వారికి పలు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు ఇపుడు అధిక వడ్డీలు ఆఫర్ చేస్తున్నాయి. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 3 సంవత్సరాల మెచ్యూరిటీ టెన్యూర్ గల్ డిపాజిట్లకు గరిష్టంగా 8.15 శాతం మేర వడ్డీ ఆఫర్ చేస్తోంది. సీనియర్ సిటిజన్ రూ.5 లక్షలు జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత చేతికి అసలు, వడ్డీ కలిపి రూ. 6,21,830 వరకు వస్తాయి. స్లైస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 18 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు టెన్యూర్ డిపాజిట్లపై గరిష్ఠంగా 7.75 శాతం మేర వడ్డీ అందిస్తోంది. ఇందులో సీనియర్ సిటిజన్ రూ.5 లక్షలు జమ చేస్తే 3 ఏళ్ల నాటికి చేతికి అసలు వడ్డీ కలిపి రూ. 6,15,850 వరకు వస్తుంది. జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రస్తుతం 2 ఏళ్ల నుంచి 3 సంవత్సరాల వరకు మెచ్యూరిటీ ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఏకంగా 8 శాతం వడ్డీ ఇస్తోంది. శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రస్తుతం 3 ఏళ్ల టర్మ్ డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు గరిష్ఠంగా 7.50 శాతం మేర వడ్డీ అందిస్తోంది. ఇందులో రూ.5 లక్షలు జమ చేసినట్లయితే మెచ్యూరిటీ తర్వాత చేతికి మొత్తం రూ. 6,12,000 పైన అందుతాయి. చాలా మంది స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు వెనకడుగు వేస్తారు. అయితే, వీటిల్లోనూ డిపాజిట్ ఇన్సూరెన్స్ క్రెడిట్ గ్యారెంటీ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత బీమా కవరేజీ ఉంటుంది.

### నెలలో రూ.23,885 కోట్ల

## ఎఫ్‌పిఐల విత్‌డ్రా!



**ముంబయి, అక్టోబరు 5:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు మార్కెట్లనుంచి సెప్టెంబరు నెలలో రూ.23,885 కోట్ల రూపాయలు విత్‌డ్రాచేసుకునానరు. దీనితోఈ ఏడాది ఇప్పటివరకూ మార్కెట్లనుంచి విదేశీ ఇన్వెస్టర్లు రూ.1.58 లక్షలకోట్లుగా ఉన్నాయని డిపాజిటరీ డేటా వివరాలతో స్పష్టం అవుతోంది. వరుసగామూడోనెలలో కూడా విదేశీ ఇన్వెస్టర్లు విత్‌డ్రాకే మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఆగస్టులో 34,990 కోట్లు, జులైలో 17,700 కోట్లు కూడా విత్ అయ్యాయి. మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చి సంస్థ ప్రిన్సిపల్ మేనేజర్ హిమాంశు శ్రీవాస్తవా మాట్లాడుతూ ఈ అమ్మకాలు అనేక అంశాలతోముడిపడి ఉన్నాయని, అమెరికా వాణిజ్య ఒప్పందం, భారత పాలసీ మార్పులు వంటివి కూడా తోడవుతున్నాయన్నారు. అలాగే భారత దిగుమతులపై అమెరికా 50శాతం సుంకాలు, హెచ్‌వన్‌బి వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంపు వంటివి ఎగుమతి ఆధారిత రంగాల సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని చెప్పారు. వీటితోపాటు భారత్‌రూపాయి గణనీయంగా పతనం అయింది. డాలరుతో రూపాయి మారకం విలువలు రికార్డుస్థాయికి క్షీణించాయి. జిఎస్టీ హేతుబద్ధీకరణతో కొంతమేర మార్కెట్లకు ఊతం ఉంటుందని కొందరు ట్రేడర్లు చెపుతున్నారు. ఇప్పటికీ కూడా భారత్ ప్రపంచంలోనే శరవేగంగా అభివృద్ధిచెందుతునన దేశంగా పరిగణించవచ్చని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. భారత్ డెట్ మార్కెట్లలో ఎఫ్‌పిఐలు 1085 కోట్లు పెట్టుబడులు పెట్టారు. డెట్ మార్కెట్లలో ఎఫ్‌పిఐల పరిమితి 1213 కోట్లవరకూ ఉంది. ఆపరిమితికి లోబడే విదేశీ పెట్టుబడులు వచ్చినట్లు విశ్లేషకుల అంచనా.

## ఈక్విటీలపై కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు

### ఈ వారంలో సెన్సెక్స్, నిఫ్టీల ట్రేడింగ్‌లో కీలక పరిణామాలు



**ముంబయి, అక్టోబరు 5:** భారత్ ఈక్విటీ మార్కెటకు ఈ వారంలో అంతర్జాతీయ పరిణామాలు స్థూల ఆర్థిక గణాంకాలతోపాటు ఐటి దిగ్గజాలు టిసిఎస్ వంటి వాటి కార్పొరేట్ ఫలితాల ప్రభావం అధికంగా ఉంటుంది. విదేశీ ఫండ్స్ రాకపైనా ట్రేడర్లు దృష్టిసారిస్తారు. సెప్టెంబరులో ఎఫ్‌పిఐలు ఎక్కువ విత్‌డ్రా కావడంతో ట్రేడర్లు అప్రమత్తం అయ్యారు. ఈ వారం రెండోత్రైమాసికం ఫలితాల సీజన్‌గా ఉంటుంది. టిసిఎస్ ఈనెల 9న ఫలితాలు వెల్లడిస్తుంది. హెచ్ఎస్‌బిసి సర్వీస్, కాంపోజిట్ పిఎంఐ గణాంకాలు కూడా అదేరోజువ ఇడుదలవుతాయి. అలాగే ఇప్పటివరకూ బ్యాంకింగ్‌రంగంలోని రుణాలు, డిపాజిట్ల వృద్ధికూడా ప్రభావితంచేస్తాయన్నది అంచనా. ఇక ఈ వారంలోనే భారీ ఐపిఒలు వస్తున్నాయి. టాటాక్యాపిటల్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వంటి మెగా ఐపిఒలు వస్తున్నాయి. అలాగే ఫెడ్‌రిజర్వు మినిట్స్, నిరుద్యోగ గణాంకాలు, వినియోగరంగ సెంటిమెంట్‌లు కూడా ఈ వారం మార్కెట్లకు కీలకం అవుతాయని విశ్లేషకుల అంచనా. డాలరుతో రూపాయి మారకం విలువలు, పదేళ్ల బాండ్ల రాబడులు, బంగారం వెండి ఆభరణాల ధరవరలు కూడా ఈక్విటీసూచీల్లో ఆరంగ కంపెనీలపై ప్రభావంచూపిస్తాయి. అలాగే ఐటి దిగ్గజాల్లో కొనసాగుతున్న లేఆఫ్‌లు, విదేశీ ఉద్యోగులకు అమెరికా టెక్ కంపెనీల ఉద్వాసన వంటివి టెక్కోరంగం షేర్లపై ప్రభావం ఉంటుంది. గతవారంలో బిఎస్ఇ సెన్సెక్స్ 780.71 పాయింట్లుపెరిగితే నిఫ్టీ 239.55 పాయింట్లవరకూ పెరిగింది. శెలవులకారణంగా గతవారం కొద్దిరోజులే ట్రేడింగ్‌జరిగినా ఈ వారం రెండోత్రైమాసిక ఫలితాలు మార్కెట్లకు కీలకం కానున్నాయి.


## క్యాష్ ఆన్ డెలివరీలపై అదనపు ఛార్జీలు



### దోపడీని ఉపేక్షించమని కేంద్రం సీరియస్

**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** ఆన్‌లైన్ కొనుగోళ్లలో వినియోగదారుల్ని ఆకర్షించే ముఖ్య సదుపాయాల్లో క్యాష్ ఆన్ డెలివరీ కూడా ఒకటి. అయితే ఇక్కడ ప్రముఖ ఇ కామర్స్ సంస్థలు ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నాయన్న ఫిర్యాదులపై కేంద్రం దృష్టిసారించింది. ఎట్టిపరిస్థితుల్లోనుపేక్షించేదిలేదని, కఠిన చర్యలు తప్పవని కేంద్ర వినియోగ వ్యవహారాలశాఖ హెచ్చరించింది. ఈకామర్స్‌సంస్థలు సైలెంట్‌గా ఎక్కువ వసూలు చేస్తున్నాయన్న సంగతి అందరికీ తెలియకపోయినా ఇలా అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్న ఇ కామర్స్ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఇది కస్టమర్లను దోపిడీకి గురి చేయడమేనని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై దర్యాప్తునకు ఆదేశించినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఇటీవల పలు ఇ కామర్స్ సంస్థలు సీవోడీ (క్యాష్ ఆన్ డెలివరీ) ఆప్షన్ ఎంచుకున్నందుకు ప్రత్యేకంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లుగా వినియోగదారుల వ్యవహారాల విభాగానికి కంప్లైంట్స్ వచ్చాయి. ఇ కామర్స్ సంస్థలు ఆఫర్ హ్యాండ్లింగ్ ఫీజు, పేమెంట్ హ్యాండ్లింగ్ ఫీజు, ప్రొటెక్ట్ ప్రామిస్ ఫీజు అని కొత్త కొత్త ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. ఈ పోస్టుపై కేంద్ర మంత్రి వెంటనే స్పందించారు. ఇలా అదనపు ఛార్జీలు వసూలు చేయడం అనేది వినియోగదారుల్ని తప్పుదోవ పట్టించి దోపిడీ చేసే చీకటి విధానమే అని అన్నారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఇ కామర్స్ సెక్టార్‌లో పారదర్శకత, న్యాయమైన విధానాలు కొనసాగించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేసింది కేంద్రం. ఆన్‌లైన్ షాపింగ్ అనేది.. వినియోగదారులకు మరింత విశ్వసనీయంగా ఉండేలా ఇ కామర్స్ సంస్థల మోసపూరిత విధానాల్ని నియంత్రించేందుకు కేంద్రం కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొంది.

## బిట్‌కాయిన్ రికార్డు ధర!



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ ఈ రోజు మరోసారి సరికొత్త రికార్డుస్థాయికి చేరింది. ఆదివారం ఆసియా మార్కెట్లలో బిట్‌కాయిన్ ధర 125,689 డాలర్లకు చేరుకుంది. ఇది ఆగస్టు 14న సృష్టించిన మునుపటి గరిష్టం 124,514డాలర్లను అధిగమించింది. ఈ ఏడాది ఇప్పటివరకు బిట్‌కాయిన్ ధర 30శాతం కంటే ఎక్కువ పెరిగింది. బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్‌ట్రేడెడ్ ఫండ్స్‌లో కొత్త పెట్టుబడులు ఈ ర్యాలీకి ఊతం ఇచ్చాయని నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో బుధవారం నుంచి ప్రభుత్వ షట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గ చూపుతున్నారు. మార్కెట్ నిపుణులు దీనిని డీబేస్‌మెంట్ ట్రేడ్ అని పిలుస్తున్నారు. ఇక్కడ డాలర్ విలువ తగ్గుతుందనే భావనతో బిట్‌కాయిన్ వంటి ఆస్తులకు డిమాండ్ పెరుగుతోంది. స్టాక్స్, బంగారం, ఇతర సేకరణ వస్తువులు కూడా గరిష్ట స్థాయిలకు చేరుతున్నాయి. డాలర్ విలువ తగ్గుతుందన్న నేపథ్యంలో బిట్‌కాయిన్ లాభపడుతోందని క్రిప్టో ప్రైమ్ బ్రోకరేజ్ సంస్థ ఫాల్కన్‌ఎక్స్ మార్కెట్స్ కో హెడ్ జోషువా లిమ్ అన్నారు. అక్టోబర్ బిట్‌కాయిన్‌కు శుభవార్త తెచ్చే నెల అని చెప్పవచ్చు. ఎందుకంటే గత 10 సంవత్సరాల్లో 9 సార్లు ఈ నెలలోనే బిట్‌కాయిన్ ధర పెరిగింది. ఈ కారణంగా ఈ నెలను ఉప్టోబర్ అని పిలుస్తారు. ఇప్పుడు కూడా ఈ ట్రెండ్ కొనసాగుతోంది. అమెరికా స్టాక్ మార్కెట్ శుక్రవారం రికార్డు స్థాయిలకు చేరడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెద్ద ఒప్పందాలు, బిట్‌కాయిన్‌పై పెరుగుతున్న నమ్మకం ఈ ర్యాలీకి ఊతమిచ్చాయి. అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హయాంలో క్రిప్టో కరెన్సీలకు అనుకూలమైన చట్టాలు అమలులోకి వచ్చాయి. ఈ వాతావరణం బిట్‌కాయిన్ ధర పెరుగుదలకు దోహదపడింది. మైఖేల్ సేలర్ నేతృత్వంలోని స్ట్రాటజీ పబ్లిక్ కంపెనీలు బిట్‌కాయిన్‌ను పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా చేశాయి. ఈ వ్యూహం ఇతర చిన్న క్రిప్టోలైన ఈథర్ వంటి ఆస్తులకు కూడా విస్తరించింది.

## జూలియన్ ఆగ్రో బంపర్ ఆఫర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** లార్జ్ క్యాప్ కేటగిరిలోని కన్‌స్ట్రక్షన్ సెక్టార్ సంస్థ జూలియన్ ఆగ్రో ఇన్ఫ్రాటెక్ లిమిటెడ్ బంపర్ ఆఫర్ ఇచ్చింది. తమ షేర్ హోల్డర్లకు ఉచితంగా షేర్లు ఇస్తామని తెలిపింది. కంపెనీ బోర్డు డైరెక్టర్స్ 1:1 రేషియోలో బోనస్ షేర్లు ఇచ్చేందుకు అంగీకరించారు. 100 షేర్లు కొన్న వారికి మరో 100 షేర్లు ఉచితంగా లభిస్తాయి. ఇక ఈ బోనస్ షేర్ల రికార్డు డేట్ ఈనెల 6గా నిర్ణయించారు. ఈ కంపెనీ షేర్లు అక్టోబర్ 6న ఎక్స్‌బోనస్ ట్రేడ్ చేయనున్నాయి. జూలియన్ ఆగ్రో ఇన్ఫ్రాటెక్ లిమిటెడ్ కంపెనీ స్టాక్ రూ. 10 లోపు ధర ఉన్న ఒక పెన్నీ స్టాక్. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం ఇటీవలే కంపెనీ బోర్డు డైరెక్టర్స్ భేటీ అయ్యి 1:1 రేషియోలో బోనస్ షేర్లు జారీ చేయడానికి ఆమోదం తెలిపారు. అంటే రికార్డు తేదీ నాటికి రూ. 5 ఫేస్ వ్యాల్యూ ఉన్న 1 ఈక్విటీ షేరును తమ డీమ్యాట్ ఖాతాలో కలిగి ఉన్న వారికి అదనంగా రూ. 5 ఫేస్ వ్యాల్యూ ఉండే 1 ఈక్విటీ షేరుని బోనస్ రూపంలో ఇస్తాని తెలిపింది. ఇక ఈ బోనస్ షేర్లు ఇచ్చేందుకు రికార్డు డేట్ ఈనెల 6గా బోర్డు డైరెక్టర్స్ నిర్ణయించారు. ఆ తేదీలోపు షేర్లు కొన్నవారికి ఉచిత షేర్లు పొందేందుకు అర్హత లభిస్తుంది. మరోవైపు కంపెనీకి బోర్డు డైరెక్టర్స్ మరోసారి ఈనెల 21వ తేదీ సమావేశం కానుంది. 2026 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ నెలతో ముగిసే రెండవ త్రైమాసికానికి ఆడిట్ చేయని కంపెనీ ఆర్థిక ఫలితాలను ఆమోదించనున్నారు. రెండో మధ్యంతర డివిడెండ్ సైతం ఆమోదం తెలుపనున్నట్లు కంపెనీ వెల్లడించింది. గత వారంలో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో జూలియన్ ఆగ్రో ఇన్ఫ్రాటెక్ లిమిటెడ్ స్టాక్ ధర 2.48 శాతం నష్టంతో రూ. 6.86 వద్ద స్థిరపడింది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయి రూ. 17.22, కనిష్ఠ ధర రూ. 6.55 వద్ద ఉన్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 41 కోట్ల వద్ద ఉంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.